

పాఠకులు,
ప్రకటనకర్తలు, ఏజెంట్లు,
శ్రేయోభిలాషులకు 80వ
స్వాతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలు
-డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 196 పేజీలు: 10+4 వెల: 6.50


ప్రపంచదేశాల్లో పెరుగుతున్న భారత్ క్రేజ్

భారతీయ రైల్వేలపైనే ఐఎస్ఐ ఫోకస్

5లో

# తాగునీటికి ప్రాధాన్యత

వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ

నెలవారీ లక్ష్యాలతో ప్రాధాన్యతా ప్రాజెక్టులు పూర్తి

డేటా సెంటర్లకు నీటి సీటి సరఫరాపై దుష్ప్రచారం

అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం

జలవనరుల శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం



శుక్రవారం జలవనరుల శాఖపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, ఆగస్టు 14 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జల వనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార జలహారతి కార్యక్రమాల అమలుపై సిఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు జల వనరుల శాఖ సిఎంకు తెలియచేసింది. ఇసిఆర్ఎఫ్ గ్యాప్-1, గ్యాప్-2 పనులు శరవేగంగా చేపట్టామని వివరించారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు గోదావరికి వచ్చినా ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగించినట్టు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రహదారులతో పాటు డ్యామ్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులు కూడా చేపట్టాలని సిఎం సూచించారు. ప్రాజెక్టు సమీపంలో >>2



ఉగ్రవాదులు మూల్యం చెల్లించాల్సిందేనని చెప్పిన ఆపరేషన్ సింధూర్

శాంతి, పరస్పర సహకారమే విదేశాంగ విధానానికి పునాది

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జాతికి రాష్ట్రపతి ముర్ము సందేశం

వికసిత్ భారత్ లక్ష్యసాధనలో

# భాగస్వాములు కండి

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** వికసిత్ భారత్ లక్ష్యసాధనకు ప్రతి ఒక్క భారతీయ పౌరుడు భాగస్వామి కావాలని రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. 2047 నాటికి వికసిత్‌భారత్ లక్ష్యసాధనవైపు వడివడిగా అడుగులు పడుతోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. 80వ స్వాతంత్రయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. జాతీయభద్రతకోసం ప్రభుత్వం, సమాజం ఏకతాటిపై నిలిచి >>2

సిఎం చంద్రబాబు, మంత్రి నారాయణకు

# సుప్రీంలో ఊరట

ఆళ్ల రామకృష్ణారెడ్డి పిటిషన్ కొట్టివేత

- హైకోర్టు తీర్పును సమర్థించిన ధర్మాసనం
- అమరావతి అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకున్న తర్వాత ల్యాండ్ పూలింగ్ చేశారని ఆళ్ల ఆరోపణ

**విజయవాడ, ఆగస్టు 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి పి.నారాయణకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. అమరావతి అసైన్డ్ భూముల ల్యాండ్ పూలింగ్‌కు వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో పూర్తిగా డిస్మిస్ చేసింది. రాజకీయ కారణాలతో ఇలాంటి అంశాలు లేవనెత్తుతున్నారని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఈ వ్యవహారంపై సిఐడి నమోదు >>2



అర్థరాత్రి వెలుగొండ టన్నెల్స్‌లోకి మంత్రి నిమ్మల

# పనుల పరిశీలన

అధికారులకు, గుత్తేదారులకు మార్గ నిర్దేశం

అలసత్వం వహిస్తే సహించం: మంత్రి హెచ్చరిక

**మార్కాపురం, ఆగస్టు 14, ప్రభాతవార్తప్రతినిధి:** మూడు జిల్లాల సాగునీరు, తాగునీరు అందించే భారీ సాగునీటి ప్రాజెక్ట్ అయిన వెలుగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు సాగిస్తుంది. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి కృష్ణానది నుంచి నీటిని విడుదల చేసేందుకు సన్నహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మాత్యులు నిమ్మల రామానాయుడు స్వయంగా వెలుగొండ పనులను పరివేక్షిస్తున్నారు. గురువారం సాయంత్రం వరకు వెలుగొండ నిర్వాసితులతో మాట్లాడిన రామనాయుడు ఆ తర్వాత అర్ధరాత్రి సమయములో సొరంగా నిర్మాణాల్లోకి వెళ్లి పనులను పరిశీలించారు.

వారం రోజుల్లో మిగిలిపోయిన పనులను ఎట్టి పరిస్థితుల్లో పూర్తిచేయాలని అధికారులకు, గుత్తేదారులకు మార్గ నిర్దేశం చేశారు. సొరంగ నిర్మాణాల్లో పూర్తి కావలసిన పనులపై మంత్రి రామనాయుడు స్వయంగా సొరంగాలోకి వెళ్లి పరిశీలించారు. దాదాపు 4 గంటల పాటు టన్నెల్‌లోనే ఉండి, టీబీఎం మెషిన్ వెలికితీత, లైనింగ్ పనులను అధికారులు, ప్రతినిధులతో కలిసి స్వయంగా చర్చించారు. ఉన్న పనులను మరో వారంలో పూర్తి చేయాల్సి ఉంది. ఈ నెలలోనే జంట సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను విడుదల చేసేందుకు పనులను సర్వ వేగంగా చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నల్లమల సాగర్‌లో కృష్ణా జలాలకు జలహారతి ఇస్తారని మంత్రి స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా ప్రజల 3 దశాబ్దాల చిరకాల కోరికను కూటమి ప్రభుత్వం నెరవేర్చబోతుందన్నారు. గతంలో గొడ్డలి పార్టీ నాయకుడు వెలుగొండను జాతికి అంకితం చేశామంటూ ప్రజలను మోసం చేశారన్నారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు భరోసా ఇచ్చారు. వెలుగొండ నీటిని విడుదల చేసేందుకు ముందుగా రైల్ రన్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పనులను కృతజ్ఞతలు పూర్తి చేసి నెలాఖరులోపు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయడమే తమ కర్తవ్యమన్నారు.

డ్వాక్రా సభ్యులకు శుభవార్త

# రూ.3 లక్షల రుణం



ఆపై సబ్సిడీ అందజేత

పిఎంఎఫ్ఎంఇ - స్త్రీనిధి సరికొత్త పథకం

ఆహార శుద్ధి రంగంలో సరికొత్త అవకాశాలు

ఉపాధి కల్పించే పారిశ్రామిక వేత్తలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయవాడ, ఆగస్టు 14 ప్రభాతవార్త ప్రతినిధి:** డ్వాక్రా మహిళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది. మహిళలను ఉపాధి కలినపంచే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'పిఎంఎఫ్ఎంఇ- స్రీనిద్ధి అనుసంధాన పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పథకం ద్వారా అర్హులైన డ్వాక్రా మహిళలకు ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్ది, వారు ఉద్యోగం కోరుకునే స్థాయి >>2

# పోలవరం సివిల్ వర్క్స్ 90శాత్తం పూర్తి: మంత్రి నిమ్మల

**సచివాలయం,ఆగస్టు 14,ప్రభాతవార్త :** పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతో పాటు మొత్తం 36ప్రాధాన్యతా ప్రాజెక్టులు,ఐడిసి లిఫ్ట్స్ స్కీమ్ వంటి అంశాలతో పాటు ఎల్‌నినో వంటి సందర్భంలో తాగునీటి అవసరాల నిమిత్తం ఏరకంగా ప్రణాళిక తీసుకుంటున్నాం అనే అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్షా సమావేశంలో చర్చించడం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతి సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు సివిల్ వర్క్స్ 90శాతం పూర్తయ్యాయని, భూసేకరణ 94శాతం పూర్తి చేశామని, అదేవిధంగా ఆర్ అండ్ ఆర్ నిర్వాసితులకు తరలింపు 52శాతంపూర్తయిందని, ఇలా మొత్తం పోలవరం ప్రాజెక్టు ఇప్పటివరకు 77శాతం పూర్తిచేయడం జరిగిందని స్పష్టం చేశారు. మిగిలిన బ్యాలెన్స్ పనులు కూడా త్వరితగతిన, అంటే ఇచ్చినటువంటి షెడ్యూల్ ప్రకారమే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

**2027మార్చినాటికి పోలవరం పూర్తి:** పోలవరం ప్రాజెక్టుకు వాస్తవంగా ఇచ్చినటువంటి షెడ్యూల్ 2027 డిసెంబర్, కానీ చంద్రబాబు పుష్కరాలు వస్తున్నాయి కాబటి పుష్కరాల కంటే ముందుగానే పూర్తిచేయండి, మార్చినెలకే అని ఆదేశాలు ఇచ్చారని, దాని ప్రకారమే ఈ 2027మార్చి కల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసే లక్ష్యంగానే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇటీవల మొదటి సారి, గోదావరికి 14లక్షల క్యూసెక్కుల వరద వచ్చినటువంటి పరిస్థితిలో కూడా పనులు ఆగకుండా జరగడం పట్ల సిఎం చంద్రబాబునాయుడు అభినందించారని తెలిపారు. అందుకే గ్యాప్-1 ఈసిఆర్ఎఫ్ పనులు 48శాతం, గ్యాప్-2 ఈసిఆర్ఎఫ్ పనులు 36శాతం పూర్తయ్యాయని వివరించారు. ఈ విధంగా ఈసిఆర్ఎఫ్ డిజైన్స్ ప్రకారం 45.72మీటర్లకుపూర్తి చేసుకోగలుగుతున్నామని, ఈసిఆర్ఎఫ్‌డ్యాంనిర్మాణం వల్ల ఆప్రాంతంలోగండి పోచమ్మ దేవాలయాన్నిపరిరక్షిస్తూ సెంటిమెంట్‌ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం ఆదేశించారన్నారు.

# సీదిరి అప్పలరాజు జైలు నుంచి విడుదల



షరతులతో బెయిల్ మంజూరు చేసిన సోంపేట కోర్టు

న్యాయస్థానాలపై నమ్మకముంది: మాజీ మంత్రి వ్యాఖ్య

**పలాస (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 14 ప్రభాతవార్త:** వైసిపి నేత, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జైలు నుంచి విడుదలయ్యారు. అప్పలరాజుకు శుక్రవారం మధ్యాహ్నం సోంపేట ఆరో అదనపు జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేయగా, సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు. రోడ్డు ప్రమాదం కేసులో సాక్ష్యాధారాలను తారుమారు చేశారన్న ఆరోపణలతో జులై 22న పోలీసులు అప్పల రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి >>2

# 21 మంది పోలీసులకు అవార్డులు

**విజయవాడ.ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, అగ్నిమాపక,హోంగార్డు, పౌర రక్షక విభాగాల్లో విశేష సేవలందిస్తున్న సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక గ్యాలంట్రీ,సేవా పతకాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న మొత్తం 1057 మందిని ఈ పతకాల కోసం కేంద్ర హోంశాఖ ఎంపిక చేసింది. ఇందులో 92 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 301 మందికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ (శౌర్య పతకాలు), 664 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) దక్కనున్నాయి.ఈ అవార్డులో >>2

# సెప్టెంబరు నుంచి కులగణన

నోటిఫికేషన్ విడుదల




**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** జనాభా లెక్కల సేకరణకు చెందిన ప్రశ్నావళిని కేంద్ర హోంశాఖ రిలీజ్ చేసింది. 2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా 40 ప్రశ్నలు అడగనున్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ నోటిఫికేషన్ జారీ చేశారు. 1948 జనాభా లెక్కల చట్టం కింద ఆ నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. ఇంటింటి సర్వేలో సమాచార సేకరణ కోసం మొత్తం 40 ప్రశ్నలు వేస్తారు. భౌగోళిక, సామాజిక, విద్యా, ఆర్థిక అంశాల వివరాలను ప్రశ్నావళిలో అడగనున్నారు. వ్యక్తి పేరు, ఇంటి యాజమానితో రిలేషన్, లింగం, పుట్టిన తేది, వయసు, మ్యారేజ్ స్టేట్, జీవిత భాగస్వామి పేరు, నేషనాలిటీ లాంటి సమాచారాన్ని సేకరించనున్నారు. ఇక మతపరమైన అంశాల్లో షెడ్యూల్ కులమా లేక షెడ్యూల్ తెగకు చెందిన వారా అని తెలుసుకోనున్నారు. కులం, తల్లితండ్రులు, వైకల్యం, మాతృభాషతో పాటు ఇతర అంశాలను సేకరిస్తారు. అక్షరాస్యత, డిజిటిల్ లిటిరసీ స్టేటస్ కూడా తెలుసుకుంటారు. కోవిడ్19 టీకా తీసుకున్నారా, ఎన్ని బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి, డాక్యుమెంట్ల వివరాలు, మొబైల్ నెంబర్, ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు వివరాలు కూడా సేకరించనున్నారు. లడాక్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో సెప్టెంబర్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు జనాభా లెక్కల సమాచారాన్ని సేకరించనున్నారు. దేశంలోని మిగితా ప్రాంతాల్లో వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణ జరగనున్నది. జనాభా లెక్కల్లో భాగంగా తొలిసారి కులం వివరాలను సేకరించనున్నారు. గత ఏడాది ఏప్రిల్ 30వ తేదీన ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ కమిటీ భేటీలో కుల వివరాల సేకరణ కూడా చేపట్టాలని నిర్ణయించారు. యావత్ జనాభా లెక్కల ప్రక్రియ మొత్తం డిజిటల్ విధానంలో జరగనున్నది. తొలి దశలో భాగంగా ఇప్పటి హౌజ్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ ప్రక్రియ జరుగుతున్నది. సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఆ సమాచారాన్ని సేకరిస్తారు. ఏప్రిల్ 16వ తేదీన ఈ ప్రక్రియ మొదలైంది. దేశవ్యాప్తంగా ఉన్న కట్టడాలు, ఇండ్లు, ఇంటి నిర్మాణాల సమాచారాన్ని ఎన్యుమరేటర్లు సేకరిస్తున్న విషయం తెలిసిందే. జనాభా లెక్కల నిర్వహణ కోసం కేంద్రం సుమారు 11 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.


# తిరుమలలో నెలాఖరున వరుణ యాగం

**తిరుమల,ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో దాదాపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సకాలంలో కురవాల్సిన వర్షాలు కురవకపోవడంతో ఎట్టకేలకు టిటిడి వరుణయాగం నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈనెలాఖరులో 30,31తేదీల్లో వరుణయాగం జరిపించేలా తాజాగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. శుక్రవారం ఈ విషయంపై తిరుమలలో టిటిడి అర్చకులు, వేదపండితులు, అదికారులతో చర్చించడం జరిగింది. వరుణయాగంతో దేశం సుభిక్షంగా ఉంటుందని భావిస్తున్నారు. గతంలోనూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురైనపుడు టిటిడి కారీరిష్టి వరుణయాగం, వరుణజపం నిర్వహించింది. వర్షాభావ పరిస్థితుల్లో వరుణయాగం జరిపించడంపై గతనెలలో "వార్త"ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై టిటిడి బోర్డులో చర్చించినా ఆ దిశగా నిర్ణయాలు తీసుకోలేదు. తాజాగా వైసిపి నుండి ,భక్తుల నుండి వస్తున్న విజ్ఞప్తులతో టిటిడి బోర్డు వరుణయాగం నిర్వహించేందుకు సుముఖత చూపుతున్నట్లు సమాచారం. ఈనెలారులలో రెండురోజులు ఈ యాగం జరిపించేందుకు ఆలోచన చేస్తున్నారు. దీనిపై అదికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ప్రభావం కూడా తెలుగురాష్ట్రాల్లో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌పై ఆశాజనకంగా లేదు. దీంతో జులై రెండవ వారంలో కూడా వర్షాలు చినుకు అనేది లేకపోవడంతో ప్రజలు ఏప్రిల్,మేనెల ఎండలను చవిచూస్తున్నారు. ఓ వైపు సూర్యుని వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా మరోవైపు రాత్రి వేళ ఉష్ణోగ్రతలు కూడా మరీ దారుణంగా ఉన్నాయి.

# ఆంక్షలు విధించడానికి మీరెవరు?

నల్సార్ విద్యార్థులపై బార్‌కౌన్సిల్ ఆదేశాలు

తప్పుబట్టిన సిజె సూర్యకాంత్




**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** నల్సార్ విద్యార్థులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జారీ చేసిన ఆదేశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థులు శాంతియుతంగా తమ అభిప్రాయాలను, నిరసనను వ్యక్తం చేసే హక్కు కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. ఈ విషయంలో బీసీఐ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు ఏదైనా సమస్యపై నిరసన తెలిపే కారణం ఉంటే ఇందులో బీసీఐకి ఎలాంటి సంబంధం లేదు. మేము మీకు అండగా ఉన్నాం. విద్యార్థులు నాకు లేఖ రాశారు. ఇది విద్యార్థులకు, నాకు మధ్య జరిగే సంభాషణ. బీసీఐ తీసుకున్న చర్య పూర్తిగా అనవసరం. ఎలాంటి కారణం లేకుండా తీసుకున్న చర్య. నేను కూడా విద్యార్థిగా ఉన్నప్పుడు విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నాను. వారు శాంతియుతంగా తమ గొంతు వినిపిస్తున్నారు. అలా చేయడానికి వారిని అనుమతించాలని సీజేఐ పేర్కొన్నారు. ఏ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం లేదా ఇతర న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు, అధ్యాపకులపై బీసీఐ లేదా ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్ అయినా శిక్షాత్మక చర్యలు తీసుకోరాదని సీజేఐ ఆదేశించారు.నోటీసులు జారీ చేయాలి. ఈలోగా ఏ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం/న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి లేదా అధ్యాపకుడిపై ఎలాంటి శిక్షాత్మక చర్యలు తీసుకోకూడదని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.కోర్టు నోటీసును బీసీఐ అంగీకరించింది. వివాదానికి కారణమైన సర్క్యులర్‌ను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు తెలిపింది. దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు బీసీఐకి సుప్రీంకోర్టు రెండు వారాల సమయం ఇచ్చింది. లేఖల్లో పేర్కొన్న ఘటనలకు సంబంధించి నల్సార్ విద్యార్థులపై ఎలాంటి శిక్షాత్మక చర్యలు తీసుకోరాదని మరోసారి స్పష్టం చేసింది.యువకులు చేసిన ఏదైనా తప్పు వ్యాఖ్య కారణంగా వారి నిరసన తెలిపే హక్కును హరించరాదని సీజేఐ అన్నారు. విద్యార్థులు నిరసనల్లో పాల్గొనేందుకు వెనుకాడవద్దని సూచించారు. యువకులుగా ఉన్నప్పుడు ఎవరైనా తప్పుగా ఏదైనా వ్యాఖ్య చేసినంత మాత్రాన వారికి నిరసన తెలిపే హక్కు ఉండదని కాదు. విద్యార్థులందరికీ ఈ విషయాన్ని చెప్పండి. వారు బార్‌లో నమోదు చేసుకుని సుప్రీంకోర్టు బార్‌లో చేరాలి. మేము వారిని న్యాయ సహాయ కోర్సులకు ఎంపిక చేస్తామని సీజేఐ వ్యాఖ్యానించారు. బీసీఐ అన్ని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేస్తూ, నల్సార్‌నుంచి 2026లో పట్టభద్రులైన విద్యార్థులను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దని పేర్కొంది. ఈ వ్యవహారానికి బాధ్యులైన విద్యార్థులను గుర్తించి నివేదిక ఇవ్వాలని కూడా కోరింది.అయితే ఈ ఆదేశాలపై సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో కొన్ని గంటల్లోనే బీసీఐ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఈ అంశంపై తమ వద్ద సమర్పించిన సమాచారాన్ని పరిశీలించిన అనంతరం ఆగస్టు 19న తుది నిర్ణయం తీసుకుంటామని న్యాయవాదుల అత్యున్నత చట్టబద్ధ సంస్థ తెలిపింది.హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీకి చెందిన కొంతమంది విద్యార్థులు ఈ ఏడాది జూలైలో వీసీ, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లకు లేఖ రాశారు. విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి సీజేఐని ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను వారు వ్యతిరేకించారు. అయితే స్నాతకోత్సవ తేదీ ఇంకా ఖరారు కాలేదు.

# విద్యుత్ అలంకరణతో ఆకట్టుకుంటున్న అసెంబ్లీ, సచివాలయ భవనాలు



స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న సచివాలయ విభాగాలు

**విజయవాడ,ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయ భవనాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ప్రతిబింబించేలా సచివాలయంలోని ఐదు భవనాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. అసెంబ్లీ భవనాన్ని సైతం వివిధ రకాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో భవన సముదాయం విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలుపు తోంది. అసెంబ్లీ,సచివాలయ ప్రాంగణాల్లోని రహదారులకు ఇరువైపులా, సెంట్రల్ పార్కులో వివిధ రంగులతో కూడిన ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం ప్రాంగణం విద్యుత్ వెలుగులతో శోభాయమానంగా మారి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది.

స్వాతంత్ర్య దినోత్సవ వేడు కల సందర్భంగా విజయవాడలోని లోక్ భవన్, ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, ప్రకాశం బ్యారేజ్, ప్రఖ్యాత ఉండవల్లి గుహలు, ఇతర చారిత్రక ప్రాముఖ్యత కలిగిన భవనాలు, ప్రముఖ కట్టడాలను సైతం విద్యుత్‌దీ పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఈ ప్రత్యేక విద్యుత్ అలంకరణలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయ భవనాలకు మరియు నగరానికి మరింత శోభను తీసుకువచ్చాయి.



సచివాలయ ప్రాంగణంలో విద్యుత్తు అలంకరణ

# తాగునీటికి ప్రాధాన్యత

>> గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షి స్తూ స్థానికుల సెంటిమెంట్‌ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా విశాఖ వరకూ ఎడమ కాలువ బ్యాలెన్సు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈలోగా అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నింపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పోలవరం కుడి ఎడమ కాలువల్లో 17,500 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. రెండు కాలువలకూ మంచి పేర్లను సూచించాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలోని ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు పర్యాటకం గానూ తీర్చిదిద్దాలన్నారు.

**డేటా సెంటర్లకు 3.5 టిఎంసిల నీరు చాలు:** డేటా సెంటర్లకు నీటి అవసరాలపై కొందరు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, మొత్తంగా వాటికి 3.5 టిఎంసిల నీరే సరిపోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో తాగు నీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ తదుపరి పారిశ్రామిక అవసరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఈ సీజన్‌లో ఆరు తడి పంటలు సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగేలా జలధార- జలహారతి పనుల్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుష్కలంగా నీటి వనరులు ఉన్న రాష్ట్రంగా గోదావరి నీటిని అటు ఉత్తరాంధ్రకు, ఇటు కృష్ణా డెల్టా ప్రాంతానికి అవసరమైనంత మేర నీరు తీసుకునే ఆస్కారం ఉందన్నారు. విశాఖ నుంచి అమరావతి వరకూ అంతర్గత జల రవాణా మార్గాలతో అనుసంధానించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల శాఖ ఆధీనంలో ఉన్న భూముల్ని సద్వినియోగం చేసుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయటంతో పాటు నిర్వాసితుల సమస్యల్ని కూడా మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోకా పూర్తి చేయాలన్నారు. దీనికోసం నెల వారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఆయకట్టుకు నీరిచ్చే అంశాన్ని కూడా అధ్యయనం చేయాలని సిఎం సూచించారు. ఈ సమీక్షకు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇఎన్‌సి, సిఇలు హాజరయ్యారు.

# సీదిరి అప్పలరాజు జైలు నుంచి విడుదల

>> ఆయన అంపోలు జైలులో ఉన్నారు. అప్పలరాజు బెయిల్ కోసం సోంపేట కోర్టును ఆశ్రయించగా, గతంలో పిటిషన్‌పై విచారణలు, వాయిదాలు కొనసాగాయి. తాజాగా శుక్రవారం బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఆయనకు షరతులతో బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జులై 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందారు. ఈ ఘటనలో అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మపై కేసు నమోదైంది. అనంతరం కేసులో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై అప్పలరాజును పోలీసులు నిందితుడు ఏ3గా చేర్చి అరెస్టు చేశారు. అప్పలరాజు అరెస్టు, రిమాండ్, బెయిల్ వ్యవహారం స్థానికంగానూ, రాజకీయంగా కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. 'కోర్ట్ మీద మన రాజ్యాంగం మీద ఉన్న నమ్మకాన్ని మరింత బలపడింద్ధి అని బెయిల్‌పై విడుదలైన అనంతరం మాజీ మంత్రి, వైసిపి నేత డాక్టర్ సీదిరి అప్పలరాజు వ్యాఖ్యానించారు. తనకోసం ఎంతో అభిమానంతో ఎదురు చూసిన కార్యకర్తలకు, పూర్తిగా సహకరించిన నాయకులు ధర్మాన సోదరులకు, వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల ఆందోళన వాయిదా

**విజయవాడ.ఆగస్టు14,ప్రభాతవార్తప్రతినిధి:** కొంత కాలం నుంచి వివిధ సమస్యలపై నిర్వహిస్తున్న దశలవారి ఆందోళనలను ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ శ్రీనివాసరావు వెల్లడించారు. ఆర్టీసీ జేఏసీ ఎలక్ట్రిక్ బస్సుల వ్యవహారం, నియామకాలు, సహా పలు సమస్యలతో యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పలు మార్లు సంబంధిత అధికారులతో చర్చలు జరిగి విఫలమవగా, కొన్ని మీటింగ్ లలో వివిధ సమస్యలకు పరిష్కారం దక్కింది. కానీ తమ డిమాండ్లు పూర్తిస్థాయిలో ఫలించలేదని ఆర్టీసీ ఐకాస నిరసన కొనసాగించింది. ఆ విషయంలో నమ్మకం కలిగింది: ఇప్పటికే వారు తమ డిమాండ్లపై ఆర్టీసీ ఎండీతో అయిదు సార్లు సమావేశమైనట్లు ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ బస్సుల అంశంపై సానుకూల నిర్ణయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నియామకాల విషయంలో తమకు నమ్మకం కలిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఎండీ నుంచి లిఖితపూర్వక హామీ వచ్చిందని జేఏసీ సభ్యుడు దామోదర్ వివరించారు. ఇచ్చిన వాటిపై సర్క్యులర్ ఇస్తామని ఎండీ భరోసా ఇచ్చారన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం కొత్త జిల్లా కేంద్రాల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామన్నారని దామోదర్ తెలిపారు. విశాఖలో 20 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనలో ఏపీ జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. ఈ మేరకు వారి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తుంది. విద్యుత్ బస్సుల సమస్యపై ముందే స్పష్టత: గతంలో జరిగిన చర్చల్లో ఆర్టీసీలో విద్యుత్ బస్సులు ప్రవేశ పెట్టడంవల్ల వచ్చే సమస్యలు, ఇబ్బందులు అధిగమించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తామని సంస్థ ఎండీ బాలసుబ్రహ్మణ్యం గత నెలలోనే ప్రకటించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేయగా, ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులతో చర్చలు సానుకూలంగా జరిగాయని జులై నెలలోనే తెలిపారు. ఈ క్రమంలో ఆర్టీసీ జెఏసీ నిరసనలు తాత్కాలికంగా వాయిదా వేసింది.

## బిసి రిజర్వేషన్‌లపై సిఎంకు డెడికేటెడ్ కమిషన్ నివేదిక

### కమిషన్ సిఫారసులపై నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం

### కూటమి ప్రభుత్వం హామీ అమలు దిశగా అడుగులు

### స్థానిక సంస్థల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్?

**విజయవాడ, ఆగస్టు 14 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ అమలుకు మరో కీలక అడుగు పడింది. రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా, బిసిల సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసిన ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని కమిషన్ సిఫార్సులపై ఇప్పుడు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంశన్ మిశ్రా సిఎం చంద్రబాబును కలిసి నివేదికను అందించారు. నివేదికలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల అమలు పై చేసిన సిఫారసుల్లో స్థానిక జనాభా ప్రకారం రిజర్వేషన్ల అమలు చేసేందుకు వీలుగా సూచనలు చేసినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో బిసిలకు ఇచ్చిన ప్రధాన హామీల్లో 34శాతం రిజర్వేషన్ ఒకటి. స్థానిక సంస్థల్లో బిసిలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచేలా ఈ రిజర్వేషన్లు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అయితే రిజర్వేషన్ల అమలుకు న్యాయపరమైన అంశాలు అడ్డంకిగా మారకుండా.. ముందుగా సమగ్ర అధ్యయనం చేయాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లను నిర్ణయించేందుకు కేవలం జనాభా లెక్కలు సరిపోవు. బిసిల సామాజిక, ఆర్థిక పరిస్థితులతో పాటు స్థానిక సంస్థల్లో వారి రాజకీయ ప్రాతినిధ్యం, వెనుకబాటుతనాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా వివరాలను సేకరించి అధ్యయనం చేయించారు.

**రాజీవ్ రంజన్ మిశ్రా కసరత్తు:** రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ జిల్లాల వారీగా పర్యటించింది. బిసి సంఘాలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, ఇతర వర్గాలతో సంప్రదింపులు జరిపింది. బిసిల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యం, రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై వివరాలు సేకరించింది. కమిషన్ నివేదిక ఇప్పుడు ప్రభుత్వానికి చేరింది. బిసిలకు ఎంత శాతం రిజర్వేషన్ కల్పించాలి? ఏ విధంగా అమలు చేయాలి? స్థానిక సంస్థల వారీగా రిజర్వేషన్లను ఎలా ఖరారు చేయాలి? అన్న అంశాల్లో కమిషన్ చేసిన సిఫార్సులు ఇప్పుడు కీలకం కానున్నాయి. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టనుంది.

## దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు..

**విజయవాడ.ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** యావత్ భారతావని 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న చారిత్రాత్మక సందర్భాన దేశ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్: "ఎక్స్" వేదిక పోస్టు చేసారు. ఈ పోస్టులో ఆయన మన స్వేచ్ఛ, సార్వభౌమత్వం, ప్రజాస్వామ్య విలువల కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను మననం చేసుకుంటూ భవిష్యత్ భారతాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

## వికసిత్ భారత్ లక్ష్యసాధనలో భాగస్వాములు కండి

>> నల్లే విద్యార్థుల వర్తమాన, భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పరీక్షల్లో సమగ్ర సంస్కరణలు తీసుకురావడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. పరీక్షల్లో అక్రమ మార్గాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టడం, పరీక్షల విధానాన్ని మరింత పారదర్శకంగా, సురక్షితంగా, యువతకు విశ్వసనీయంగా మార్చడం ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యాలని ముర్ము చెప్పారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలు కల్పిస్తున్న యువతలో పెరుగుతున్న వ్యాపార స్ఫూర్తిని రాష్ట్రపతి ప్రశంసించారు. ఉద్యోగాల కోసం వెతకడం కంటే స్వయం ఉపాధి, ఉద్యోగాల కల్పన వైపు యువత అడుగులు వేస్తోందని చెప్పారు. యువ పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో దేశంలో బలమైన స్టార్టప్ వ్యవస్థ ఏర్పడిందన్నారు. భారత యువత ప్రతిభ, అంకితభావంతో ఆకట్టుకుంటున్న అంతర్జాతీయ సంస్థలు వారికి కీలక నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తున్నాయని తెలిపారు. యువత సాధిస్తున్న విజయాలు ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠను పెంచుతున్నాయని, భారత సాయుధ దళాల అసమాన ధైర్యసాహసాలు దేశ ప్రతిష్టను ఇనుమడింపచేస్తున్నాయన్నారు. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారు ఎక్కడ దాక్కున్నా తమ చర్యలకు మూల్యం చెల్లించాల్సిందేనన్న స్పష్టమైన, కఠినమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ ఇచ్చిందని ముర్ము అన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాల దృష్ట్యా, ముఖ్యంగా రైతుల ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాత్మక చర్యగా రాష్ట్రపతి అభివర్ణించారు. దశాబ్దాలుగా దేశానికి తీవ్రమైన సవాలుగా ఉన్న నక్సలిజాన్ని నిర్మూలించడం గొప్ప విజయమని ముర్ము అన్నారు. బస్తర్ ఒలింపిక్స్, బస్తర్ పాండుమ్ వంటి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని ఆమె ప్రస్తావించారు. సారనాథ్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపుభారత నాగరికత, వారసత్వ గొప్పతనాన్ని ప్రస్తావిస్తూ.. భగవాన్ బుద్ధుడు తొలిసారిగా ధర్మబోధ చేసిన సారనాథ్‌ను ఈ ఏడాది యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చినట్లు రాష్ట్రపతి తెలిపారు. గత ఏడాది 12 మరాఠా సైనిక కోటలకు ఈ గుర్తింపు లభించిందన్నారు. ఆధ్యాత్మికతకు ప్రతీకలైన స్మారక చిహ్నాలతో పాటు సైనిక శక్తి, పోరాట స్ఫూర్తికి ప్రతీకలైన చారిత్రక కట్టడాలను కూడా భారత్ గర్వంగా సంరక్షిస్తోందని చెప్పారు.

**శాంతి,పరస్పర సహకారమే విదేశాంగ విధానానికి పునాది:** భారత విదేశాంగ విధానానికి శాంతి, సంభాషణ, సహకారం, వసుధైవ కుటుంబకం సూత్రాలు పునాదిగా ఉన్నాయని రాష్ట్రపతి తెలిపారు. నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను భారత్ విశ్వసిస్తోందన్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర బహుపాక్షిక సంస్థల్లో ప్రపంచ సమాజంలోని అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు భారత్ కృషి చేస్తోందని చెప్పారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో భారతదేశ ప్రాధాన్యం పెరుగుతోందని పేర్కొన్నారు. 70 ఏళ్లు పైబడిన వారికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యందేశంలో ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్నప్పటికీ వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతోందని ముర్ము తెలిపారు. 70 ఏళ్లు పైబడిన సుమారు 6 కోట్ల మంది వృద్ధులు ప్రభుత్వ పథకాల కింద ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందే అవకాశం కల్పించినట్లు చెప్పారు.



శుక్రవారం అగ్నిమాపక వాహనాలను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

## అగ్నిమాపక శాఖకు అధునాతన వాహనాలు

### -రూ.40 కోట్లతో 58 ఫైర్ ఫైటింగ్ వాహనాలు


### ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర అగ్నిమాపక శాఖను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక వాహనాలతో మరింత బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపకశాఖను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన సుమారు రూ.40 కోట్ల విలువైన 58 అగ్నిమాపక వాహనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో ఫైర్ సేఫ్టీ వాహనాలకు సీఎం జెండా ఊపారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఆ వాహనాల ప్రత్యేకతలను సీఎంకు వివరించారు. అలాగే గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడేలా... ప్రమాద ప్రాంతాలకు వేగంగా చేరుకుని తక్షణమే అగ్నిమాపక సేవలు అందించేలా రూ.18.68 కోట్ల విలువైన 25 అధునాతన అగ్నిమాపక వాహనాలు అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. పెద్ద అగ్నిప్రమాదాల సమయంలో నిరంతర నీటి సరఫరాకు ఉపయోగపడేలా రూ.14.79 కోట్ల విలువైన 20 వాటర్ బౌజర్లను సిద్ధంగా ఉంచుకున్నామని సీఎంకు అధికారులు చెప్పారు. ఒక్కో వాటర్ బౌజర్ 14 వేల లీటర్ల నీటిని తరలించే సామర్థం కలిగి ఉంటాయని... పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో మంటలను అదుపు చేయడంలో ఇవి కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు. ఇరుకైన, రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకునేలా రూ.6.37 కోట్ల విలువైన 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్ ఫైటింగ్ వాహనాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ.252.86 కోట్ల వ్యయంతో దశలవారీగా ఆధునిక వాహనాలు, పరికరాలను సమకూరుస్తున్నాం. తొలిదశలో రూ.33 కోట్ల వ్యయంతో 65 అగ్నిమాపక వాహనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాం. రెండో దశలో రూ.40 కోట్లతో 58 వాహనాలను ఇప్పుడే ప్రారంభించుకున్నాం. ఇక త్వరలో మూడో దశలోనూ మరిన్ని అగ్నిమాపక వాహనాలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నాం. వీటితో పాటు ఫైర్ స్టేషన్లల్లో మౌలిక వసతులపైనా ప్రత్యేక దృష్టి సారించాం. రాష్ట్రంలో 17 కొత్త ఫైర్ స్టేషన్ భవనాల నిర్మాణం జరుగుతుండగా, ఒక్కో భవనానికి రూ.2.25 కోట్ల చొప్పున ఖర్చు పెడుతున్నాం. వీటిలో ఆరు భవనాల నిర్మాణం పూర్తయింది. మరో 36 ఫైర్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక సేవల మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాదు... ప్రమాద తీవ్రతను తగ్గించేలా వేగంగా స్పందించగల వ్యవస్థను నిర్మించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని హోంమంత్రి అనిత ఈ కార్యక్రమంలో తెలిపారు. అందుకు అనుగుణంగానే అగ్నిమాపక శాఖను దశలవారీగా ఆధునీకరిస్తున్నాం" అని పేర్కొన్నారు. ట్టణాలు, నగరాల్లోని ఇరుకైన వీధులు, జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలు, సాధారణ భారీ అగ్నిమాపక వాహనాలు వేగంగా చేరుకోలేని ప్రాంతాల్లో తక్షణమే స్పందించేందుకు 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో వాడే భాష పరిధి దాటవద్దు: డి.సిఎం పవన్

**విజయవాడ.ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** సోషల్ మీడియాలో వాడేభాష, భావ వ్యక్తీకరణ విషయంలో పరిధి దాటవద్దని పార్టీ కార్యకర్తలకు వీరమహిళలకు జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక విజ్ఞప్తి చేశారు. "ఎక్స్" వేదిక చేసిన పోస్టులో సోషల్ మీడియా వేదికగా వివిధ విషయాలపై మాట్లాడే సమయంలో, అలాగే పోస్టులు పెట్టేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సిఎం చంద్రబాబు, మంత్రి నారాయణకు సుప్రీంలో ఊరట



>> చేసిన ఎఫ్ఐఆర్‌లను క్వాష్ చేస్తూ గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం పూర్తిగా సమర్థించింది. హైకోర్టు ఇచ్చిన ఆ తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు లేవని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజధాని ల్యాండ్ పూలింగ్, జిఒల జారీ అనేవి కేవలం పరిపాలనాపరమైన విధాన నిర్ణయాలని, ఇదిపూర్తిగా రాజకీయ కక్షసాధింపుతో నమోదైన కేసు అని, గతంలో ఏపి హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. అసైన్డ్ భూముల విషయంలో అసలైన బాధితులెవరూ కోర్టుకు రానప్పుడు, రాజకీయ ప్రత్యర్థులు దాఖలు చేసే ఇలాంటి పిటిషన్లకు చట్టబద్ధత ఉండదన్న హైకోర్టు అభిప్రాయంతో సిజెఐ ధర్మాసనం పూర్తిగా ఏకీభవించింది. ఈ సందర్భంగా న్యాయస్థానాలను రాజకీయ కక్షసాధింపులకు వేదికగా మార్చవద్దని సుప్రీంకోర్టు హితవు పలికింది.

# 21 మంది పోలీసులకు అవార్డులు

>> ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తం 21 మంది ఈ జాబితాలో చోటు సంపాదించుకున్నారు. వీరిలో ఏడుగురు పోలీసులకు గ్యాలంట్రీ మెడల్స్, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 11 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు లభించాయి. ఏపీకి చెందిన ఐజీ గుడి విజయ్ కుమార్, ఐజీ బలంకారి వెంకట రామిరెడ్డి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. హెడ్ కానిస్టేబుళ్లు కొర్లాన మహేశ్, పైడి శ్రీరామమూర్తి అడారి హేమసుందర రావు, చింతపల్లి సత్యనారాయణ, రౌతు మహేశ్, ఆబోతుల అప్పలనాయుడు, రుతాల కన్నబాబు గ్యాలంట్రీ మెడల్స్ దక్కాయి.

## ఇండియన్ పోలీస్ మెడల్‌కు సయ్యద్ మహబూబ్ బాషా ఎంపిక



**విజయవాడ,ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** రెండు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో విశిష్ట, ప్రశంసనీ యమైన సేవలు అందించిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ) అసిస్టెంట్ కమాండెంట్ (డీఎస్పీ ర్యాంక్) సయ్యద్ మహబూబ్ బాషాను భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఖఇండియన్ పోలీస్ మెడలకు ఎంపిక చేసింది. విధి నిర్వహణ పట్ల అసాధారణమైన అంకితభావం, నిబద్ధత, నిష్కళంకమైన నిజాయితీ ఇంకా ఆదర్శప్రాయమైన వృత్తి నైపుణ్యాన్ని కనపరించినందుకు అత్యున్నతమైన జాతీయ ఖఇండియన్ పోలీస్ మెడల్ పురస్కారంతో సత్కరించనున్నారు.

# రూ.3 లక్షల రుణం

>> నుంచి ఉపాధి కల్పిం చే పారిశ్రామిక వేత్తలుగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పిఎంఎఫ్ఎంఇ) పథకాన్ని స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌తో అనుసంధానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ పథకంలో అర్హత కలిగిన డ్వాక్రా మహిళలు రూ.3 లక్షల వరకు యూనిట్ వ్యయంతో ఆహార శుద్ధి యూనిట్లను స్త్రీనిధి రుణం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చని, దీనికి పిఎంఎఫ్ఎంఇ పథకం కింద లభించే క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ అందుతుందని మంత్రి తెలిపారు. ఈ పథకంలో మహిళలు పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, చిరుధాన్యాలు, పప్పులు, మసాలాలు, పచ్చళ్లు, పిండి పదార్థాలు, స్నాక్స్ వంటి స్థానిక ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని, ప్రతి జిల్లాలోని జిల్లా సమాఖ్యలను (డిస్ట్రిక్ట్ రీసోర్స్ ఆర్గనైజేషన్స్) డిఆర్ఒలుగా పరిగణించి, వారి ద్వారా ఆసక్తి, సామర్థ్యం ఉన్న డ్వాక్రా మహిళలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ పథకంలో ఎంపికైన మహిళలకు ముడిసరుకు సేకరణ, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాలను ప్రభుత్వం తరపున కల్పిస్తామని మంత్రి తెలిపారు. మహిళలకు కేవలం రుణం ఇవ్వడమే కాకుండా, వారి వ్యాపారం విజయవంతం అయ్యే వరకు ప్రభుత్వ తోడ్పాటు ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ మహిళలు కూడా పారిశ్రామిక వేత్తలుగా తయారు కావడంతో పాటు ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్ యం అని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన డ్వాక్రా మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం అభివృద్ధితో పాటు పలువురికి ఉపాధి కల్పించే పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షి ంచారు.



## ఎస్వీబిసి చైర్మన్ శ్రీధర్‌వర్మ 22న బాధ్యతలు స్వీకరణ

**తిరుమల,ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సిఎం ఎన్టీఆర్ అభిమాని తిరుమల ఎన్టీఆర్ రాజు కుమారుడు బి.శ్రీధర్‌వర్మను టిటిడి ఎస్వీబిసి చైర్మన్ పదవిలో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర నుండి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. తిరుపతికి చెందిన యువనేత శ్రీధర్‌వర్మకు అనూహ్యంగా ఎస్వీబిసి చైర్మన్ పదవి దక్కింది. ఇప్పటికే టిడిపి రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బాధ్యతలు ఆయన నిర్వహిస్తున్నారు. శ్రీధర్ వర్మ కుటుంబానికి తొలినుండి టిడిపితో ఎన్టీఆర్ కుటుంబంతో దశాబ్దాల అనుబంధం ఉంది. ఆయన తండ్రి ఎన్టీఆర్ రాజుగా సుపరిచితులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళ తరువాత ఖాళీగా ఉన్న ఎస్వీబిసి చైర్మన్ పదవిలో శ్రీధర్‌వర్మను కూర్చోబెట్టడంతో పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు దేశంలోని వివిధ ఆలయాల్లో భక్తిఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రసారం చేసే ఎస్వీబిసి చైర్మన్ పదవి ఇప్పుడు భర్తీ చేశారు. ఈ పదవిలో శ్రీధర్ వర్మ రెండేళ్ళపాటు కొనసాగుతారు. ఎన్టీఆర్ తో సన్నిహితంగా మెలిగి, తిరుపతి టిడిపిలో కీలకంగా పనిచేసిన ఎన్టీయార్ రాజు గతంలో టిటిడి పాలకమండలి సభ్యుడిగా పనిచేశారు. శ్రీధర్ వర్మ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా, స్టేట్ మీడియా కో ఆర్డినేటర్‌గా పని చేసారు. ఈనెల 22వ తేదీన ఎస్వీబిసి చైర్మన్‌గా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. తెలుగుతో పాటు తమిళం,కన్నడ, హిందీ భాషల్లోనూ ప్రసా రాలు అందుబాటులో ఉన్నాయి. ఎస్వీబిసి నూతన చైర్మన్‌గా నియమితులైన శ్రీధర్ వర్మ శుక్రవారం ఉదయం తిరుమలలో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడునుమర్యాదపూర్వకంగా కలిశారు.

## వారం - వర్జ్యం

15-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
తి.తదియ సా.5.34
న.ఉత్తరఫాల్గుణి రా.3.27
వ. ఉ.10.51-మ.12.26
దు.1. ఉ.5.51-ఉ.7.30
రాహు ఉ.9.00-ఉ.10.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** కుటుంబ సభ్యులతో దేవాలయ దర్శన భాగ్యమునకు ఆస్కారము ఉన్నది. మిత్రుల కలయిక. స్వల్ప ధనలాభం పొందుతారు.

**వృషభం :** చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. సోదరుల కలయిక.

**మిథునం :** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి ఊరట చెందుతారు. గృహనిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కర్కాటకం :** నూతన పరిశ్రమలు వ్యాపారాలు ప్రారంభిస్తారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. వస్త్ర లాభం.

**సింహం :** ఎంత సాధించినా ఇంకా సాధించాలనే ధోరణి అప్రశాంతతకు గురి చేస్తుంది. కొన్ని అవకాశాలు అప్రయత్నంగా కలిసి వస్తాయి.

**కన్య :** భూముల విషయంలో నెలకొన్న వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. నూతన ఒప్పందాలలో జాగ్రత్తలు పాటించండి.

**తుల :** జీవిత భాగస్వామి సహాయం అందుకుంటారు. సన్నిహితుల నుండి కీలక సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం :** చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు. గృహ నిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**ధనుస్సు :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కళలు, రాజకీయ రంగాల వారికి పదవులు లభిస్తాయి.

**మకరం :** నూతన పెట్టుబడులతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగిన సూచన. ప్రయాణాలు.

**కుంభం :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. కాంట్రాక్టులు లభిస్తాయి. వస్త్ర లాభం.

**మీనం :** వాక్చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టు కొని పనులు పూర్తి చేస్తారు. స్వల్ప ధనలాభం పొందుతారు. ఇంటా బయటా అనుకూలం

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

15-8Pg3exHMNWJQEA:15-8Pg3exHMNWJQEA.qxd 8/15/2026 12:14 AM Page 1





# ఆర్థిక స్వాతంత్ర్యానికి స్త్రీశక్తి బాట

### ఉచిత బస్సు ప్రయాణానికి యేడాది

### 87 కోట్ల ప్రయాణాలు... సగటున రోజుకు 24 లక్షలు..

### మహిళలతో రేపు ప్రత్యేకంగా భేటీ కానున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఆర్థిక సాధికారతకు స్త్రీ శక్తి పథకం కొత్త అర్థాన్ని తీసుకొచ్చింది. సరిగ్గా ఏడాది క్రితం ఆగస్టు 15న ఈ పథకానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తూ వారి రోజువారీ ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా, ఎన్నిసార్లయినా పరిమితులు లేకుండా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడంతో మహిళల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు 87 కోట్ల ప్రయాణాలను వివిధ వర్గాల మహిళలు చేశారు. మహిళల ప్రయాణానికి ప్రభుత్వం రోజుకు రూ.8.53 కోట్లను సబ్సిడీగా అందిస్తోంది. పథకం అమల్లోకి వచ్చిన ఏడాది కాలంలో ఇప్పటివరకు రూ.3,095 కోట్లు ఈ పథకం కోసం ప్రభుత్వం ఖర్చు పెట్టింది.

**ఆర్టీసీలో 76 శాతం బస్సులకు వర్తింపు..**

ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లె వెలుగు, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ.. ఇలా ఐదు కేటగిరీల బస్సుల్లో స్త్రీ శక్తి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. మొత్తం 9,978 ఆర్టీసీ బస్సుల్లో 76 శాతం బస్సులు .. అంటే 7,631 బస్సులను ఈ పథకానికి వినియోగిస్తున్నారు. ఆలయాలకు నడిపే ప్రత్యేక బస్సు సర్వీసుల్లోనూ ఈ సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. స్త్రీ శక్తి పథకం రాకముందు ఆర్టీసీ బస్సుల్లో మహిళల వాటా 40 శాతం ఉండగా.. ఇప్పుడు అది 62 శాతానికి పెరిగింది. రోజువారీ మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా 9.47 లక్షల నుంచి 24 లక్షలకు చేరుకుంది. పథకం అమలవుతున్న బస్సుల్లో ఆక్యుపెన్సీ 93 శాతానికి చేరింది.

**చిరు వ్యాపారలకు ఊతం..**

స్త్రీ శక్తి పథకం ద్వారా కేవలం ప్రయాణ ఖర్చును తగ్గించడం మాత్రమే కాకుండా.. మహిళలకు విద్య, ఉపాధి, వైద్యం, వ్యాపారం, ఇతర అవసరాలకు ఉపయోగపడుతోంది. కాలేజీలకు వెళ్లే వారికి, చిరు వ్యాపారం నిమిత్తం ఒక ఊరి నుంచి మరొక ఊరు వెళ్లేవారికి, దైవ దర్శనాలకు వెళ్లేవారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆధార్ కార్డును చూపిస్తే రాష్ట్ర సరిహద్దులో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇదే తరహా పథకాన్ని 4 కేటగిరి బస్సుల్లోనే అమలు చేస్తున్నారు. కాగా ఏపీలో 5 రకాల బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. మరోవైపు ఈ పథకం అమలు చేసిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని అధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. చాలా మంది షేర్ ఆటోలు, వ్యక్తిగత వాహనాల ద్వారా ప్రయాణాలను తగ్గించుకుని ఆర్టీసీ బస్సులు ఎక్కుతుండడంతో ప్రమాదాల సంఖ్య కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గినట్టు అంచనా.

**స్త్రీశక్తి లబ్ధిదారులతో కలిసి ప్రయాణించనున్న సిఎం**

పథకం ప్రవేశపెట్టి ఏడాదైన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మహిళలతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. స్త్రీ శక్తికి సంవత్సరం రెట్టింపైన ఆత్మగౌరవం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం చేపట్టనున్నారు. రాజధాని పరేడ్ గ్రౌండ్ లో స్వాతంత్ర్య దినోత్సవాల కార్యక్రమం అనంతరం స్త్రీ శక్తికి సంవత్సరం రెట్టింపైన ఆత్మగౌరవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. పరేడ్ గ్రౌండ్ నుంచి సీఎం క్యాంప్ కార్యాలయం వరకు స్త్రీశక్తి లబ్ధిదారులతో కలిసి బస్సులో ముఖ్యమంత్రి ప్రయాణించనున్నారు. క్యాంప్ కార్యాలయంలో మహిళలతో కలిసి హైటీలో పాల్గొననున్నారు. పథకం అమలవుతున్న తీరు... కలుగుతున్న లబ్ధి వంటి అంశాలపై మహిళలతో మాట్లాడి.. వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు.

## 103 మందితో ఎపి బిజెపి టీం

**విజయవాడ, ఆగస్టు 14 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా 68 మంది, శాశ్వత ఆహ్వానితులుగా ముగ్గురు, ప్రత్యేక ఆహ్వానితులుగా 32 మంది కలిపి మొత్తం 103 మందిని నియమిస్తూ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై సమర్థవంతమైన పోరాటం, రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసే లక్ష ్యంతో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులను నియమించారు.

**రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరే..**

శ్రీకాకుళం – బిర్లంగి ఉమా మహేశ్వరరావు, పోకతోట సింహాచలం, పార్వతీపురం మన్యం – బట్టుల పవన్ సాయి కుమార్, విజయనగరం – పాక రాణి నాగ మల్లిక, పెంట స్వామినాయుడు, బూర్లె శ్రీధర్, విశాఖపట్నం – మేడపాటి రవీంద్ర రెడ్డి, జి. ప్రేమ కుమారి, అనకాపల్లి – పిళ్ల రామకుమారి, చుక్కాకుల వెంకటరావు, అల్లూరి సీతారామరాజు – కుడా కృష్ణారావు, సల్లా రామకృష్ణ, పోలవరం – కె.వి.వి. సత్యనారాయణ రెడ్డి, నోముల వెంకట రామారావు, కాకినాడ – ముట్టా నవీన్ కృష్ణ, కంబాల శ్రీనివాస్, తుమ్మల పద్మజ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ – కర్రి చిట్టిబాబు, తామలంపూడి రామకృష్ణారెడ్డి, ఆకుమర్తి బేబీ రాణి, తూర్పుగోదావరి – నర్సిపల్లి హారిక, కురగంటి సతీష్, పిల్లమర్రి మురళీకృష్ణ, పశ్చిమగోదావరి – పెరిచర్ల శ్రీనివాస రాజు (సుభాష్), ఎటకోట తాతాజీ, కయిత సురేంద్ర, ఏలూరు – కొర్లజ్యోతి సుధాకర కృష్ణ, బురగం వెంకటలక్షి ్మ, కట్నేని లక్షీ ్మకృష్ణ ప్రసాద్, కృష్ణా – గుత్తికొండ రాజాబాబు, ఆలపాటి లక్షి ్మనారాయణ, పంతం గజేం ద్ర, ఎన్‌టీఆర్ – ముప్పల వెంకట రామ సుబ్బారావు, పోతంశెట్టి నాగేశ్వ రరావు, లాకా వెంగళరావు యాదవ్, గుంటూరు – యడ్లపాటి స్వరూ పారా ణి, పాలపాటి రవికుమార్, పల్నాడు – ఆలకం సుధాకరబాబు, అన్నం శ్రీనివాసరావు, బాపట్ల – పోతుల సురేష్, రాంపల్లి జగన్నాథ.

## పిఠాపురంలో అన్నా కొణిదెల ప్రత్యేక పూజలు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు14,ప్రభాతవార్త :** డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం లో శుక్రవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజెనోవా కొణిదెల పాదగయ క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పదో శక్తిపీఠంగా ప్రసిద్ధిగాంచిన పురుహూతిక అమ్మవారిని, శ్రీ కుక్కుటేశ్వర స్వామివారిని, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని, శ్రీ దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల సన్నిధిలో ఆమె ఆధ్యాత్మిక ప్రశాంతతను ఆస్వాదించారు. ఆలయ పండితులు పాదగయ క్షేత్ర మహత్యం, పురాణ ప్రాశస్త్యం, ఇక్కడి దేవతామూర్తుల విశిష్టతను వివరించారు. పవిత్ర పాదగయలో స్వామి, అమ్మవార్ల దర్శనం భక్తిభావాన్ని మరింత పెంచిందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ఆమెను శ్రీ స్వామివారి శేష వస్త్రములతో సత్కరించి, చిత్రపటాలు, ప్రసాదాలను ఆలయ ఈవో జగన్మోహన శ్రీనివాస్ అందజేశారు.

# కుంటుపడిన అభివృద్ధిని గాడిన పెడుతున్నాం

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం/గార, ఆగస్టు 14 ప్రభాతవార్త :** గత సర్కారు పాలనలో అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని.. నేడు కూటమి పాలనలో మళ్ళీ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం గార మండలం, శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలిసి ఆయన పర్యటించారు. మొత్తంగా సుమారు 11 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యారు. తొలుత గార మండల కేంద్రంలో 2.55 ప్రత్యేక నిధులతో నిర్మించిన కళింగపట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. అనంతరం వమరవల్లి వరకు తిరంగా ర్యాలీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. వమరవల్లిలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించారు. అనంతరం శ్రీకాకుళం నగరంలోని మహాలక్ష్మినగర్‌లో 2కోట్ల అరవై లక్షలతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. శ్రీకాకుళం ప్రధాన మార్కెట్-మేదరవీధి వద్ద 52 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రహదారి ప్రారంభోత్సవం, ఏడు రోడ్ల జంక్షన్ వద్ద 56 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవం, నగరంలోని కృష్ణ పార్కు వద్ద కల్వర్టు ప్రారంభోత్సవం, డే అండ్ నైట్ జంక్షన్ వద్ద 2 కోట్ల 90లక్షల నిధులతో నిర్మించిన సెంట్రల్ డివైడర్ ప్రారంభోత్సవం, కోటి 75 లక్షలతో నిర్మించిన శ్రీకాకుళం నీటిపారుదల శాఖ ఈఈ కార్యాలయ ప్రారంభోత్సవం, నగరంలోని వరం కాలనీ వద్ద సీసీ డ్రైన్స్ సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలిసి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. గార-పోలాకి బ్రిడ్జి గతంలో తమ ప్రభుత్వం శంకుస్థాపన చేసి.. శరవేగంగా పనులు ప్రారంభించామని, ప్రభుత్వం మారగానే పనులు సైతం మూలకు చేరి నిర్మాణ వ్యయాన్ని పెంచాయని తెలిపారు. తిరిగి కూటమి ప్రభుత్వ హయంలోనే వాటిని పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ చొరవతో 11 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని.. తద్వారా లక్షలాది ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన గడువు కన్నా ముందే పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.



శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 26 మాసాలుగా కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు అందించడం వలన, తాను ఊహించని విధంగా అభివృద్ధిని, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తున్నా మన్నారు. సూపర్ సిక్స్‌పై తాను ధైర్యంగా వమ్మరవల్లిలో చెప్తున్నానని, ఒకటో రెండు తప్పా 98శాతం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామన్నారు.

వంశధారలో నీరు సద్వినియోగం కావాలంటే నేరడిలో ఒక బ్యారేజీ కడితే తప్ప ఈ జిల్లాకి నీరిచ్చే పరిస్థితి లేదన్నారు. పార్లమెంట్ సభ్యుడు రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో ఉండి అనునిత్యం పరివేక్షించి, ఏదైతే ఒడిశాకి మనకున్నటువంటి తగాదా ఉందో దాన్ని తీర్చి, కేంద్ర ప్రభుత్వం ద్వారా గెజిట్ ఇప్పించినటువంటి ప్రభుత్వం విదీతి ప్రభుత్వమని, కూటమి నాయకులకు ఆ ఘనత దక్కుతుందన్నారు.

వచ్చే సెప్టెంబర్ నెలలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఇంకొక కొత్త కార్యక్రమానికి కూడా శ్రీకారం చుడుతున్నామన్నారు. రేపు సెప్టెంబర్ నెలలో కొత్తగా పెన్షన్లు ఇవ్వడానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని, ఎవరైతే భర్తలు చనిపోయినటువంటి భార్యలు ఉన్నారో వాళ్లకి, అర్హత కలిగిన వాళ్లకి కొత్తగా పెన్షన్లు ఇచ్చే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుడతామన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో సాయి ప్రత్యూష, వంశధార ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ అరవల రవీంద్ర, ఎపిఎస్ఐడిసి ఎస్ఈ సుబ్రహ్మణ్యం, సంచాలకులు కోటగిరి నారాయణరావు, ఈఈ కామరాజు, కార్పోరేషన్ సభ్యులు పిఎంజె బాబు, పలువురు అధికారులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు

### భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ సమీక్ష

**విజయవాడ,ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభ ఏడవ సమావేశాలు, శాసనమండలి 50వ సమావేశాలు ఆగస్టు 17వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించారు. సభా కార్యక్రమాల సన్నద్ధతపై అధికారులు, పోలీసులతో వీరు చర్చించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నిర్వహణపై ఒక సమావేశం, అలాగే భద్రతా ఏర్పాట్లపై మరొక సమావేశం వేర్వేరుగా జరిగాయి. ఈ సమీక్షా సమావేశాల్లో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, స్పెషల్ సిఎస్. శంషేర్ సింగ్ రావత్ మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్యామల రావు మరియు అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) మధుసూదన్ రెడ్డి, ఎస్ పి గుంటూరు వకుల్ జిందాల్ తదితర ఉన్నతస్థాయి పోలీస్, పౌర అధికారులు పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పెండింగ్ లో ఉన్న ప్రశ్నలు మరియు మంత్రుల ద్వారా ఈయబడిన పరిష్కారం కానీ హామీలు, చర్చించి పెండింగ్ లో ఉన్న ప్రశ్నల పైన తగు సూచనలు చేసారు. సమావేశాల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని, సభ్యులకు ఎలాంటి



అసౌకర్యం కలగకుండా చూడాలని స్పీకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈసారి సందర్శకులకు డిజిటల్ రూపంలో పాసులు జారీ చేస్తున్నామని ఆయన తెలిపారు. సందర్శనకు వచ్చిన వారు తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డు (ఐడెంటిటీ) చూపించడంతో పాటు, లోపలికి వచ్చేటప్పుడు, తిరిగి బయటకు వెళ్లేటప్పుడు పాసులను స్కాన్ చేసుకోవాలని సూచించారు. సభ ప్రారంభమైన అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశంలోనే సభను ఎన్ని రోజులు నిర్వహించాలి, ఇతర ప్రభుత్వ వ్యవహారాలు తదితర కీలక అంశాలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

### ప్రజల మధ్యకు ప్రజాస్వామ్య దేవాలయం

### అమరావతి అసెంబ్లీలో మన సభ-జన సభ

### స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ. ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర శాసనసభ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టానికి శ్రీకారం చుడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజా పండుగలా నిర్వహించేందుకు అమరావతి అసెంబ్లీ ప్రాంగణం ముస్తాబైంది. కేవలం విద్యుత్ దీపాల అలంకరణలు, అధికారుల జెండా వందనానికే పరిమితం కాకుండా సామాన్య ప్రజలను, విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేయాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీసుకున్న సంచలన నిర్ణయంతో అసెంబ్లీలో సరికొత్త సందడి నెలకొంది. మన సభ - జన సభ స్ఫూర్తితో అమరావతి అసెంబ్లీలో సాంస్కృతిక కార్యక్రమాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోలీసు అందించిన బ్యాండ్ ప్రదర్శన, కళాకారులు పాడిన దేశభక్తి గీతాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోగా, ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఫుడ్ కోర్టును కూడా ఏర్పాటు చేశారు. ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం వేళల్లో ప్రజలు, విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించడంతో అసెంబ్లీ భవనాన్ని చూడటానికి భారీ సంఖ్యలో తరలివచ్చి ఆసక్తి కనబరిచారు. ప్రజలతో కలిసి స్వాతంత్ర్య సంబరాలు చేసుకోవాలన్న స్పీకర్ ఆలోచన పట్ల సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలను ప్రజాస్వామ్యానికి మరింత చేరువ చేసేలా మన సభ జన సభ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శాసనసభ అనేది కేవలం ప్రజాప్రతినిధులు సమావేశమయ్యే భవనం మాత్రమే కాదని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిధ్వనిగా నిలిచే ప్రజాస్వామ్య దేవాలయమని ఆయన అభివర్ణించారు.

## ఉత్తరాంధ్రకు హిలోరా రిసార్ట్

### రెండేళ్లలో ప్రారంభోత్సవానికి ఒప్పందం

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విశాఖపట్నం, ఆగస్టు 14 ప్రభాతవార్త:** ఉత్తరాంధ్రకు హిలోరా రిసార్ట్ మరో కలికితురాయి లాంటి వంటిదని రాష్ట్ర సూక్ష ్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో జరిగిన హిలోరా ఈకో రిసార్ట్స్ ఒప్పంద కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హిలోరా ఈకో రిసార్ట్, ద ఓజోన్ కలెక్షన్, కలర్స్ ఆఫ్ ఓ బ్లూ సంయుక్తంగా ఏవిఎన్‌జి డెవలపర్స్ ఆధ్వర్యంలో 60 ఎకరాలలో 200 కోట్ల రూపాయలు పెట్టుబడితో కార్పొరేట్ స్థాయిలో రిసార్ట్ కట్టడానికి ఒప్పందం చేసుకోవటం చాలా గర్వంగా ఉందని, భోగాపురం అనంతరం తొలి ప్రాజెక్టుకి తొలి అడుగు పడిందన్నారు.

ఎస్ కోటలో నిర్మించే ఈ రిసార్ట్ మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఊటీ, కొడైకెనాల్ లను తలపిస్తుందన్నారు. రెండు సంవత్సరాల లోనే ఈ టూరిస్ట్ రిసార్ట్‌ను ప్రారంభిస్తామని సంస్థ సభ్యులు చెప్పటం సంతోషకరమన్నారు. విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధికి నాంది పలికే ప్రతి ఒక్కరికి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారం అందజేస్తారని, ఈ రిసార్ట్ ద్వారా ఉత్తరాంధ్రకు మరింత ఖ్యాతి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఆసియా ఎట్మాస్పియర్ కోర్ ఎండి సౌభాగ్య మహాపాత్రో, ఏవిఎన్జీ డెవలపర్స్ ఎండి ఏవిఎన్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## అనంత కరువుపైనా సిఎం సమీక్ష నిర్వహించాలి

### వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, ఆగస్టు 14 ప్రభాతవార్త బ్యూరో :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలో నిర్మిస్తున్న బిల్డింగులు, రోడ్ల పనులపై సమీక్ష నిర్వహిస్తూ ప్రచారంచేసుకుంటున్నారని, అదే విధంగా అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువుపై దృష్టి సారించి రైతాంగాన్ని ఆదుకునేందుకు సమీక్ష నిర్వహించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురంజిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల మూలంగా తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడే పరిస్థితి కనిపిస్తోందన్నారు. జిల్లాకు కరువు కొత్త కాకపోయినా, ఈ సారి మాత్రం దారుణమైన పరిస్థితులు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జూన్‌లో వర్షాలు కురవలేదని, జులైలో 70 శాతం లోటు నమోదైందని, ఆగస్టులో ఇప్పటి వరకు వర్షాలు కురవలేదన్నారు. సాధారణంగా జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 8.48 లక్షల ఎకరాలు ఉంటే ఇప్పటి వరకు 4 లక్షల ఎకరాలకు పైబడి విత్తనం వేయలేదని, వేసిన పంటలు కూడా వర్షాభావ పరిస్థితుల్లో చేతికి వచ్చే పరిస్థితి ఎక్కడా కానరావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు మిగిలిన రైతులు కూడా పంటల సాగు కోసం ఎకరాకు 3 నుంచి 6 వేల దాకా ఖర్చు చేశారన్నారు.

వర్షాలు లేక పంటలు పండే పరిస్థితి లేకపోని పరిస్థితి ఒకవైపు, పశుగ్రాసం కూడా లేక ఉన్న పశువులను కలేబరాలకు అమ్ముకునే దయనీయ పరిస్థితిని జిల్లా రైతులు ఎదుర్కొంటున్నారన్నారు.

జిల్లాలో 40 లక్షల వరకు పశు సంపద ఉందని, ప్రతి ఆదివారం అనంతపురంలో జరిగే పశువుల సంతకు రైతులు వాటిని తెచ్చి అమ్ముకునే పరిస్థితి కళ్లకు కనిపిస్తోందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు అధికార యంత్రాంగం ఒక్క సమీక్ష కూడా వీటిపై చేసిన పాపాన పోలేదని ఆయన విమర్శించారు. వ్యక్తిగతంగా మంత్రి పయ్యావుల కేశవ్ అనంతపురం ఆర్ అండ్ బిలోనూ, సత్యకుమార్ ధర్మవరంలో, సవితమ్మ పెనుకొండలోనూ నామ మాత్రపు సమావేశాలు పెట్టుకున్నారు తప్పా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరువు పరిస్థితులపై సమీక్షించలేదని విమర్శించారు.

మరోవైపు ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గ పరిస్థితులను పట్టించుకోకుండా వ్యక్తిగత స్వలాభాలు, ఆదాయాలపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. మరోవైపు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల జిల్లాకు హెచ్ఎల్‌సి, హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి నీరు విడుదలైందని, తాగునీరు అవసరం అయిందని, ఆ నీటికి ప్రాధాన్యత ఇస్తున్నామని అధికారుల చేత చెప్పిస్తున్నారని, అదే మాట ఎమ్మెల్యేలు చెప్పి రైతులలో భరోసా ఎందుకు కల్పించలేక పోతున్నారని ఆయన ప్రశ్నించారు.

## తల్లిని దూషించాడని...

### కన్నతండ్రిని హత్య చేసిన కొడుకు

**చిత్తూరు, ఆగస్టు 14 ప్రభాతవార్త:** తన కన్న తల్లిని తన సొంత కన్న తండ్రి దూషించడంతో ఆగ్రహానికి గురైన కుమారుడు కన్న తండ్రిని దారుణంగా హత్య చేసిన సంఘటన చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం క్షీరసముద్రం దళితవాడలో చోటు చేసుకుంది. సొంత తండ్రిని మద్యం మత్తులో కత్తితో దారుణంగా కుమారుడే హత్య చేశాడని తెలియడంతో ఈ వార్త జిల్లా వ్యాప్తంగా సంచలనం అయ్యింది. ఎస్ఆర్‌పురం మండలం క్షీరసముద్రం దళితవాడకు చెందిన కన్న తండ్రి ఆనంద్(45)ను అతని సొంత కుమారుడు జ్యోతి(23) గురువారం రాత్రి దారుణంగా కత్తితో పొడచి హత్య చేశాడు. వివరాలిలా వున్నాయి. క్షీరసముద్రం గ్రామంకు చెందిన ఆనంద్ వికలాంగుడు. ఇతనికి పాతికేళ్ళ క్రితం అరగొండ గ్రామంకు చెందిన మీనాతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు జన్మించారు. భర్త ఆనంద్, భార్య మీనాల మధ్య అవగాహన లోపించడంతో కుటుంబంలో తరచు గొడవలు జరిగేవి.

ఈ క్రమంలో కొద్ది రోజులకు భార్యభర్తల మధ్య గొడవలు పెద్దవి కావడంతో భార్య మీనా భర్త ఆనంద్‌ను గ్రామంలోనే వదలి ఇద్దరు పిల్లలతో కలసి చిత్తూరుకు వచ్చి చేరింది. భార్య మీనా గత 20 సంవత్సరాలుగా ఒంటరిగా వుంటూ పిల్లలను చితూరులోనే చదివించుకుంటూ వుండేది. ఈ క్రమంలో మీనా పెద్ద కుమారుడు జగదీష్ ఇంటర్మీడియేట్ వరకు చదవడంతో అతనికి షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగం వచ్చింది. అయితే గ్రామంలో వికలాంగుడుగా వున్న ఆనంద్ తరచు మద్యం సేవించి తన భార్య మీనాతో పాటు పిల్లలతో ఫోన్‌లో సంభాషించేవాడు. కుమారుడు జగదీష్ కూడా మద్యంకు బానిస కావడంతో మద్యం సేవించిన సమయంలో తండ్రి, కుమారులు మద్యం మత్తులో ఒకరిని ఒకరు దూషించుకునే వారు. ఈ క్రమంలో ఇటీవల మద్యం సేవించిన ఇద్దరు ఫోన్‌లో మాట్లాడుకుంటున్న సమయంలో తండ్రి ఆనంద్ తన భార్య మీనాను దూషించాడు. తన తల్లిని కన్న తండ్రి ఫోన్‌లో దూషించడంతో గ్రామంకు వచ్చినీ అంతు చూస్తా అని కుమారుడు జగదీష్ బెదిరించాడు.

తన తండ్రి అంతు చూడాలని గురువారం రాత్రి క్షీరసముద్రంకు చేరుకున్న జగదీష్ తండ్రిని వెతికాడు. గ్రామంలో ఎక్కడ తండ్రి కన్పించకపోవడంతో అతని కోసం ఎదురుచూశాడు. ఈ పరిస్థితుల్లో రాత్రి 11 గంటల సమయంలో తండ్రి ఆనంద్ ఇంట్లో వున్నాడని తెలుసుకున్న జగదీష్ ఇంటికి చేరుకుని తండ్రి ఆనంద్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆనంద్ అరవడంతో సమీపంలోనే వున్న జగదీష్ అత్త గీత అక్కడికి చేరుకుని జగదీష్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించింది. అయితే జగదీష్ అత్త గీతపై సైతం కత్తితో దాడి చేయడంతో ఆమె సైతం గాయపడింది. తండ్రి ఆనంద్ శరీరంలో తొమ్మిది చోట్ల కత్తితో జగదీష్ పొడవటంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ మేరకు గీతతో పాటు గ్రామస్తులు 108కు సమాచారం అందించడంతో 108 వాహనంలో ఆనంద్‌కు చికిత్స చేయడానికి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అయితే అప్పటికే ఆనంద్ తీవ్రంగా గాయపడటంతో అతను మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలంకు చేరుకుని కేసు నమోదు చేసి కుమారుడు జగదీష్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఒడిశా మహిళ శవాన్ని ఆంధ్రాలో ఖననం

**విజయనగరం (మరుపల్లి), ఆగస్టు 14 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా గజపతినగరం పోలీస్ స్టేషన్ పరిధిలో మరుపల్లి పెట్రోల్ బంకు సమీపంలో ఒరిస్సా రాష్ట్రం సిమిల్ గూడ నిందితుడు మోహన్ కిల్లా యువతి మృత దేహాన్ని ఖననం చేసిన విషయం ఒరిస్సా పోలీసులు ద్వారా గజపతినగరం పోలీసులకు తెలిసింది.

ఇరు పోలీస్ స్టేషన్ సిబ్బంది వెళ్లి యువతి శవాన్ని బయటికి తీశారు. ఒరిస్సా రాష్ట్రం, సిమ్లిగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అజిత్ గజపతినగరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి వారి పోలీస్ స్టేషన్ పరిధిలో సిఆర్.నెం.126/26 యు/ఎస్ 302 ఐపీసీకేసులో మృతురాలిని, నిందితుడు మోహన్ కిల్లా గజపతినగరం మండలంలోని, మరుపల్లి పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న తోటలో పాతిపెట్టినట్లు నిందితుడు తెలియజేయడంతో సదరు కేసులో మృతురాలి శవాన్ని బయటకు తీయుట కోసం రిక్విజేషన్ రూపంలో గజపతినగరం పోలీస్ వారి అసిస్టెన్సీ కావాలని కోరడం జరిగింది. అదే విధంగా గజపతినగరం మండలం ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌కి కూడా సమాచారం అందించగా, గజపతినగరం మండల ఎంఈఓ, గజపతినగరం పోలీసులతో పాటుగా వారి రాష్ట్రం నుంచి వచ్చిన ఇతర పోలీసు అధికారులు, రీజనల్ ఫోరెన్సిక్ అధికారులు, మృతురాలు కుటుంబ సభ్యులు, పెద్దలు సమక్షంలో నిందితుడు మోహన్ కిల్లా శవాన్ని పాతిపెట్టిన ప్రదేశాన్ని చూపించగా మృతదేహాన్ని వెలికి తీయడం జరిగింది.

వివరాలలోకి వెళితే.. ఈ కేసులో మృతురాలైన అల్బీన గరుడ నిందితుడైన మోహన్ కిల్లాతో గత రెండు సంవత్సరాలుగా లివింగ్ రిలేషన్ షిప్‌లో ఉన్నట్లు, వారిద్దరి మధ్య తేదీ 28.7.2026న గొడవ జరగడంతో ఆ గొడవలో నిందితుడు మృతురాలిని చంపినట్లు, అనంతరం మృతదేహాన్ని గజపతినగరం మండలంలోని, మరుపల్లి సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు దగ్గరలో ఉన్న మామిడి తోటలో తేదీ 29.7.2026న పాతిపెట్టినట్లు అనంతరం సునాబేడ వెళ్లిపోయి అక్కడ తేదీ 1.8.2026న అల్బీన గరుడ కనిపించడం లేదని రిపోర్ట్ ఇచ్చాడు.

కానీ మృతిరాలి తండ్రి బెనూధర్ గరుడ మోహన్ కిల్లా పై అనుమానం కలిగి అతనే తన కుమార్తెను చంపాడని రిపోర్టు ఇవ్వగా పోలీసులు సదరు మోహన్ కిల్లాను విచారించగా మోహన్ కిల్లా సదరు నేరం ఒప్పుకుని జరిగిన విషయాన్ని తెలియజేసి సదరు మృతురాలి శవంను పాతిపెట్టిన విషయంను తెలియపర్చగా శవంను వెలికి తీయుటకు గాను ఒరిస్సా పోలీసులు గజపతినగరం రావడం జరిగింది.

15-8pg4:15-8pg4.qxd 8/14/2026 10:35 PM Page 1



వార్త

ఏమీ తెలియని అమాయకులకు మౌనమే సగం బలం. అయితే, ఈ సూక్ష్మం తెలుసుకున్న వారిని అమాయకులని అనుకోలేము.

న- సాధి

# మాటల్లోనే గాంధీయిజం!


కరంచంద్ నేడుండినా ఈ నిషా బంద్ కాకుండెనా.. ఎంతో ఆవేదనతో అన్నాడో ఓ కవి. వాస్తవానికి మద్యపాన నిషేధం అన్నది మహాత్ముడు జాతికి అందించిన అమృత సందేశం. ఆనాడు కాంగ్రెస్ పార్టీయేకాదు, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ప్రజాస్వామ్యవాదులెందరో మద్యపానాన్ని ఈ దేశం నుంచి పారద్రోలాలని నినదించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో తీర్మానాలు చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మద్యపాన నిషేధం దేశంలో మొట్టమొదటిసారిగా అమలు చేసింది. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే ఆనాడు తాగుబోతులంటనే సమాజంలో ఏమాత్రం గౌరవభావాలు ఉండేవి కావు. ఒక రకంగా చెప్పాలంటే వారిని సమాజం బహిష్కరించినట్టుగా వ్యవహరించేది. ఎక్కడో చాటుమాటుగా తాగేవారు. పూర్తి మైకంలో పది మందిలోకి రావడానికి ఏమనుకుంటారోనని సిగ్గు, బిడియం ఉండేవి. తాగుబోతుల విషయంలో ఆనాటి పాలకులు ఎంతో కఠినంగా వ్యవహరించేవారు. దొంగసారా, గుడంబ, మద్యం తయారీ, అమ్మకందారులపై ప్రభుత్వం ఎంతో దృఢవైఖరి అవలంబించేది. కానీ రానురాను పరిస్థితులు మారిపోయాయి. మద్యం సేవించడం ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. స్వాతంత్ర్యం వచ్చి ఈ ఎనభై ఏళ్లలో ఎంతో అభివృద్ధి సాధించినా, మరెన్నో రంగాల్లో ఘనవిజయాలు సొంతం చేసుకున్నా మద్యం విషయంలో మాత్రం చతికిలపడిపోతున్నారు. ప్రభుత్వం ఆదాయం కోసం దుకాణాలు పెట్టించి మద్యం సేవించండి, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చండంటూ బతిమాలి, భంగపడి తాగించే దురదృష్టపు రోజులు దాపురించాయి. గాంధీ వారసులమని చెప్పుకుంటున్నవారు, పార్టీలు వేరైనా గాంధీ సిద్ధాంతాలను అమలు చేస్తున్నామని చెప్పుకుంటున్న పెద్దలు మద్యం నిషేధం విషయంలో మాత్రం అందుకు పూర్తిగా భిన్నమైన బాటలో నడుస్తున్నారు. దశలవారీగా ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. అసలు యేడాది యేడాదికి పెరుగుతున్న మద్యం ఆదాయం చూస్తే మద్యం ఏస్థాయిలో వినియోగం అవుతుందో తెలుస్తుంది. ఏమి చేసి అయినా మద్యం ద్వారా ఎంత వీలైతే అంత, ఎలా వీలైతే అలా పెంచుకోవాలనే ధ్యేయంగా అడుగులు వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్ల కొద్దీ నడిచే పరిస్థితుల నుండి ఇప్పటికీ బయటపడని పల్లెలు కోకొల్లలు. కానీ మద్యం దొరకని గ్రామాలు దుర్భిణి పెట్టి వెతికినా కన్పించకపోవచ్చు. బెల్టుషాపు విధానం ఎవరి ఆలోచనో కానీ గ్రామాలకు గ్రామాలను మద్యంలో ముంచెత్తుతున్నాయి. రికార్డు పరంగా సారాను నిషేధించారు. కానీ అమలు చేసే త్రికరణశుద్ధి పాలకులకు లేకుండాపోతున్నది. కారు చౌకగా లభించే నాటుసారా, గుడంబ తయారీకొన్ని ప్రాంతాల్లో కుటీర పరిశ్రమగా మారిపోయింది. అప్పుడప్పుడు రికార్డుల కోసం నాటుసారా బట్టీలను పగలగొట్టి కేసులు పెడుతున్నారు. అసలు అక్రమంగా మద్యంఅమ్ముకునేవారికి కానీ, నాటుసారా తయారీదారులకు కానీఎక్సైజ్ అధికారులన్నా, పోలీసు అధికారులన్నా భయభక్తులు లేకుండాపోయాయి. ఒకప్పుడు ఎక్సైజ్‌శాఖ అధికారులంటే గడగడలాడే అక్రమ మద్యం వ్యాపారులు ఇప్పుడువారిని పట్టించుకునే పరిస్థితిలో లేరు. ఒకపక్క మామూళ్లు, మరొకపక్క రాజకీయ ఒత్తిడిలు వారు వానపాముల్లా మారికాలం గడుపుతున్నారు. అందుకు వారిని నిందించే కంటే ఈ పాపానికి పాలకులను బాధ్యులను చేయాలి. చివరకు పరిస్థితి ఎక్కడవరకు వచ్చిందంటే నాటుసారా, గుడంబాను నియంత్రించలేక మద్యంపేరుతో చీప్‌లిక్కర్‌ను తయారు చేసి సారా తాగేవారిని తమవైపు తిప్పుకునేందుకు మద్యం వ్యాపారులు రూపకల్పన చేశారు. ఒక రకంగా చెప్పాలంటే రంగుకలిపిన నాటుసారా రెక్టిఫైడ్ స్పిరిట్‌లో నీళ్ల కలిపి రంగుపొడి చల్లి సీసాలు నింపితే చీప్ లిక్కర్ తయారవుతుంది. తగిన పరిణామంలో నీళ్ల కలపకపోయినా, వాడే రంగులు కాలం చెల్లినా, ఖాళీ సీసాలు సరిగ్గా శుభ్రం చేయకపోయినా, కలుషిత నీరు కలిపినా చీప్ లిక్కర్ కాస్త విషతుల్యంగా మారుతుంది. దీనికితోడు కిక్ బాగా ఎక్కించాలని కొందరు వ్యాపారులు రసాయనాల పెస్టిసైడ్స్ కలుపుతున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. వ్యాపారులకు అంచనాలకు మించి ఆదాయం తెచ్చి పెట్టే ఈ చీప్ లిక్కర్ అమ్మకాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ చీప్ లిక్కర్ తాగి లక్షలాది నిరుపేదలు అనేక రోగాలబారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. అందులో కొందరి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మరి కొందరు తాగి, తాగి కృంగి, కృశించిమంచానికే పరిమితమై లేవలేని స్థితిలోపరలోకానికి పయనం కడుతున్నారు. ఇంకొందరు కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులబారిన కూడా పడుతున్నారు. తాగుడు కారణంగా రహదారి ప్రమాదాలు, మహిళలపై అఘాయిత్యాలువంటి నేరాలు ఊహించని రీతిలో పెరిగిపోతున్నాయి. నిర్భయ, దిశ కేసులతోసహా అఘాయిత్యాల్లో నిందితుల్లో అధికశాతం మద్యంమత్తులో ఉన్నవారే. రహదారుల్లో జరుగుతున్న అధిక శాతం ప్రమాదాలు వాహన చోదకులు మద్యం సేవించి నడపడంవల్లనే జరుగుతున్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. రోడ్లపక్కనే వెలసిన అనధికార మద్యం కేంద్రాలు డ్రైవర్లను మత్తులో ముంచుతున్నాయి. కొందరు మైనర్లు కూడా ఈమత్తుకు అలవాటుపడుతున్నారు. ఎన్నికల్లో కూడామద్యం పంపిణీ కీలకమైపోయింది. ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని చెప్పుకునే నేతలు నిరుపేదలు ఇలా బలైపోతున్నా అధికారం, డబ్బు సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తుంటే ఎవరికిచెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? ఏదిఏమైనా రాజకీయాలకు అతీతంగా అందరూ ప్రజాప్రతినిధులు ఆలోచించాల్సిన తరుణమిది.

కవి బాధ్యత జాతిని గురించి పరిశీలించడమే కానీ, వ్యక్తిని గురించి ఆలోచించడం కాదు.



శామ్యూల్ జాన్సన్

రచయితల సంఖ్య పెరిగే కొద్దీ పాఠకులు సోమరులుగా మారడం సహజం.



గోల్డ్‌స్మిత్

# అమలుకు నోచుకోని చట్టాలెందుకు?

ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా ఆ పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగుతెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పదిరాళ్ల కోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితులేననేది వాస్తవం. ఆ పిల్లలు చేయరాని, చేయలేని, చేయకూడని పనులెన్నో చేస్తూ ఇంకెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి పేదరికం వారి నోరువిప్పనీయడం లేదు. తల్లిదండ్రులకు దూరమై, వారి ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులకు ఇటు తమకు ఇష్టంలేని వ్యవస్థలో పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దారిద్రమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతమేరకైనా సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అంతేకానీ మూలాలను వదిలిపెట్టి చట్టాలు తెచ్చుకున్నాం, సమీక్షలు చేస్తున్నామంటూ అంతా అయిపోయినట్టుగా ప్రకటించుకోవడం మనలను మనం మోసం చేసుకోవడమే.

దామెర్ల సాయిబాబ

చేసింది చెప్పుకోవడం సులభం. కానీ చెప్పింది చేయడం మాత్రం ఎంతో కష్టతరం. అందరికీ సాధ్యం కాదు. అలా హామీలిచ్చి ఆ తర్వాత మాట మార్చిన నేతలెందరో కాలగర్భంలో కలిసిపోయారు. కేవలం కొందరు మాత్రమే ఇచ్చిన మాట నిలబెట్టుకొని ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకుని చిరస్థాయిగా నిలిచిపోతారు. అందుకే మాట ఇచ్చేముందు అన్నికోణాల్లో ఆలోచించి ఆచరణయోగ్యమా? కాదా? అందుకు తగిన వనరులున్నాయా? తదితర అంశాలను కూలకషంగా పరిశీలించుకొని మాట ఇవ్వాలి. అందులోనూ కీలకపదవుల్లో ఉన్న నేతలు మరింత లోతుగా ఆలోచించి హామీలివ్వాలి. ఎందుకోఏమో కానీ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన విషయంలో పాలకులు మాట నిలబెట్టుకోలేకపోతున్నారు. చట్టాల మీద చట్టాలు చేస్తున్నారు. అధికారుల మీద అధికారులను నియమిస్తున్నారు. అవేమీ ఆశించిన ప్రయోజనాలు చేకూర్చడం లేదు. అందుకు కారణం అమలులో చిత్తశుద్ధి లేకపోవడమే. చట్టాలు చేసేటప్పుడు, నిబంధనలను విధించేటప్పుడు ఉన్న శ్రద్ధ ఆచరణకు వచ్చేసరికి ఉండడం లేదు. అందుకే ఈ వ్యవస్థ నానాటికీ పెరిగిపోతున్నది. వాస్తవంగా పరిశీలిస్తే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కొంత మేరకు ఫలితాలు కూడా సాధించారని చెప్పొచ్చు. కానీ గత రెండు, మూడు దశాబ్దాలుగా ఆ కోణంలో నిర్దిష్టమైన చర్యలు లేకపోవడంతో ఈ వ్యవస్థకు అడ్డులేకుండాపోతున్నది. మొన్న కరోనా రక్కసి విజృంభించిన తర్వాత బాలకార్మిక వ్యవస్థ మరింతగా పెరిగిపోయింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, మరీ నిరుపేదల పిల్లలు బడిబాట మానేసి కార్మికుల అవతారమెత్తారు. ఆర్థిక వసతులులేకపోవడం, కంప్యూటర్, వాట్సాప్, ఫోన్‌లుకొనలేక, కొన్నాసాంకేతిక పరిజ్ఞానం రాక, ఇవన్నీ ఉన్నా పాఠశాలలో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో చాలామంది విద్యార్థులుచదువులకు స్వస్తి చెప్పారు. అధికారిక లెక్కల ప్రకారమే దేశవ్యాప్తంగా కోటి మందికిపైగా బాలబాలికలు చదువులకు స్వస్తి చెప్పి వ్యవసాయరంగంలోనో, లేక పారిశ్రామిక రంగంలోనో అవి, ఇవి కాకపోతే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏదోరకం పనుల్లో చేరిపోయారు. ఆ తర్వాతపాఠశాలలు తెరిచినా పాలకులు మళ్లీ బడిబాట పట్టించేందుకు ఎంతప్రయత్నాలు చేస్తున్నా పాఠశాలలవైపు మళ్లించలేకపోతున్నారు. ఒకవేళ ఉచితాలకు ఆశపడి వచ్చినా ఉండలేకపోతున్నారు. ఫలితంగా ఆటపాటలు, చదువు సంధ్యలతో ఆనందంగా గడపాల్సిన ఎంతోమంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతున్నాయి. పాత చట్టాలకు మరింత పదును పెట్టి కొత్త చట్టాలు తీసుకువచ్చామని ఎన్నిసార్లు నేతలు ప్రకటించుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలన్నట్లు ఏదో ఒక రూపంలో ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. అన్నిటికంటే ప్రధానంగా ఈ కూపం నుంచి బయటకుతీసుకువచ్చిన బాలకార్మికులకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని నిర్దిష్టమైన చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఇది ఎన్నో

ఒక్క మాట

ఏళ్ల నుంచి జరుగుతున్నా, చాలామంది అధికారులకు తెలిసినా పాలకులను నమ్మించేందుకు కాగితాల మీద ఏవో రాసుకొని కాలం గడుపుతున్నారు. దీనికితోడు ఇటీవలకాలంలో బాలబాలికలను అపహరించి అమ్మే వ్యాపారం చేసే ముఠాలు పెరిగిపోతున్నాయి. ఈముఠాలు కూడా బాలలను అమ్ముకోవడంతోపాటు భిక్షాటన కూడా చేయించడం ద్వారా వ్యాపారంగా మలుచుకుంటున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా యేటా వేలాదిమంది బాలబాలికలు అపహరణకు గురవుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నేటి ప్రధాని నరేంద్రమోడీ వరకు రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణ, అబ్దుల్ కలాం, తదితర పెద్ద లెందరో బాలలపట్ల అత్యంత ప్రేమాభిమానాలుచూపినవారే. ఈ బాలలే భావిభారత పౌరులని వారి జీవితాల్లో వెలుగు నింపాలని ఆశించినవారే. ఎన్నో కార్యక్రమాలు, మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహించినవారే. మన రాజ్యాంగ నిర్మాతలు కూడా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రాజ్యాంగంలోని 24వ అధికరణం బాలకార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. బాలబాలికలను సంస్థలు కానీ, వ్యక్తులు కానీ పనిలో పెట్టుకోకూడదని నిర్దే శిస్తున్నది. రాజ్యాంగంలోని 39(ఇ) అధికరణ కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేతవయసులో ఉన్న పిల్లలను వాళ్ల వయసుకు మించిన పనుల్లో పెట్టకూడదని రాజ్యాంగ నిబంధనలు ఘోషిస్తున్నాయి. తల్లిదండ్రులు తమ ఆర్థిక పరిస్థితుల నిమిత్తం పిల్లలను వారి వయసుకు మించిన పనుల్లో నియమించరాదని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. మరొకపక్క ప్రమాదాలకు అవకాశం ఉన్న పరిశ్రమల్లో బాలకార్మికులను నియమించరాదని మరో చట్టంతీసుకువచ్చారు. ఇప్పటివరకు ఇలాఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. పెద్ద ఎత్తున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. వెట్టిచాకిరి నుంచి వారిని బయటకు తీసుకువచ్చి వారి, వారి స్వస్థలాలకు పంపారు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు ఎంతో కృషిచేశారు. వెట్టిచాకిరిలో ఏళ్లతరబడి మగ్గిపోతూ బయటకు వచ్చి స్వగ్రామాలకు చేరుకున్నవారు ఎంతోకాలం అక్కడ ఉండలేకపోయారు. ఏదోమార్గం ద్వారా పాతపనులకు వచ్చి చేరుకుంటున్నారు. బాలకార్మికులను ఆ కూపం నుంచి బయటకు తీసుకువచ్చామని, పునరావాసం కల్పించామని చేస్తున్న ప్రకటనలు ప్రచారార్భాటాలుగానే మిగిలిపోయాయి. ఇప్పటికీ ఆశించిన లక్ష్యం చేరుకునే అవకాశాలు కనుచూపుమేరలో కన్పించడం లేదు. ఇందుకు ప్రధాన కారణాలు ఏమిటనేది పాలకులకు తెలియందేమీ కాదు. అలాగే తల్లిదండ్రులే తమ పిల్లలను నాలుగు డబ్బుల కోసం ఇలాంటి పనుల్లో చేర్పిస్తున్నారనే వాదనను తోసిపుచ్చలేం. పాలకులు ఒకవిషయాన్ని మనసు పెట్టి ఆలోచించాలి. లేత వయసులో చదువు సంధ్యలతో, ఆటపాటలతో ఆడుతూపాడుతూ కళ్లముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించని ప్రాంతాలకు పనికోసం పంపుతున్న వారి తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతున్నారో వేరేచెప్పక్కర్లేదు. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా ఆ పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగుతెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పదిరాళ్లకోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితులేననేది వాస్తవం. ఆ పిల్లలు చేయరాని, చేయలేని, చేయకూడని పనులెన్నో చేస్తూ ఇంకెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి పేదరికం వారి నోరువిప్పనీయడం లేదు. తల్లిదండ్రులకు దూరమై, వారి ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులకు ఇటు తమకుఇష్టంలేని వ్యవస్థలో పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దారిద్రమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతమేరకైనా సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అంతేకానీ మూలాలను వదిలిపెట్టి చట్టాలు తెచ్చుకున్నాం, సమీక్షలు చేస్తున్నామంటూ అంతా అయిపోయినట్టుగా ప్రకటించుకోవడం మనలను మనం మోసం చేసుకోవడమే. ●

# విశ్వవిద్యాలయాలకు అధ్యాపకుల కొరత!

సి. హెచ్. ప్రతాప్

దేశంలో ఉన్నత విద్య విస్తరిస్తోంది. కొత్త విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, కొత్త కోర్సులు, పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య ఇవన్నీ విద్యా విస్తరణకు సంకేతాలే. కానీ తరగతి గదిలో బోధించే అధ్యాపకులు లేకపోతే ఈ విస్తరణ ఎంతవరకు ప్రయోజనకరం? విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న వేగానికి అనుగుణంగా అధ్యాపక నియామకాలు జరగకపోవడం ఉన్నత విద్యానాణ్యతకు ముప్పుగా మారుతోంది. విశ్వవిద్యాలయానికి భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు అవసరమే. అయితే వాటికి ప్రాణం పోసేది నాణ్యమైన అధ్యాపక బృందమే. దేశంలోని 23 ఐఐటీల్లో 12,498 మంజూరైన బోధనా పోస్టులకు గాను 4,804ఖాళీగా ఉన్నట్లు 2026జనవరి 30నాటి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే 38.4శాతం పోస్టులు భర్తీ కాలేదు. ఐఐటీ పట్నాలో 54.6శాతం, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 51.3 శాతం పోస్టులు ఖాళీగా ఉండగా, మరో 12 ఐఐటీల్లో మూడో వంతుకు పైగా ఖాళీలున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఎఐఎస్‌హెచ్‌ఇ గణాంకాల ప్రకారం 2014-15లో 3.42 కోట్లుగా ఉన్న ఉన్నత విద్యలో విద్యార్థుల నమోదు 2022-23 నాటికి 4.46 కోట్లకు చేరింది. విద్యార్థుల సంఖ్య ఈస్థాయిలో పెరుగుతున్నప్పుడువారికి తగిన అధ్యాపక బలం కూడా ఉండాలి. అధ్యాపకుల కొరత ప్రభావం ఒక్కతరగతి గదితో ఆగదు. అందుబాటులో ఉన్న సిబ్బందిపై అదనపు బోధనా భారం పడుతుంది. విద్యార్థుల సందేహనివృత్తి, వ్యక్తిగత మార్గదర్శకత్వం, ప్రాజెక్టుల పర్యవేక్షణకు సమయం తగ్గుతుంది. ప్రయోగశాల బోధన, పరిశోధన, పీహెచ్‌డీ విద్యార్థుల పర్యవేక్షణ కూడా దెబ్బతినవచ్చు. అధ్యాపకుల సంఖ్య తక్కువగా ఉంటే విశ్వవిద్యాలయం జ్ఞానాన్ని సృష్టించే కేంద్రం నుంచి కేవలం పాఠ్యాంశాలను పూర్తిచేసే సంస్థగా మారే ప్రమాదం ఉంది. ఈవిషయంలో ప్రైవేటు విద్యాసంస్థల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలున్నాయి. విద్యార్థులను ఆకర్షించడంలో పరస్పర పోటీ పెరగడంతో పలు ప్రైవేటుసంస్థలు అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయి. మెరుగైన వేతనాలు, పరిశోధనా అవకాశాలు, పరిశ్రమ అనుసంధానం, ఆధునిక బోధనా విధానాలు, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రతిభను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నాయి. విద్యార్థులు కూడా ఇప్పుడు సంస్థ భవనాల కంటే అక్కడి అధ్యాపకుల నాణ్యత, పరిశోధన, బోధనా ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఐఐటీల్లో ఖాళీలకుప్రపంచ వ్యాప్తంగా పరిశోధకులకు ఉన్న డిమాండ్, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, బహుళజాతి పరిశోధనా సంస్థలు, డీప్‌టెక్ కంపెనీలతో పోటీ, కఠినమైన ఎంపిక ప్రమాణాలు కారణమవుతున్నాయని ఆయాసంస్థలు చెబుతున్నాయి. కాబట్టి ఖాళీలను భర్తీ చేయడం కోసం ప్రమాణాలను తగ్గించడం పరిష్కారం కాదు. ప్రతిభావంతులైన అధ్యాపకులను ఆకర్షించే, నిలుపుకునే విద్యా వాతావరణం కల్పించడమేఅసలు మార్గం. రాష్ట్రవిశ్వవిద్యాలయాల పరిస్థితిపైనా ప్రత్యేకదృష్టి అవసరం. దేశంలోని ఉన్నత విద్యార్థుల్లో అత్యధికులురాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ద్వారానే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. అక్కడ అధ్యాపక ఖాళీలు దీర్ఘకాలం కొనసాగితే దాని ప్రభావం లక్షలాది మంది విద్యార్థులపై పడుతుంది. అందువల్ల ఖాళీలను ఎప్పటికప్పుడు గుర్తించి, కాలపరిమితితో కూడిన నియామక ప్రక్రియను అమలు చేయాలి. నియామకాలు వేగంగా జరగాలి. అయితే వేగంతోపాటు మెరిట్, పారదర్శకత, అనుభవం, పరిశోధనా సామర్థ్యం కూడాకీలకం. అధ్యాపక నియామకం ఒక ఉద్యోగ భర్తీ ప్రక్రియ కాదు. దేశ భవిష్యత్తుకు మేధో పునాదినిర్మించే కార్యక్రమం. విద్యార్థుల సంఖ్య పెరగడం విద్యా విస్తరణ, వారికి నాణ్యమైన గురువులు అందడం విద్యా ప్రగతి. ●

# ప్రజావాక్కు

## పెట్టుబడులు సమాంతరంగా సాగాలి

భారత ఆర్థిక ప్రస్థానంలో మరో కీలక మైలురాయి నమోదైంది. అంతర్జాతీయ ద్రవ్యనిధిసంస్థ2026 ఏప్రిల్ వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ అంచనాల ప్రకారం 2025లో భారతనామమాత్ర స్థూల దేశీయోత్పత్తి3.92 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచంలో ఆరోఅతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచింది. ఇది కేవలం గణాంకాల్లో కనిపించే విజయంకాదు. కోట్లాదిమంది ప్రజలశ్రమ, వ్యాపార రంగం చొరవ, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, తయారీ రంగ విస్తరణ వంటి అనేక అంశాల సమ్మిళిత ఫలితమే ఈపురోగతి. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం వంటి చర్యలుదేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు దోహదపడుతున్నాయి. వ్యవసాయంలో సాంకేతికత, సాగునీటి సదుపాయాలు, విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత బలం.

- సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

## స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి

దాదాపు రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలన నుంచి ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల శాంతియుత సత్యాగ్రహ, వీరోచిత ఆయుధ పోరాటాలతో దేశానికి 1947 ఆగస్టు 15న విముక్తి లభించడంతోఏటా ఆగస్టు15న దేశవ్యాప్తంగా జెండావందన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర వేడుకలతో స్వాతంత్ర్య దినోత్సవాన్ని భారతీయులమైన మనం జరుపుకుంటూ 2026 ఆగస్టు 15ను 80వ స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకుంటున్నాం. కొన్ని రంగాలలో వెట్టిచాకిరీ పెరిగి సమతుల్యత లోపించి నాటి పరిపాలకుల బానిస బతుకులు గుర్తు చేసుకుంటూ ఎవరి ఉనికికోసం వారుపోరాడవలసి వస్తుంది. స్వతంత్ర పదం మసకబారక ఫలాలుఅందరికీ అందేలా అన్నిస్థాయిల వారు ప్రయత్నించి దేశఔన్నత్యం కోసం పాటుపడాలి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు

ఓటరు ప్రక్షాళన జాబితానే లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు మీ ఓటును చెక్ చేస్తాం లేదా మీ అప్లికేషన్ రిజెక్ట్ అయింది అని రకరకాల పేర్లతో ఓటర్లను ఓటీపీలు అడుగుతూ బురిడి కొట్టిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మీ వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు. మిమ్మల్ని ఏ అధికారి ఫోన్ చేసిఓటీపీలుఅడగరు. ఎవరైనాతెలియని వ్యక్తులు అడిగితే పోలీస్‌కంప్లైంట్ ఇవ్వండని అధికారులు సూచిస్తున్నారు.

## ఉద్యోగుల ఆవేదన పట్టేదెవరికి?

రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో వివిధ విభాగాలలోగత 15ఏళ్లుగా సుమారు 20,000 వేల మంది వివిధ హోదాలలో పని చేస్తున్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గత ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినా స్పందన శూన్యం అని ప్రస్తుత ప్రభుత్వంఅయినా తమసమస్యలుపట్టించుకో వాలని వాపోతున్నారు. 2023 ఆగస్టు17 నుంచి 45 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో, ప్రదేశాల్లో సామూహిక, రిలే నిరాహార దీక్షలుచేశారు. అధికారులకుఎన్నోసార్లు వినతి పత్రాలను సమర్పించారు. దీక్షలు విరమించి విధుల్లో చేరితేనే చర్చలు జరుపుతామని గతప్రభుత్వం ప్రకటించడంతో విధులలో చేరారు. అప్పటి పి.సి.సి అధ్యక్షులు ప్రస్తుత సి.యం రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మీ సమస్యలు తప్పక నెరవేరుస్తామని చెప్పడం జరిగింది. ఇప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ప్రమాదకరంగా రోడ్డు ప్రయాణాలు

వాతావరణ మార్పులతో ఇటీవలకాలంలో తీవ్రమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతుండడంతో గ్రామీణ రోడ్ల వెంట ప్రయాణాలు ప్రమాదకరంగామారుతున్నాయి. తరుచుగా చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడుతుండడం, విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుండడంతో కరెంట్ తీగలు తెగి రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామస్థాయిలో అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండిఇలాంటి పరిస్థితులలో వెంటనే రోడ్లపైఉన్న చెట్లనుతొలగించే విధంగాచర్యలు చేపట్టాలి.

- టి. యోగేందర్, నల్లగొండ జిల్లా

## యువతను పురుగులతో పోల్చడం సరికాదు

నల్సర్‌దేశంలోనే పేరెన్నికగల న్యాయ విద్యాలయం. అయితే ఇక్కడ ఒకటి గుర్తు పెట్టుకోవలసి ఉంది. దేశ అత్యున్నత న్యాయమూర్తి నిరుద్యోగులను పురుగులతో పోల్చడం యువతకు నచ్చడంలేదు. ఎంతో జ్ఞానం సంపాదించి ఎంతో కష్టించి చదివిన చదువుపట్టాను మానవత్వంలేని పురుగులుగా చూసే మనసుతో ఆలోచించే వారి చేతఎట్లా తీసుకుంటాం అనికూడా వారు అంటున్నారు. జంతర్‌మంథర్ పోరాటంలో పోలీసులు విచక్షణరహితంగా విద్యార్థులను చావాబాదుతున్న ఫోటోలను చూసే టైంలేదని చెప్పడం ప్రధానన్యాయమూర్తికే చెల్లింది.

-భారత అవినాష్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# స్వతంత్ర భారత మార్గదర్శకులు



సి.పి. రాధాకృష్ణన్

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారతీయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమర యోధులందరికీ నివాళులు అర్పిస్తున్నాను. గతవారం అండమాన్, నికోబార్ దీవుల్లో పర్యటించినప్పుడు 'హర్ ఘర్ తిరంగా' ప్రచారంలో భాగంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసే గౌరవం నాకు లభించింది. శ్రీ నేతాజీ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ 1943 డిసెంబర్ 30న భారత భూభాగంపై తొలిసారి మువ్వన్నెల జెండాను ఎగరవేసిన పవిత్ర భూమి పై నిలబడటం నా హృదయాన్ని కదిలించే అనుభవం. పసుంపోన్ ముత్తురామలింగ థేవార్ ఆహ్వానం మేరకు 1939 సెప్టెంబరులో శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ మధురైని సందర్శించిన విషయాన్ని ఈ సందర్భం నాకు గుర్తు చేసింది. ఆ ప్రాంతంలోని అనేక మంది దేశభక్తుల్లో ఈ చారిత్రక ఘట్టం స్ఫూర్తిని రగిలించింది. జాతీయ స్మారకమైన సెల్యూలార్ జైలును సందర్శించడం కూడా నా పర్యటనలో మరో స్ఫూర్తిదాయకమైన సందర్భం. శ్రీ వీర్ సావర్కర్, శ్రీ యోగేంద్ర శుక్లా, శ్రీ బతుకేశ్వర్ దత్, శ్రీ సచ్చీంద్రనాథ్ సన్యాల్‌తో సహా ఎందరో భరతమాత వీర పుత్రులను వలసవాద శక్తులు ఇక్కడ బంధించాయి. ఏకాంత కారాగారవాసాన్ని విధించాయి. స్వేచ్ఛగా, గౌరవంగా భారత్ మనుగడ సాగించాలనే లక్ష్యంతో ప్రాణాలర్పించిన వారి ధైర్యాన్నీ, వేదననూ, మహోన్నత త్యాగాల గాథలు నేటికీ ఈ జాతీయ స్మారకం గోడలు ప్రతిధ్వనిస్తున్నాయి. లక్షలాది ప్రజల్లో దేశభక్తి జ్వాలను రగిలించి దేశాన్ని స్వాతంత్రం దిశగా నడిపించిన ఈ మార్గదర్శకులందరికీ నివాళిగా ఈ వ్యాసం రాయడానికి ఈ సందర్భనే నాకు స్ఫూర్తి నిచ్చింది. క్విట్ ఇండియా ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటూ ఆగస్టు 9న అండమాన్ దీవుల్లో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రారంభించడం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. జాతిపిత మహాత్మాగాంధీ 1942లో క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించి 'డూ ఆర్ డై' అనే స్ఫూర్తిదాయక నినాదాన్ని ఇచ్చారు. ఈ పిలుపుతో దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యం సాధించాలనే ఆకాంక్ష తీవ్రమయింది. భరతమాతకు స్వేచ్ఛ కోసం దేశ వ్యాప్తంగా లక్షలాది స్వాతంత్ర్య సమరయోధులు చెక్కు చెదరని సంకల్పంతో పోరాడారు. ఉత్తరాన కాశ్మీర్, దక్షిణాన తమిళనాడు, పశ్చిమాన గుజరాత్, తూర్పున అస్సాం ఇలా అన్ని ప్రాంతాలకూ, నేపథ్యాలకూ, వయసులకూ చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, ధీరవనితలూ ఒకే ఉమ్మడి లక్ష్యం కోసం ఏకమయ్యారు. అదే - భరత మాతకు స్వాతంత్ర్యం. మొదటి స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాటానికి శాశ్వత ప్రతీకగా నిలిచిన ఝాన్సీ రాణి లక్ష్మీబాయి శౌర్యం, మంగళ్ పాండే ధైర్యం, స్వరాజ్యం నా జన్మహక్కు, నేను దానిని సాధిస్తాను అనే నినాదంతో దేశాన్ని జాగృతం చేసిన బాలగంగాధర తిలక్ పిలుపు - ఇలా ప్రతి స్వరం స్వాతంత్ర్యం దిశగా చేపట్టిన ప్రయాణాన్ని బలోపేతం చేసింది. తొలి స్వదేశీ నౌకారవాణా సంస్థను ప్రారంభించి వలస పాలన ఆర్థిక ఆధిపత్యాన్ని వీవో చిదంబరం సవాలు చేశారు. యుద్ధభూమిలో మాత్రమే కాకుండా.. వాణిజ్య రంగంలోనూ స్వాతంత్ర్య పోరాటం సాగిందని ఆయన నిరూపించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల విప్లవ కాంక్ష... స్వేచ్ఛా సాధనకు త్యాగం చేసేలా తరతరాలకూ స్ఫూర్తిగా నిలిచింది. ఈశాన్యంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటన జ్వాలను రాణి గైడిన్లియు రగలించారు. అస్సాంలో అంచంచలమైన ధైర్యంతో జాతీయ పతాకాన్ని మోస్తూ, క్విట్ ఇండియా ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ కనకలతా బారువా అనే యువతి ప్రాణాలను అర్పించారు. భగవాన్ బిర్సా ముండా, అనేక మంది ఇతర గిరిజన నాయకులు వలస పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన చారిత్రక పోరాటానికి నాయకత్వం వహించారు. మనచరిత్ర పుటల్లో పోరాట పటిమనూ, ధైర్యాన్నీ, పట్టుదలనూ ప్రదర్శించే అనేక గాథలున్నాయి. అవన్నీ కలసి ధైర్యాన్నీ, సాహసాన్నీ తనలో ఇముడ్చుకున్న గొప్ప చిత్రాన్ని ఆవిష్కరిస్తాయి. కోడి కాథ కుమరన్ (పతాక రక్షకుడు కుమరన్)గా ప్రసిద్ధి చెందిన తిరుప్పూర్ కుమరన్‌కు నివాళి అర్పిస్తున్నారు. నా స్వస్థలమైన తిరుప్పూర్‌లో, స్వాతంత్ర్య పోరాట సమయంలో జాతీయపతాకాన్ని కింద పడనీయకుండా పట్టుకొని మృత్యుఒడిలోకి చేరారు. అందుకే ఆయనకు ఈ బిరుదు లభించింది. చిన్నవయసులోనే కుమరన్ మనసులో దేశభక్తి జ్వాలప్రజ్వరిల్లింది. మహాత్మా గాంధీ ఆదర్శాలతో ప్రభావితమైన కుమరన్ ప్రజల్లో, ముఖ్యంగా యువతలో జాతీయవాది స్ఫూర్తిని మేల్కొలపడానికి దేశబంధు యూత్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. వలసవాద పాలనలో అన్యాయాల పట్ల ప్రజలు చైతన్య వంతులైనప్పుడే, వలస పాలకులను ఎదుర్కొనే ధైర్యాన్ని, స్పష్టతను పెంపొందించుకున్నప్పుడే అసలైన స్వేచ్ఛ సాధ్య మవుతుందని కుమరన్ దృఢంగా విశ్వసించారు. గాంధీజీ బోధించిన సామాజిక సంస్కరణలకు కట్టుబడి, మద్యపానాన్ని విడిచిపెట్టి ఆత్మనియంత్రణను అలవర్చుకోవాలని ప్రోత్సహిస్తూ.. కల్లు దుకాణాల వద్ద పికెటింగ్‌లో పాల్గొన్నారు. 1932 జనవరి 10న జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో కుమరన్ ఓ యాత్రకు నాయకత్వం వహించారు. చేతిలో జాతీయ వాద పతాకాన్ని పట్టుకొని, మరికొందరు ధైర్యవంతులతో కలసి చేపట్టిన ఆ యాత్రలో వందేమాతరం నినాదాలతో తిరుప్పూర్ వీధులుప్రతిధ్వనించాయి. ఈ బృందంపై వలసవాద శక్తులు దాడిచేశాయి. ఈ దాడిలో తలకుగాయమైన కుమరన్ వందేమాతరం అని నినదిస్తూ.. జెండాను శరీరానికి హత్తుకొని దేశం కోసం ప్రాణా లర్పించారు. మరణించే నాటికి ఆయన వయసు కేవలం 27 ఏళ్లు. తిరుప్పూర్ కుమరన్ వయసు గురించి రాస్తున్న ప్పుడు, మాతృభూమి కోసం తమ ప్రాణాలను అర్పించిన ఎందరో యువకులు గుర్తుకు వస్తున్నారు. భగత్ సింగ్ (23), సుఖ్‌దేవ్ (23), రాజ్‌గురు (22), ఖుదీరామ్ బోస్ (18), కనకలతా బారువా (18), అనంత లక్ష్మణ్ కన్హేరే (19), వంచినాథన్ (25) లాంటి ఎందరో యువకులు తమ ప్రాణాలను త్యాగం చేసి, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అమరులయ్యారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అజ్ఞాత వీరులను వెలుగులోకి తీసుకువచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ చొరవను ప్రశంసిస్తున్నాను. సుప్రసిద్ధమైన, అజ్ఞాత స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పిస్తున్నాను. ఈ మహత్తర సందర్భంలో, మన మాతృ భూమి పట్ల మన మన బాధ్యతను సమీక్షించుకొని, నవీకరించుకుందాం. ఈ అమృత కాలంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించడానికి మనల్ని మనం అంకితం చేసుకుందాం. మన దేశ పురోగతి, శ్రేయస్సు కోసంకలిసికట్టుగా కృషిచేద్దాం. అచంచలమైన ధైర్యంతో పోరాడి, మన స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధు లకు

15-8Pg5exH:15-8Pg5exH.qxd 8/14/2026 10:36 PM Page 1



# ప్రపంచదేశాల్లో పెరుగుతున్న భారత్ క్రేజ్

## పాక్ మినహా అన్నింటా సానుకూల వైఖరి




**న్యూఢిల్లీ,ఆగస్టు 14:** ప్రపంచదేశాల్లో భారత్‌పట్ల సానుకూల వైఖరి అత్యధికంగా కనిపిస్తోంది. భారత్‌లో అన్ని రంగాల వాతావరణం అనుకూలంగా ఉండటం వల్లనేదినదినాభివృద్ధి చెందుతున్నదన్న భావన విదేశీయుల్లో అత్యధికంగా కనిపిస్తోంది. తాజాగా విడుదలైన ప్యూ రీసెర్చ్ సెంటర్ సర్వే ఆసక్తికర సమాధానాలు ఇచ్చింది. 36 దేశాల్లో 42 వేల మందికిపైగా అభిప్రాయాలను సేకరించిన ఈ సర్వేలో భారత్‌పై సానుకూలతే ఎక్కువగా కనిపించింది. ఈ దేశాల్లో భారత్‌పై సగటున 45 శాతం మంది సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. 41 శాతం మంది ప్రతికూలంగా స్పందించారు. భారత్‌కు అత్యధిక మద్దతు శ్రీలంకలో కనిపించింది. అక్కడ ఏకంగా 79 శాతం మంది భారత్‌పై సానుకూల అభిప్రాయం వెల్లడించారు. కేవలం 11 శాతం మందే వ్యతిరేకంగా స్పందించారు. 2024లో భారత్‌పై సానుకూలంగా ఉన్న శ్రీలంక వాసుల సంఖ్య 65 శాతం కాగా ఇప్పుడు అది 79 శాతానికి పెరిగింది. కెన్యాలో 71 శాతం, బ్రిటన్‌లో 71 శాతం, జర్మనీలో 63 శాతం, ఇజ్రాయెల్‌లో 60 శాతం, ఇటలీలో 56 శాతం, స్వీడన్‌లో 55 శాతం మంది భారత్‌పై సానుకూలంగా ఉన్నారు. జపాన్‌లో 55 శాతం, థాయ్‌లాండ్‌లో 55 శాతం, సింగపూర్‌లో 51 శాతం, ఇండోనేషియాలో 50 శాతం మంది భారత్‌ను సానుకూల దేశంగా భావిస్తున్నారు. అయితే పాకిస్థాన్ మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంది. అక్కడ 91 శాతం మంది భారత్‌పై ప్రతికూల అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవలం 7 శాతం మందే సానుకూలంగా స్పందించారు. భారత్‌పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఫలితం పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. బంగ్లాదేశ్‌లో 42 శాతం మంది భారత్‌కు అనుకూలంగా ఉండగా 51 శాతం మంది వ్యతిరేకంగా ఉన్నారు.

అమెరికాలో అభిప్రాయాలు దాదాపు సమానంగా ఉన్నాయి. 50 శాతం మంది భారత్‌పై ప్రతికూలంగా స్పందించగా 45 శాతం మంది సానుకూలంగా ఉన్నారు. 2023లో భారత్‌పై సానుకూలంగా ఉన్న అమెరికన్ల సంఖ్య 51 శాతం ఉండగా 2026లో 45 శాతానికి తగ్గింది. మొత్తంగా చూస్తే ఆసియా, ఆఫ్రికాలో భారత్‌కు మంచి ఆదరణ కనిపించింది. యూరప్, అమెరికాలో మాత్రం అభిప్రాయాలు మిశ్రమంగా ఉన్నాయి. పొరుగు దేశాల్లో పాకిస్థాన్ అత్యంత ప్రతికూల వైఖరితో ప్రత్యేకంగా నిలిచింది.

# టన్నెల్‌లో ప్రమాదం ఏడుగురు మృతి, 22 మంది గల్లంతు రంగంలోకి ఎన్‌డిఆర్‌ఎఫ్



**డెహ్రాడూన్, ఆగస్టు 14:** ఉత్తరాఖండ్‌లో నిర్మాణంలో ఉన్న టన్నెల్‌లో ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా టన్నెల్‌లోకి నీరు, బురద ప్రవేశించడంతో ఏడుగురు మృతిచెందారు. పలువురు ఆ శిథిలాల్లో చిక్కుకున్నారు. చమోలీ జిల్లాలోని పిపల్‌కోట్‌లో ఉన్న తెహ్రీ హైడ్రో డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన టన్నెల్‌లో ఈ ఘటన జరిగింది. టీహెచ్‌డీసీ టన్నెల్ నుంచి సుమారు 19 మందిని బయటకు తీసుకువచ్చారు. దీంట్లో ఏడు మంది మృతిచెందినట్లు ధ్రువీకరించారు. 13 మంది పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నది. కొందర్ని శ్రీనగర్‌లోని బేస్ ఆస్పత్రికి తరలించారు. టన్నెల్‌లో చిక్కుకున్న మిగితా కార్మికుల కోసం ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ దళాలు రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టాయి.

టన్నెల్‌లోకి భారీ స్థాయిలో నీరు ప్రవేశించిందని ఎన్డీఆర్‌ఎఫ్ టీమ్ కమాండర్ అమృత్ లాల్ మీనా తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన తర్వాత టన్నెల్‌లో భారీగా నీరు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రత్యేక ఎక్విప్మెంట్ సహకారంతో మృతదేహాలను వెలికితీసినట్లు చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో టన్నెల్‌లో సుమారు 22 మంది ఉండి ఉంటారని టీహెచ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార్ శరద్ తెలిపారు.



## రాధాకృష్ణన్ వైద్యకళాశాలకు రూ.80 కోట్ల ఆస్తి దానం

### రిటైర్డ్ డాక్టర్ దంపతుల ఔదార్యం

**హమీర్‌పూర్, ఆగస్టు 14:** ఓ రిటైర్డ్ డాక్టర్ ఔదార్యాన్ని ప్రదర్శించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని డాక్టర్ రాధాకృష్ణన్ మెడికల్ కాలేజీకి సుమారు 80 కోట్ల విలువైన ప్రాపర్టీని రిటైర్డ్ సీనియర్ డాక్టర్ డాక్టర్ రాజేంద్ర కన్వర్ దానం చేశారు. ఆయన వయసు 77 ఏళ్లు. తనకు చెందిన మొత్తం స్థిర, చర ఆస్థులను ఆయన దానం చేశారు. 2021లో ఆయన దీనికి సంబంధించిన వీలునామా రాశారు. ఓ గిఫ్ట్ డీడ్‌తో ఆ ప్రక్రియను పూర్తి చేశారు. తనకు చెందిన భూమిని మెడికల్ కాలేజీ పేరు మీద మ్యుటేషన్ చేయించాడు. ఆయన సుమారు 33 ఏళ్ల పాటు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో వైద్యుడిగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం నాదాన్ ఏరియాలో ఉన్న జోల్ సప్పార్ మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్నారు. పేదలకు, అవసరమైన వారికి ఆయన చికిత్స కొనసాగిస్తున్నారు. తన భార్య కృష్ణ కన్వర్‌తో కలిసి తన ఆస్తులను దానం చేసే నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెప్పారు. ఆ జంటకు పిల్లలు లేరు. తాము ఆర్జించిన జీతం సమాజ సంక్షేమం కోసం వాడాలని వారికి కోరిక ఉన్నది. విద్యాశాఖలో సుమారు 32 ఏళ్ల పాటు కృష్ణ కన్వర్ పనిచేశారు. 2011లో ఆమె స్కూల్ ప్రిన్సిపాల్ హోదాలో రిటైర్ అయ్యారు. విరాళం ఇచ్చిన ప్రాపర్టీల్లో రెండు అంతస్తుల బిల్డింగ్, కోట్ల ఖరీదైన నగలు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. తమ ఇంటిని ఓల్డేజ్ హోమ్‌గా మార్చాలని కోరారు. కృష్ణరాజేంద్ర ఓల్డేజ్ హోమ్ అని పేరు పెట్టాలన్నది. తన అవయవాలను కూడా ఆయన దానం చేశారు. మన సంపాదన వేరొకరి జీవితాలను సంతోషపెడితే అది ఉత్తమమైనదని ఆయన అన్నారు.

# నేడు ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీశనివారం ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా ప్రసంగించనున్నారు. జాతీయ గీతం వందే మాతరానికి 150 ఏళ్ల చారిత్రక వారసత్వాన్ని స్మరించుకోవడంతో పాటు, 2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో యువశక్తి ఉత్సాహం, ఆకాంక్షలు, కీలక పాత్రను ఈ వేడుకల్లో ప్రదర్శించనున్నారు. తొలిసారిగా ఎర్రకోట స్వాతంత్ర్య వేడుకల్లో వందే మాతర్మ్‌ను ప్రత్యేకంగా ఆలపించనున్నారు. శనివారం ఉదయం 7.30 గంటల నుంచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లు వేడుకలను ప్రసారం చేయనుండగా, దూరదర్శన్ అధికారిక ప్రసారకర్తగా వ్యవహారిస్తుంది. ఎర్రకోటకు చేరుకున్న ప్రధాని మోడీకి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ స్వాగతం పలుకుతారు. అనంతరం ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేశ్ సేథీని ప్రధానికి పరిచయం చేస్తారు. ఆయన ప్రధాని మోడీని సల్యూటింగ్ బేస్‌కు తీసుకెళ్లగా, త్రివిధ దళాలు, ఢిల్లీ పోలీసులతో కూడిన గార్డ్ ప్రధానికి జనరల్ సెల్యూట్ సమర్పిస్తుంది.ఆ తర్వాత ప్రధాని గార్డ్ ఆఫ్ ఆనర్‌ను పరిశీలిస్తారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమన్వయ బాధ్యతను భారత సైన్యం నిర్వహిస్తోంది. గార్డ్ ఆఫ్ ఆనర్‌కు లెఫ్టినెంట్ కల్నల్ అర్జున్‌సింగ్ నేతృత్వం వహించనున్నారు.గార్డ్ ఆఫ్ ఆనర్ పరిశీలన అనంతరం ప్రధాని ఎర్రకోట ప్రాకారాలపైకి చేరుకుంటారు. కెప్టెన్ సోనియా సింగ్ చౌహాన్ సహాయంతో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. అదే సమయంలో 1721 ఫీల్డ్ బ్యాటరీకు చెందిన సైనికులు 21 తుపాకుల వందనం సమర్పిస్తారు. స్వదేశీ 105ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌ను ఇందుకోసంవినియోగించనున్నారు.జాతీయ పతాకావిష్కరణ అనంతరం రాష్ట్రీయ సెల్యూట్ నిర్వహిస్తారు. ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్, 25 మంది ఇతర సిబ్బందితో కూడిన ఆర్మీ బ్యాండ్ వందే మాతరాన్ని ఆలపిస్తుంది. అనంతరం ఎర్రకోట వద్ద హాజరైన వారందరూ జాతీయ గీతాన్ని ఆలపిస్తారు.పతాకావిష్కరణ సమయంలో భారత వైమానిక దళానికి చెందిన రెండు హెలికాప్టర్లు పూల వర్షం కురిపించనున్నాయి. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని, మరొకటి వందే మాతరంను సూచించేజెండాను మోసుకెళ్తుంది.ఈ కార్యక్రమాల అనంతరం ప్రధాని దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

# దేనికీ భయపడను..మనోధైర్యంతోనే ఉంటా: సుఖ్‌బీర్‌సింగ్ బాదల్

**ముంబయి, ఆగస్టు 14:** మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన దాడి ఘటనలో గాయపడిన పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం తన తొలి ప్రకటన విడుదల చేశారు. తాను దేనికీ భయపడేది లేదని, ఎల్లప్పుడూ చార్దీకళా ఉన్నతమైన, ఉత్సాహభరితమైన మనోధైర్యంతోనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. నాందేడ్‌లోని ముగట్ వద్ద ఉన్న గురుద్వారా మాతా సాహిబ్ దేవాన్ జీని తన కుటుంబంతో కలిసి దర్శించుకునేందుకు వెళ్లిన సమయంలో జస్పాల్ సింగ్ అనే వ్యక్తి కృపాణం (చిన్నకత్తి)తో హఠాత్తుగా బాదల్‌పై దాడికి యత్నించాడు. అయితే ఆయనతో పాటు ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అడ్డుపడటంతో బాదల్ కుడి చేతికి గాయమైంది. ఈ క్రమంలో ఆయనను కాపాడిన సబ్ ఇన్‌స్పెక్టర్ కూడా గాయపడ్డారు. దాడి చేసిన నిందితుడిని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకోగా, అతడు పుణెకు చెందిన వ్యక్తిగా, గత రెండేళ్లుగా ఆ గురుద్వారాలో సేవకుడిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేలు ఫోన్‌లో మాట్లాడి బాదల్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. సీఎంఆదేశాల మేరకు ఈ దాడిపై ఏటీఎస్, ఐబీ ఉన్నత స్థాయి విచారణ చేపట్టాయి.

# సావర్కర్‌పై వ్యాఖ్యలు: రాహుల్‌పై కేసు కొట్టేసిన సుప్రీం



**న్యూఢిల్లీ,ఆగస్టు 14:** పరువునష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వినాయక్ దామోదర్ సావర్కర్‌పై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన క్రిమినల్ పరువునష్టం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో అంతకుముందు లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను కూడా కోర్టు రద్దు చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షిల్ నాగుతో కూడిన ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణకు అవసరమైన అనుమతిని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి పొందలేదని, అందువల్ల ఇది విచారణార్హం కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీంతో రాహుల్‌పై నమోదైన క్రిమినల్ పరువునష్టం కేసును కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై తమ అనుమతి తీసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు తమ వద్ద లేదని చెబుతూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలివి. భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022, నవంబర్ 17న మహారాష్ట్రలోని అకోలాలో పర్యటిస్తుండగా రాహుల్ గాంధీ సావర్కర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేశారు. రాహుల్ ఉద్దేశపూర్వకంగా సావర్కర్ గౌరవాన్ని తగ్గించే లక్ష్యంతోనే ఈ వ్యాఖ్యలు చేశారని, ఆయన పరువుకు భంగం కలిగించారని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే లాయర్ రాహుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లక్నో కోర్టు దీనిపై విచారణ జరిపి, రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరారు. స్పందించిన సుప్రీంకోర్టు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

# విజయ్ సర్కారు నిర్ణయానికి సుప్రీంలో ఊరట






**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** కరూర్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తమిళనాడు సీఎం విజయ్ తీసుకున్న నిర్ణయానికి సుప్రీంకోర్టు మద్దతు లభించింది. ఈ నియామకాలు చెల్లవు అంటూ ఇటీవల మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. ఈ మేరకు జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్ ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలివి. తమిళనాడులో గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్ పట్టణంలో తొక్కిసలాట జరిగింది. టీవీకే అధినేత విజయ్ నిర్వహించిన బహిరంగ సభ సందర్భంగా జరిగిన ఈ తొక్కిసలాటలో 41 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన విజయ్ కరూర్ బాధితులైన పలువురి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు అందజేశారు. జూలై 10న సీఎం విజయ్ నియామక పత్రాలు అందజేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రమాద మృతులకు ఏ ప్రాతిపదికన ప్రభుత్వ ఉద్యోగం ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వారి ఉద్యోగ నియామకాల్ని రద్దు చేయాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు ప్రభుత్వ ఆదేశాలు చెల్లవని పేర్కొంది. ఈ ఉద్యోగ నియామకాల్ని రద్దు చేసింది. ఇలా చేస్తే, ఇదేతరహా విజ్ఞాపనలు ఇంకా పెరుగుతాయని పేర్కొంది. ఇలా పరిహారం కింద ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం చెల్లదని, ఎందరో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని హైకోర్టు పేర్కొంది. ఉద్యోగాలు అర్హతతో సాధించుకోవాలని సూచించింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, ఆర్ శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. తాము కల్పించిన ప్రభుత్వ ఉద్యోగాల్ని హైకోర్టు రద్దు చేయడంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది.మీరు ప్రభుత్వ పాలసీనే ప్రశ్నిస్తారా కుటుంబానికి ఆదాయం అందించే వ్యక్తి మరణిస్తే వారి కొడుకుకు లేదా కూతురుకు ఉపాధి కింద ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వకూడదా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

## కెవైసి కష్టాలపై నాగా మంత్రి కామెడి విడియో

**ఇంఫాల్, ఆగస్టు 14:** బీజేపీకి చెందిన నాగాలాండ్ పర్యాటక, ఉన్నత విద్యాశాఖ మంత్రి టెమ్‌జెన్ ఇమ్నా అలోంగ్ సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటారు. కేవైసీ కష్టాలపై కామెడీగా తీసిన ఒక వీడియోను మంత్రి కష్టాలు నిజం అనే క్యాప్షన్‌తో తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో ఈశాన్య ప్రాంతంలోని ప్రజల బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఇబ్బందులు, సవాళ్లను ప్రశ్నిస్తుంది. టెక్నాలజీపై చర్చకు దారితీసింది. ఈ వీడియోలో ఒక వ్యక్తి తన కేవైసీని పూర్తిచేసే క్రమంలో ఐరిస్ స్కాన్ చేయడానికి పదేపదే ప్రయత్నిస్తున్నారు. అయినా స్కాన్ కాకపోవడంతో అతని దోస్తులు అతడి కళ్లను పట్టుకుని తెరిచేందుకు కష్టపడుతున్నారు. ఎన్నిసార్లు చేసిన విఫలమవుతుండటంతో పక్కను ఉన్నవారు నవ్వుతున్నారు. దీన్ని కామెడీగా తీసినప్పటికీ డిజిటల్ సేవలకు సంబంధించిన కేవైసీ, బయోమెట్రిక్ ప్రామాణీకరణలపై ప్రజల్లో ఆందోళనను కలిగిస్తుంది.

జనాభాలో చాలామందికి శారీరక లక్షణాల్లో తేడాలు ఉంటాయి. వీరికి బయోమెట్రిక్ ఇబ్బందులు తలెత్తుతాయి. ఇలాంటివారు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ధ్రువీకరణ పద్ధతులను ఏర్పాటు చేయాలని ఈ పోస్ట్ చూసిన చాలామంది కోరుతున్నారు. ఇలాంటి సమస్యలున్నవారి కోసం చైనా, జపాన్, ఇతర ఆసియా దేశాలు ఏదైనా టెక్నాలజీని రూపొందించి ఉంటాయని, వాటిని పరిశీలించాలని సూచిస్తున్నారు. సమస్య టెక్నాలజీలో ఉంది, మనుషుల్లో కాదు అని అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు. ఇలాంటి సమస్య ఉన్నవారికి ఎలాంటి ఐరిస్ స్కాన్ అందుబాటులో ఉందో చెప్పు అని సరదాగా చాట్‌బాట్ గ్రోక్‌కు ట్యాగ్ చేస్తున్నారు. దేశంలోని ఈశాన్య ప్రాంత ప్రజలు ఒకేలా కనిపిస్తారనే రూమర్ ఆధారంగా కామెడీగా ఈ వీడియో రూపొందించారు. మంత్రి హాస్యాన్ని జోడించి ఈ వీడియోను పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఈ వీడియో ఏకంగా 3.5 లక్షలకు పైగా వ్యూస్, పదివేలకు పైగా లైక్‌లను సంపాదించింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ షేర్ చేస్తూ అలోంగ్ ఫుల్ జోష్‌లో ఉన్నారని చమత్కరించారు. ఆయన గతంలో కూడా ఈశాన్య ప్రాంత కళ్లపై హాస్యాన్ని జోడించి మాట్లాడారు. చిన్న కళ్ల ఉంటే ధూళి ప్రవేశించదని, ఏదైనా కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు నిద్రపోయినా గుర్తుపట్టరని చమత్కరించారు.

# స్టాండప్ కమెడియన్ సమయ్‌రైనాపై కేసు కొట్టివేత



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** యూట్యూబ్ కామెడీ షో ఇండియాస్ గాట్ లేటెంట్‌లో దివ్యాంగులనుద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కేసుకు సంబంధించి ప్రముఖ స్టాండప్ కమెడియన్ సమయ్ రైనాతో పాటు మరో నలుగురికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారీ ఉపశమనం లభించింది. వారిపై నమోదైన అన్ని క్రిమినల్ ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో దివ్యాంగుల సంక్షేమం, నిధుల సమీకరణ, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను సమయ్ రైనా బృందం సమర్థవం తంగా అమలు చేయడాన్ని ధర్మాసనం ప్రశంసిం చింది. నిజాయతీతో కూడిన ప్రయత్నాలు చేసినప్పుడు కచ్చితంగా మంచి ఫలితాలు వస్తాయి. వీరంతా అత్యంత తెలివైన యువకులు. వీరు సానుకూల దిశలో పనిచేయడం ప్రారంభిస్తే, ఆ నిష్పత్తిలోనే మంచి ఫలితాలు వస్తాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సమయ్ రైనాతో పాటు విపుల్ గోయల్, బల్‌రాజ్ పరమ్‌జీత్ సింగ్ ఘాయ్, సోనాలి థక్కర్ నిశాంత్ జగదీష్ తన్వర్ లపై ఉన్న క్రిమినల్ వ్యవహారాలను పూర్తిగా ముగిస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. 2024 నవంబర్ 14న రికార్డై ఆ తర్వాత ప్రసారమైన ఇండియాస్ గాట్ లేటెంట్ ఎపిసోడ్‌లో దివ్యాంగులు, అరుదైన జన్యు వ్యాధి ఉన్న వారిని ఉద్దేశించి అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో పలు స్వచ్ఛంద సంస్థలు కోర్టును ఆశ్రయించగా, ఈ కమెడియన్లపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత తప్పు తెలుసుకున్న ఈ యువ కమెడియన్లు దివ్యాంగుల కోసం నిధుల సమీకరణ కార్యక్రమాలు, చెస్ టోర్నమెంట్లు, చైతన్య సదస్సులు నిర్వహించి నిధులను సేకరించారు. కమెడియన్లపై ఉన్న కేసులను క్లోజ్ చేసినప్పటికీ, భవిష్యత్తులో డిజిటల్ లేదా ఆన్‌లైన్ కంటెంట్‌లో దివ్యాంగుల ఆత్మ గౌరవానికి భంగం కలగకుండా ఎలాంటి నిబంధనలు తీసుకోవాలో పరిశీలించేందుకు ఈ ప్రధాన అంశంపై విచారణ కొనసాగుతుందని సుప్రీంకోర్టు తెలిపింది.

# భారతీయ రైల్వేలపైనే ఐఎస్ఐ ఫోకస్

## ఇప్పటికే సమాచార సేకరణ కోసం ఏజెంట్ల నియామకం, ఐబి హెచ్చరికలు



న్యూఢిల్లీ, ఆగస్టు 14: దేశానికి జీవనాడి అయిన భారతీయ రైల్వే వ్యవస్థపై పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ (ఐఎస్ఐ) భారీ కుట్రకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడించాయి. రైల్వేలు ఇటీవల కాలంలో ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యంగా మారాయని, దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించేందుకు ఐఎస్ఐ ఒక పక్కా వ్యూహంతో ముందుకెళుతోందని ఇంటెలిజెన్స్ బ్యూరో తన నివేదికలో హెచ్చరించింది. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఈ హెచ్చరికలు తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐఎస్ఐ తన గూఢచర్య కార్యకలాపాలను ప్రధానంగా భారత సైన్యం, రైల్వేలపైనే కేంద్రీకరించింది. ఇటీవలి కాలంలో ఈ వ్యూహంలో స్పష్టమైన మార్పు కనబడుతోంది. సైనిక స్థావరాలపై సమాచారం సేకరణ దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా ఉండగా, రైల్వేలపై మాత్రం తక్షణ దాడులు చేయాలనే ఉద్దేశంతో సమాచారాన్ని సేకరిస్తున్నారు. దేశ రవాణా వ్యవస్థకు రైల్వేలు వెన్నెముక అని, వాటిని దెబ్బతీస్తే ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించవచ్చని ఐఎస్ఐ భావిస్తోంది. ఈ కుట్రలో భాగంగా ఐఎస్ఐ రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తోంది. ఒకటి, రైల్వే స్టేషన్లు, ట్రాక్‌లపై నేరుగా దాడులు చేయడం. రెండోది, ప్రజలను మానసికంగా దెబ్బతీసేందుకు మైండ్ గేమ్స్ ఆడటం. ఇందుకోసం ప్రత్యేకంగా కొందరిని నియమించుకుని, రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో బాంబు బెదిరింపుల వంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయిస్తున్నారు. ఈ కుట్ర కోసం గత ఏడాది కాలంగా ఐఎస్ఐ నిఘాను పదిరెట్లు పెంచింది. కేవలం రూ.3వేలు వంటి స్వల్ప మొత్తానికే కొందరు యువకులను ఏజెంట్లుగా నియమించుకుని, వారి ద్వారా రైల్వే స్టేషన్లలోని కీలక ప్రదేశాలను ఫోటోలు తీయించడం, భద్రతా ఏర్పాట్లను అంచనా వేయించడం వంటివి చేస్తోంది. మరింత పక్కాగా సమాచారం కోసం కొన్ని రైల్వే స్టేషన్లలో సోలార్ పవర్ ఆధారిత సీసీటీవీ కెమెరాలను కూడా రహస్యంగా ఏర్పాటు చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఒక్కో కెమెరా అమర్చినందుకు రూ.ఐదువేల నుంచి రూ.పదివేల వరకు చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడులకు ఇస్లామిస్ట్ గ్రూపులతో పాటు పంజాబ్, హర్యానాల్లో రైల్వేలను లక్ష్యం చేసుకునేందుకు బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బీకేఐ) వంటి సంస్థలను కూడా ఐఎస్ఐ వాడుకుంటోందని తెలిసింది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో భద్రతా బలగాలు ఢిల్లీపై ఎక్కువగా దృష్టి సారిస్తాయని, ఇదే అదనుగా రైల్వే వ్యవస్థపై దాడికి ఉగ్రమూకలు ప్రయత్నించవచ్చని ఐబీ హెచ్చరించింది. దీంతో ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లలో హై అలర్ట్ ప్రకటించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

# సంక్షిప్త వార్తలు

## ప్రతి నీటి బొట్టూ భారత్‌కు రెడ్‌లైన్: షెహబాజ్



**ఇస్లామాబాద్, ఆగస్టు14:** సింధూ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. సింధూ జలాల్లో తమకు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టును రెడ్‌లైన్‌గా పరిగణిస్తామని ప్రేలాపనలు చేశారు. తమ నీటి హక్కులను కాలరాసేలా భారత్ ఎలాంటి చర్యలకు పాల్పడినా గట్టిగా బదులిస్తామని ప్రగల్భాలు పలికారు. పాక్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్లామాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ హెహబాజ్ షరీఫ్ ఈ కవ్వింపు వ్యాఖ్యలు చేశారు.

## 'దయచేసి మా జోలికి రావద్దు': యుఎఇ



**అబుదాబి, ఆగస్టు 14:** అమెరికా-ఇరాన్ మధ్య సంఘర్షణతో తీవ్రంగా ప్రభావితమైన పశ్చిమాసియా దేశాల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) కూడా ఒకటి. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగు తోన్న తరుణంలో యుఎఇ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్‌కు చెందిన పలు బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను విడుదల చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వీటిలో సుమారు 283 మిలియన్ డాలర్లు (భారత్ కరెన్సీలో రూ.2,700 కోట్లు) విలువైన దాదాపు రెండు టన్నుల బంగారం కూడా ఉందని వార్తలు వస్తున్నాయి.

## పంద్రాగస్టు వేళ ఢిల్లీలో బాంబు బెదరింపులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** దేశం ఒకపక్క స్వాతంత్ర్య దిన వేడుకలకు సిద్ధమవుతుంటే మరోపక్క దేశ రాజధానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీలోని ఎయిర్‌పోర్టు, ఎర్రకోట, హైకోర్ట్ సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం అధికారులకు ఒక ఈమెయిల్ వచ్చింది. దీనిలో ఢిల్లీలోని కోర్టులు, రైళ్లలో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరించారు. ఆగష్టు 15న ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో ఉంది. అందులోనూ ఢిల్లీ హైకోర్టును ఆగష్టు 15న మధ్యాహ్నం 2.11 గంటలకు పేల్చేస్తామని కూడా పేర్కొన్నారు. ఢిల్లీని ఖలిస్తాన్‌లో భాగంగా చేయాలనే లక్ష్యంతో ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో పేర్కొన్నారు.

## ఎయిమ్స్‌లో చేరిన ఆరోగ్యమంత్రి జెపినడ్డా



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డా ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. జేపీ నడ్డా వయసు 65. ఈ నేపథ్యంలో ఆయనకు ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు అనేక రకాల పరీక్షలు నిర్వహించారు. వాటిలో కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్ష కూడా ఉంది. ప్రస్తుతం జేపీ నడ్డా ఆరోగ్యం నిలకడగా ఉందని, కార్డియాలజీ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రివర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

## సెప్టెంబర్‌లో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సెప్టెంబరులో భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో ఆయన పాల్గొంటారు. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్ 18వ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సు బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ అనే అజెండాతో సాగనుంది. 2026 ఆరంభంలో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ నుంచి భారత్ స్వీకరించింది.

## త్వరలో భారత్‌లో పర్యటించనున్న బంగ్లా ప్రధాని తారిఖ్ రెహ్మాన్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ వచ్చే వారంలోనే భారత్‌లో ద్వైపాక్షిక పర్యటనకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత్‌లో పర్యటనపై ఇప్పటికే ఆహ్వానం అందినట్లు భారత ప్రభుత్వ వర్గాలు కూడా వెల్లడించాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వ వర్గాల ప్రకారం తారిఖ్ రెహ్మాన్ వచ్చే వారంలో భారత్‌కు వచ్చే అవకాశం బలంగా ఉంది. అయితే పర్యటనకు సంబంధించిన తేదీలు, ఇతర అంశాలపై ఇరు దేశాలు ఇంకా చర్చలు జరుపుతున్నాయి. అధికారిక ప్రకటన మాత్రం వెలువడాల్సి ఉంది.

15-8Pg6exHMNWJQE:15-8Pg6exHMNWJQE.qxd 8/14/2026 11:53 PM Page 1



## తిరుమల సమాచారం



### బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్‌కు రూ.20లక్షలు విరాళం

**తిరుమల,ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** పేదలకు వైద్య సేవలు అందిస్తున్న టిటిడి బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి డాక్టర్ కోడెల కుటుంబం 20 లక్షల రూపాయలు విరాళం అందించారు. నవ్యాంధ్ర ప్రదేశ్ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ ఆశయాలకు అనుగుణంగా ఆయన మనవళ్లు కోడెల గౌతం 10 లక్షలు, కోడెల జేయాదిత్య 10 లక్షలు రూపాయలు విరాళంగా అందించినట్లు తెలిపారు. ఈ మేరకు విరాళానికి సంబంధించిన డిడిలను శుక్రవారం టిటిడి ఇఒ కార్యాలయంలో ఇఒ ముద్దాడ రవిచంద్రకు డాక్టర్ కోడెల శివరామ కృష్ణ అందించారు. పేదలకు వైద్య సహాయం అందిం చేందుకు టిటిడి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు విరాళం అందించిన డాక్టర్ కోడెల కుటుంబాన్ని ఇఒ అభినందించారు. భక్తులు, దాతలు టిటిడి చేపడుతున్న సేవా కార్యక్రమాలకు మరింతగా సహకరిం చాలని ఆయన కోరారు.



### వేదోక్తంగా పురుశైవారి తోట ఉత్సవం

**తిరుమల,ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** ఆండాళ్ అమ్మ తిరువాడిపురం శాత్తుమొర పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం తిరుమలలో పురుశై వారి తోట ఉత్సవం ఘనంగా జరిగింది. పురాణాల ప్రకారం పాండ్య దేశం లో విష్ణుభక్తుడైన విష్ణుచిత్తుడికి చెందిన తులసీవనంలో భూదేవి అంశగా ఆండాళ్(గోదాదేవి) అమ్మవారు ఆవిర్భవించారు. ఈ సందర్భాన్ని పురస్క రించుకుని టిటిడి ప్రతి ఏడాదీ తిరువాడిపురం శాత్తుమొర నిర్వహిస్తోంది. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి కలిసి పురుశైవారితోటలో ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర నిర్వహించారు.

సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పురుశైవారితోటకు వేంచేపు చేశారు. అక్కడ నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా తిరిగి బయల్దేరారు. మార్గమధ్యంలో పొగడ చెట్టుకు హారతి, పుష్పమాల, శఠారి సమర్పించారు. శఠారికి అభిషేకం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మ వార్లు ఆలయ మాడ వీధుల గుండా ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు, అధి.కారులు, అనంతాళ్వార్ వంశస్తులు పాల్గొన్నారు.

### టిటిడి పేరుతో నకిలీలను నమ్మకండి

**తిరుమల,ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు, వసతి బుకింగ్‌ల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్ ఖాతాలు, సామాజిక పేజీల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. టిటిడి పేరుతో కొందరు మోసగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్ ఖాతాలు, సోషల్ మీడియా పేజీలు నిర్వహిస్తూ భక్తులను ఆకర్షిస్తున్నారు. శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి తదితర బుకింగ్‌లు ఇప్పిస్తామంటూ నమ్మించి భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు టిటిడికి పలు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో భక్తులు టిటిడికి సంబంధించిన దర్శనం, సేవలు, వసతి బుకింగ్‌లను అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక యాప్ ద్వారా మాత్రమే చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. టిటిడి పేరు, లోగో, చిత్రాలు, ట్రేడ్‌మార్క్‌లను ఉపయోగిస్తూ నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ఐటీ, విజిలెన్స్, సైబర్ క్రైమ్ పోలీస్ తదితర విభాగాల సమన్వయం చేసుకుని ప్రత్యేక నిఘా ఉంచడం జరిగింది. ఇటువంటి నకిలీ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను గుర్తించి తొలగించడం, బ్లాక్ చేయించడం, దర్యాప్తు చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరుగుతోంది. గత రెండేళ్లలో 259 ఫేక్ వెబ్ సైట్లను గుర్తించి తొలగించడంతో పాటు ఆ వెబ్ సైట్ లకు సంబంధించిన పలువురు వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగింది. టిటిడి సేవలు, దర్శనం, వసతి బుకింగ్‌లను అధికారిక టీటీడీ వెబ్‌సైట్/యాప్‌లో మాత్రమే చేసుకోవాలని కోరింది.

### గాజుల అలంకరణలో కరుమారియమ్మ

**తిరుపతి, ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి తిలక్ రోడ్డులోని కరుమారియమ్మ దేవాలయంలో ఆడి నెల మహోత్సవాల్లో చివరి శుక్రవారం అమ్మవారు ప్రత్యేక గాజుల అలంకరణలో భక్తులకు దివ్య దర్శన మిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, గాజుల తో సుందరంగా అలంకరించారు. చివరి వారం ప్రత్యేకతగా గాజుల అలంకరణలో కరుమా రియమ్మ భక్తులకు దివ్య దర్శనంతో భక్తులు ఆధ్యాత్మికభావంతో పులకిం చారు. గాజులతో అలంకరించిన అమ్మవారి రూపాన్ని దర్శించేందుకు వంద లాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకున్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా పొం గలి సమర్పించి, నైవేద్యాలు అర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లిం చుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

# శోభాయమానంగా తిరంగా

### తిరుపతిలో భారీ బైక్ ర్యాలీ

**తిరుపతి,ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగరంలో శుక్రవారం సాయంత్రం కూటమి పార్టీల ఆధ్వర్యంలో నగరంలో భారీ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా మన గౌరవానికి ప్రతీక అని, దానిని భుజానికెత్తుకుని దేశం కోసం నిలబడడమే దేశభక్తి అని కూటమి పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు



**తిరుపతి రైల్వే స్టేషన్‌లో**

**తిరుపతి,ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తిరుపతి రైల్వే స్టేషన్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనా రాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో రైల్వే ఉన్నతా ధికా రులు, సిబ్బంది, ఐఆర్ సిటిసి అధికారి సోమశేఖర్ నాయుడు ఆర్‌పీ ఎఫ్, జీఆర్‌పీ పోలీసులు, ప్రయాణికులు పాల్గొన్నారు. జాతీయ జెండా లను చేతబూని దేశభక్తిని చాటుకుంటూ రైల్వే స్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫాం నుంచి పార్సల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ జెబి శ్రీనివాస్ ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం తిరుపతి నగరంలో భారీ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలి నుండి ప్రకాశం రోడ్డు, పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం, గాంధీ రోడ్డు, నాలుగు కాళ్ళ మండపం మీదుగా శ్రీదేవి కాంప్లెక్స్ వరకు జనసంద్రోహం నడుమ త్రివర్ణ పతాకాలతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశభక్తిని చాటడం, జాతీయ సమైక్యతను పెంపొందించడానికి కూటమి



పార్టీల పిలుపుమేరకు ఘనంగా ర్యాలీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తాతయ్య గుంట ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్, వరప్రసాద్, తోట వాసు, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్వీఎం శ్రీధర్, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, ఆముదాల తులసి, ఆముదాల వెంకటేష్, జే కీ రాయల్, సుధాకర్, అంకాలమ్మ దేవాలయం చైర్మన్ కొండా రాజమోహన్, ఎన్డీఏ కూటమి నాయకులు రఘు, మాజీ కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, మహిళా నాయకురాళ్లు భారతి, యశోద, అనిత, రేవతి, రేఖ కూటమి పార్టీల యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**విజయనగరంలో 150 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ**

**విజయనగరం, ఆగస్టు 14, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం విజయనగరం కోట కూడలి నుంచి 150 అడుగుల పొడవైన జాతీయ జెండాతో నిర్వహించిన భారీ ర్యాలీని రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ జెండా ఊపి ప్రారంభించారు. భారీ సంఖ్యలో ప్రజలు, యువత, విద్యార్థులు, అధి కారులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండ పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మన దేశం-మన బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ ర్యాలీలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రాంతీయ వాసి, మహాకవి గురజాడ అప్పారావు చెప్పిన దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కృషి చేస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎన్నో తరాల నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాల ఫలితంగా మనకు స్వాతంత్రం లభించిందని, వారి త్యాగాలను భావితరాలకు తెలియ జేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ భారీ ర్యాలీ ప్రజల్లో స్ఫూర్తి, దేశభక్తి, దేశం పట్ల గౌరవాన్ని మరింత పెంపొందించేలా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ దేశానికి యువతే వెన్నెముక అని అన్నారు.

ప్రతి యువకుడిలో దేశభక్తి, దేశంపై ప్రేమ, అభిమానం వెల్లివిరియాలని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, యువత జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈకార్యక్రమంలో డి ఆర్ ఓ సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో సుధా సాగర్ మున్సిపల్ కమిషనర్ బాలస్వామి డిఆర్డిఏ పిడి శ్రీనివాస్ పాణి, డి ఎస్ డి ఓ వెంకటేశ్వరరావు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆంధ్ర ఇండెంట్ కోసం నిరీక్షణ!

### నీరు వదిలే విషయంలో తుంగభద్ర బోర్డు ఇక్కట్లు



**అనంతపురం, ఆగస్టు 14, ప్రభాతవార్త బ్యూరో :** ఆంధ్ర కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం సంబంధించి నీరు వదిలే విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తగు రీతిలో ఇండెంట్ రాక తుంగభద్ర బోర్డు అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన రైతులు, రైతు సంఘాలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోతున్నారు.. ఇటు శ్రీశైలం, అటు తుంగభద్ర జలాశయానికి పై ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో రావడం తగ్గిపోవడంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు నీటి పంపిణీ విషయం ఈ విధంగా ఏ విధంగా నిర్ణయం తీసుకోవాలి ఆంధ్రప్రదేశ్ అధికారులు తర్జనభజన పడుతున్నట్లు తెలుస్తోంది.. ఈ వారము, పది రోజుల్లో శ్రీశైలంకు పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లో వస్తే తగు రీతిలో స్పందించాలని ఏపీ ప్రభుత్వ అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా తుంగభద్ర జలాశయం నుంచి ఆంధ్ర వాటా కింద ఆగస్టు 11వ తేదీ అనంతపురం జిల్లాకు సంబంధించి హెచ్ ఎల్ సి కి తాగునీటి అవసరాల కోసం నీరు వదిలారు. అదే సమయంలో కర్నూలు జిల్లాకు సంబంధించి ఎల్. ఎల్.సి కు చాలా ముందుగా జూలై 16 తేదీన తాగునీటి అవసరాల కోసం టీ .బి .డామ్ అధికారులు నీళ్ళు వదిలారు.. తాజా గా ఆంధ్రా అధికారుల అనుమతి లేక పోవటంతో ఎల్ ఎల్ సికి పూర్తిగా నీరు నిలుపుదల చేసినట్లు తెలుస్తోంది. ఆంధ్రకి సంబంధించి ఎల్.ఎల్ సి కి నీళ్ల నిలుపుదల వాస్తవం అని టీబీ డ్యాం అధికారులు చెబుతున్నారు..ఇది పూర్తిగా తెలియక కర్ణాటక ప్రాంతం నుంచి నీళ్ల రానివ్వడం లేదని, కాలువల్లో ఇసుక మూటలు వేసి నీళ్ల రాకుండా అడ్డుకుంటున్నారని కర్నూలు జిల్లాలో ఆలూరు తదితర ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలియవచ్చింది. సహజంగా ప్రతి ఏటా కర్ణాటక రాష్ట్రాము లో ఎల్.ఎల్.సి కెనాల్ పరిధి జలచర్యం ఎక్కువ గా జరుగుతోందని,ఈ విషయం లో బోర్డ్ అధికారులు, ఆంధ్ర కర్ణాటక అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. తుంగభద్ర డ్యామ్ తాజా సమాచారం ప్రకారం గత ఏడాది ఇదే రోజుతో పోలిస్తే (80.003 టీఎంసీ) జలాశయంలో నీటి నిల్వ 9.44 టీఎంసీలు అధికంగా ఉంది. అలాగే, గత 10 ఏళ్ల సగటు అయిన 88.396 టీఎంసీల కంటే కూడా ఇది ఎక్కువగా ఉంది. పూర్తి సామర్థ్యానికి చేరుకోవడానికి ఇంకా సుమారు 16.35 టీఎంసీల నీరు అవసరం కాగా, రాబోయే రోజుల్లో తుంగభద్ర పరీవాహక ప్రాంతాల నుంచి బలమైన నీటి ప్రవాహం కీలకం కానుంది. టీబీ డ్యాంలో నీటి నిల్వ 89.442 / 105.788 టీఎంసీ సుమారు 85 నిండి ఉంది. అయితే, ప్రస్తుత టీబీ డ్యాం కు ఇంట్లో సగటున 27,897 క్యూసెక్కులుగా ఉంది, ఇది గత 10 సంవత్సరాల సగటు నీటి ప్రవాహం అయిన 50,686 క్యూసెక్కుల కంటే చాలా తక్కువ అని చెప్పవచ్చు.. తుంగభద్ర జలాశయం నుంచి నుంచి నీటి విడుదలకు సంబంధించి ఏపీ తన వాటాల నీరు విడుదలకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటం వల్ల కొన్ని సమస్యలు వస్తున్నాయి. ఉదాహరణకు ఎల్ఎల్సీ కెనాల్ కు



కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంగా ఇసుక సంచులు వేస్తున్న కర్ణాటక రైతులు

### తుంగభద్ర నీరు మేమే వాడుకుంటాం..

#### ఎల్ఎల్సీ కాలువకు అడ్డుకట్ట వేసిన కర్ణాటక రైతులు

**హాలహార్వి, ఆగస్టు 14, ప్రభాతవార్త;** తుంగభద్ర దిగువ కాలువ నీరు మేమే వాడుకుంటామంటూ కర్ణాటక రైతులు కర్ణాటక సరిహద్దు సింధువాళం దగ్గర ఎల్ఎల్సీ కాలువకు అడ్డకట్ట వేశారు. గత నెలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం తుంగభద్ర జలాశయం నుంచి ఎల్ఎల్సీ దిగువ కాలువకు 800 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తాగునీటి సౌకర్యం కోసం విడుదల చేసిన నీటిని తుంగభద్ర జలాశయం అధికారులు నిలిపి వేశారు. దీంతో ఆంధ్రకు రావాల్సిన నీటివాటాను నిలిపి వేయడంతో కాలువకు నీటి సరఫరా నిలిచిపోయింది. అయితే తుంగభద్ర జలాశయం కర్ణాటక నీటి వాటా 650 క్యూసెక్కుల నీరు దిగువ కాలువకు విడుదల చేశారు. కర్ణాటక వాటా కింద విడుదల చేసిన నీరు మేమే వాడుకుంటామని కర్ణాటక రైతులు శుక్రవారం సింధువాళం దగ్గర ఎల్ఎల్సీ కాలువకు అడ్డుకట్ట వేశారు. దీంతో ఆంధ్ర సరిహద్దు కాలువకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తీవ్రంగా ఆందోళనకు గురైన ఆంధ్ర రైతులు కాలువకు వేసిన అడ్డుకట్టను తొలగించాలని ఆంధ్ర రైతులు వాగ్వాదం చేశారు. ఈ విషయంపై స్పందించిన ఎల్ఎల్సీ జేఈ జడప్ప ఇరు రాష్ట్రాల రైతులతో మాట్లాడి వివాదాన్ని సద్దుమణిగించారు. ఈ సందర్భంగా జేఈ జడప్ప మాట్లాడుతూ ఆంధ్ర నీటి వాటా ఇంకా విడుదల చేయలేదని ఆయన తెలిపారు. త్వరలో బోర్డు అధికారుల సమావేశం నిర్వహించి, ఆంధ్ర నీటి వాటాను విడుదల చేస్తారని ఆయన తెలిపారు. అంతవరకు ఇరు రాష్ట్రాల రైతులు సమన్వయంతో ఉండాలని ఆయన తెలిపారు.



వాగ్వాదం చేస్తున్న రైతులు, అధికారులు



### ఖర్గేను అవమానించడం దారుణం

**తిరుపతి,ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** దళిత కులానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న ప్రాంతాన్ని గంగా జలంతో శుద్ధి చేసిన హిందూ మతోన్మాదులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. హిందూ మతోన్మాద శక్తుల తీరుకు నిరసనగా ఏఐసిసి పిలుపు మేరకు శుక్రవారం తిరుపతి లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుంచి అంబెడ్కర్ విగ్రహం వరకు పార్టీ జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించి డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అంజేశారు. అనంతరం అంబెడ్కర్ విగ్రహం ముందు దాదాపు రెండు గంటలపాటు సత్యాగ్రహం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డరెడ్డి రాంభూపాల్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాంగాటి గోపాల్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తూరు శివశంకర్, వెంకటరామయ్య, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సుప్రజ, తిరుపతి మహిళా విభాగం అధ్యక్షురాలు ముసీనా బేగం, తిరుపతి నగర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు గొడుగు చింత గోపి, ప్రధాన కార్యదర్శి ఆమూరి కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తవన్ కళ్యాణ్, చిత్తూరు జిల్లా కేకేసి అధ్యక్షుడు భాగ్యరాజ్, ఎస్సీ వియోగం విభాగం రాష్ట్ర కన్వీనర్ బోయన నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



### రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్పించాలి

**తిరుపతి,ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** సిపిఐ ఆంధ్రప్రదేశ్ శాఖ కార్యదర్శి జి ఈశ్వరయ్య పార్టీ కార్యక్రమంలో భాగంగా తిరుపతికి విచ్చేసిన సందర్భంలో ఆయనను ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ అక్కినపల్లె లక్ష్మయ్య, కోర్ కమిటీ సభ్యులు పి షణ్ముగం ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం కలిశారు. ఆంధ్ర రాష్ట్రంలో రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్పించే విషయం పై చేస్తున్న కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పార్టీ పరంగా లేఖను రాయాలని కోరారు. ఆయనకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సానుకూలకంగా స్పందించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య అట్టడుగు వర్గాలలో అత్యంత వెనుకబడి సామాజికంగా అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్న రజక కులాన్ని భారతదేశంలోని ఇతర18 రాష్ట్రాలు మూడు కేంద్ర పాలిత్ ప్రాంతాలలో ఉన్న విధంగా ఆంధ్ర రాష్ట్రంలో కూడా రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్పించడానికి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణం కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పార్టీ ఆంధ్ర రాష్ట్ర శాఖ సంపూర్ణమైన మద్దతునిస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటి సభ్యులు మల్లెల నాగరాజు, రాష్ట్ర రజక ఉద్యోగ సంఘం అధ్యక్షులు గంధం బాబు, మనోహర్ సురేంద్ర నారాయణ, అనురాధ, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్‌షాక్ గురై ఇద్దరి యువకులు మృతి

**పుత్తూరు రూరల్, ఆగస్టు 14 ప్రభాతవార్త:** ఫ్లెక్సీ కడుతూ విద్యుత్‌షాక్ గురై ఇద్దరి యువకులు మృతి చెందిన సంఘటన పుత్తూరు పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం జరి గింది. స్థానికుల కథనం మేర కు... పుత్తూరు పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన చిరంజీవి కుమారుడు గోకుల్ (18), కల్యాణపురంకు చెందిన గిరికుమార్ విగ్నేష్(19), స్నేహి తులు, ఇద్దరు ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ నేపథ్యంలో పుత్తూరులో శ్రీ ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల తిరుణాల సందర్భంగా శుక్రవారం రోడ్డులో ఫ్లెక్సీ కట్టేందుకు ఓ భవనం పైకి వెళ్లారు. ఫ్లెక్సీ కట్టే సమయంలో జారి 11కేవీ విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్‌షాక్ గురై ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుత్తూరు పోలీసులు తెలియజేశారు.



మృతి చెందిన యువకులు

# పారిశుద్ధ్యం ఫిర్యాదుల కోసం నందకం యాప్

### తిరుమలలో పవిత్రతతోబాటు స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత

#### టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల, ఆగస్టు 14 ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యధికంగా యాత్రికులు విచ్చేస్తున్న తిరుమల పుణ్యక్షేత్రంలో పవిత్రతతోబాటు స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని, ఆ దిశగా మరింత మెరుగ్గా పారిశుధ్య కార్యక లాపాలు చేపట్టాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఉద్ఘాటించారు. ఇప్పటికే స్వచ్ఛతలో తిరుమలకు మొదటిస్థానం లభిం చిందని, అలాగే రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తిరుమల పవిత్రతకు, స్వచ్ఛతకు మారుపేరుగా నిలిచేలా మరింత మెరుగైన పారిశుద్ధ్య కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన పరికరాలు, ఆధునిక యంత్రాల వినియోగంపై కూడా చర్చించారు. రియ ల్‌టైమ్ ఫిర్యాదుల పరిష్కారానికి నందకం యాప్ అమలుచేస్తున్నామన్నారు. తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా పర్యవేక్షి ం చేందుకు కొత్తగా నందకం యాప్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు అదనపు ఇఒ తెలిపారు. ఈ యాప్ ద్వారా పారిశుద్ధ్యానికి సంబంధించిన ఫిర్యాదులను రియల్‌టైమ్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారాన్ని కూడా పర్యవేక్షి ంచేలా ఫిర్యాదుల మేనేజ్‌మెంట్



సిస్టమ్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. తిరుమలలో ఎక్కడైనా పారిశుద్ధ్య సమస్య తలెత్తితే వెంటనే యాప్ ద్వారా గుర్తించి, సంబంధిత సిబ్బందికి సమాచారం అందించి, సమస్యను తక్షణమే పరిష్కరించే విధంగా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉంద న్నారు. తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. శుక్రవారం తిరుమల పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సంబంధిత ఏజెన్సీలతో ఆయన సమీక్ష నిర్వహిం చారు. సెప్టెంబర్ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ సందర్భంగా తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పెంపొందించడంపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు ఈవో మాట్లా డుతూ తిరుమలను మరింత స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలపై ఏజెన్సీల ప్రతినిధులతో చర్చించినట్లు చెప్పారు.

తిరుమలతో పాటు ఘాట్ రోడ్లు, శ్రీవారి మెట్టు, అలిపిరి ఫుట్‌పాత్, ఇతర పరిసర ప్రాంతాల్లోనూ స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పలు స్వచ్ఛంద సంస్థలు, మన ఊరు – మన గుడి వంటి సంస్థలు ముందుకు వచ్చి శుభ్రతా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినంద నీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు తిరుమలకే పరిమితం కాకుండా ఘాట్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పరిసర ప్రాంతాల్లోనూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఇటీవల భక్తుల నుంచి తిరుమలలో స్వచ్ఛతపై మంచి అభిప్రాయాలు వస్తున్నాయని తెలిపారు. తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణను అధికారులు, సిబ్బంది మాత్రమే బాధ్యతగా భావించకుండా ప్రతి భక్తుడు కూడా తన బాధ్యతగా తీసుకోవాలని అదనపు ఇఒకోరారు. పవిత్ర క్షేత్రానికి వచ్చే ప్రతి ఒక్కరూ ఇక్కడి పవిత్రత, స్వచ్ఛతను కాపాడాల్సిన బాధ్యతను గుర్తించాలన్నారు. అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేస్తున్నప్పుడు వారికి భక్తులు కూడా సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర అధికారులు

15-8Pg7exHMNWJQE:15-8Pg7exHMNWJQE.qxd 8/14/2026 11:52 PM Page 1



## అసెంబ్లీ సమావేశాలపై భద్రతా ఏర్పాట్లపై కోఆర్డినేషన్

**విజయవాడ,ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ఈనెల17వ తేదీ నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై కోఆర్డినేషన్ సమావేశమైంది. శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై జీఏడీ అధికారులు, అసెంబ్లీ ఉన్నతాధికారులతో చర్చించారు. వర్షాకాల సమావేశాల సందర్భంగా అసెంబ్లీ పరిసరాల్లో భద్రత, బందోబస్తు, సమస్యలపై కీలకంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్ ఎన్.మధుసూదన్ రెడ్డి, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్, ఐజీ, ఎస్పీ ఆఫ్ ఫోకీస్ హాజరయ్యారు.

## సాయికృష్ణ కేసులో హైకోర్టును ఆశ్రయించిన మానస

**విజయవాడ,ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** సాయికృష్ణ కేసులో విజయవాడ సిట్ ఏసీపీ మానస హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో డీజీపీ, సీపీలతో పాటు తనను కూడా నిందితులుగా చేర్చాలని కోరుతూ వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తి విజయవాడ కోర్టులో ఒక ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ పిటిషన్‌పై తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏసీపీ మానస హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ఎంపీ వేసిన ప్రైవేట్ పిటిషన్ విచారణ ప్రక్రియపై స్టే విధించింది. ఈ సందర్భంగా ప్రస్తుతం సిట్ విచారణ కొనసాగుతుండగా, ప్రైవేట్ పిటిషన్‌పై విచారణ జరపడం సరికాదని హైకోర్టు అభిప్రాయపడింది. అంతేకాకుండా ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని ఎంపీ గురుమూర్తిని ఆదేశిస్తూ, తదుపరి విచారణను 6 వారాల పాటు వాయిదా వేసింది.

## ఎఫ్‌సిఆర్ఏ బిల్లుపై ప్రాంతీయ పార్టీల వైఖరేంటి



**విజయవాడ, ఆగస్టు 14 (ప్రభాతవార్త):** విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం(ఎఫ్.సి.ఆర్.ఎ.)బిల్లుపై ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ పార్టీలు తమ వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జి కొలనుకొండ శివాజీ డిమాండ్ చేశారు. విజయవాడలోనిరాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రజా హక్కులు, ప్రజాస్వామ్య వ్యవస్థపై కత్తి పెడుతుంటే రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు నోరు మెదపకపోవడం దురదృష్టకరమన్నారు. బిజెపికి తోక పార్టీగా కాకుండా, ఎఫ్.సి.ఆర్.ఎ.బిల్లుపై తెలుగుదేశం పార్టీ స్వతంత్ర వైఖరిని స్పష్టం చేయలని డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇస్తున్నారో జనసేన నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. జనసేన రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేష్ మతాలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు రాస్తున్నారని, అయితే దేశ ప్రజలకు సంబంధించిన కీలకమైన బిల్లుపై జనసేన వైఖరిని మాత్రం ఎందుకు వెల్లడించడం లేదని శివాజీ ప్రశ్నించారు.

## హైకోర్టు న్యాయమూర్తి చక్రవర్తికి ఘన వీడ్కోలు

**విజయవాడ,,ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆధ్వర్యంలో ఫుల్ బెంచ్ సమక్షంలో ఘన వీడ్కోలు పలికారు. హై కోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తి పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని హైకోర్టు మొదటి కోర్టు హాల్లో శుక్రవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు. జస్టిస్ చక్రవర్తి తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువ రించారనిన్యాయ వ్యవస్థకు విశేష సేవలందించారని అభినందించారు. ఐటీ రంగంలో ప్రభజనం సృష్టించిన సత్యం కంప్యూటర్స్ కుంబకోణం కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తిగా చారిత్రాత్మక తీర్పును ఇచ్చారన్నారు. ప్రధాన నిందితుడితో పాటు 10 మందికి 7 సంవత్సరాల శిక్షను విధించి కీలకమైన తుది తీర్పును వెలువరించారని వివరించారు. జస్టిస్ చక్రవర్తి సివిల్, క్రిమినల్ మరియు పబ్లిక్ సర్వెంట్ మిస్‌కండక్ట్ వంటి అనేక కేసులను విచారించారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ పేర్కొన్నారు. జస్టిస్ చక్రవర్తి తూర్పు గోదావరి జిల్లా కందులపాలెం గ్రామంలో బి.పాపారాయ చౌదరి, విజయలక్ష్మీ దంపతులకు 1964లో జన్మించారని, తామరపల్లి, గంగవరంలో ప్రాథమిక, హైస్కూల్ విద్యను పూర్తి చేశారన్నారు. రాజమండ్రిలోని జీఎస్ కె ఎం లా కాలేజీ నుండి న్యాయవాద శాస్త్ర పట్టా అందుకున్నారన్నారు. 1988వ సంవత్సరంలో కాకినాడ బార్ కౌన్సిల్ సభ్యుడిగా, న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. 1994లో ఏపీ జ్యుడీషియల్ సర్వీసెస్ లో ఉత్తీర్ణులై జిల్లా మున్సిఫ్ మేజిస్ట్రేట్ గా ఎంపికయ్యారన్నారు. జస్టిస్ చక్రవర్తి జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా వివిధ బాధ్యతలకు సమర్థవంతంగా నిర్వహించారనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ పేర్కొన్నారు.

## పంద్రాగష్టు వేడుకలకు సర్వం సిద్ధం

**విజయవాడ, ఆగష్టు 14, ప్రభాతవార్త :** స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు విజయవాడలో సర్వం సిద్ధం చేసారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో శనివారం జరుగనున్న ఈవేడుకలకు రాష్ట్ర ఐటిశాఖా మంత్రి నారా లోకేష్ పాల్గొనే ఈకార్యక్రమం ఏర్పాట్లను శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబులు పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఫుల్‌డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించారు. పెరేడ్ వాహనంలో ప్రయాణించి సైనిక వందనం స్వీకరించారు. పోలీస్‌బైక్ విన్యాసాలు, పోలీస్ పెరేడ్, వందన స్వీకరణ, వివిధ ప్రభుత్వశాఖల పెరేడ్ తదితర కార్యక్రమాలను వీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవేడుకల్లో మంత్రి నారా లోకేష్ పాల్గొని జాతీయ జెండా ఎగురవేస్తారని తెలిపారు. ప్రజలు విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈవేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమీషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా కట్టుదిట్టమై బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వేడుకలకు హాజరయ్యే విద్యార్థులు, అతిథులు, ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని విజ్ఞప్తిచేసారు. ఈకార్యక్రమంలో విజయవాడ నగరపాలకసంస్థ కమీషనర్ ధ్యానచంద్ర, డిసిపిలు కె.తిరుమలేశ్వరరెడ్డి, కె.జి.వి.సరిత, జి.రామకృష్ణ, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సైనిక వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా, కమీషనర్ రాజశేఖరబాబు

## మూడురోజులపాటు శకటాల ప్రదర్శన

**విజయవాడ, ఆగష్టు 14, ప్రభాతవార్త :** స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా రాష్ట్రరాజధాని అమరావతిలో నిర్వహిస్తున్న వేడుకల్లో పాల్గొనే అలంకృత శకటాలను విజయవాడలో ప్రజల సందర్శనార్థం మూడురోజులపాటు ప్రదర్శించనున్నట్లు సమాచార పౌరసంబంధాలశాఖ ఇన్‌చార్జీ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం నుండి ఈనెల 17వతేదీ సాయంత్రం వరకు నగరంలోని మూడు ప్రాంతాల్లో ఈశకటాలను ఉంచుతామన్నారు. కనకదుర్గమ్మ అమవారి రథంసెంటర్‌కు ఎదురుగా ఉన్న కెనాల్‌రోడ్ పార్కింగ్ ప్రదేశం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స ృతివనం ఎదురుగా మహాత్మాగాంధీరోడ్, లెమన్‌ట్రీ హోటల్ వద్దనుండి రాష్ట్ర ఆర్‌డబు ్ల్యఎస్ కార్యాలయం వరకు ఉన్న ప్రాంతంలో ఈశకటాలను ఉంచుతామన్నారు. అమరావతి పెరేడ్‌లో పాల్గొనే వివిధ ప్రభుత్వశాలక ప్రగతిని, సంస్కృతిని ప్రతిబింబించే ఈశకటాలను వీక్షించటానికి నగర ప్రజలు పెద్దసంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. జనం రద్దీని దృష్టిలో ఉంచుకుని బద్రతా చర్యలతోపాటు ట్రాఫిక్ నిబంధనల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు శ్రీనివాసరావు వివరించారు.

# లక్ష ఎకరాలతో ల్యాండ్ బ్యాంక్

### పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక కార్యాచరణ

**విజయవాడ,ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించడానికి కీలక కార్యచరణను చేపడుతుంది. పరిశ్రమల కోసం రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారికి భూసమస్య తలెత్తకుండా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కోసం కనీసం లక్ష ఎకరాలతో భూ బ్యాంక్‌ను సిద్ధం చేయాలని ప్లాన్ చేసింది. భూసేకరణ కోసం ప్రణాళికలు రూపొందించిన ప్రభుత్వం.. జిల్లా కలెక్టర్లకు ప్రతిపాదనలు పంపించింది. ల్యాండ్ బ్యాంక్ ద్వారా ముందుగానే భూమిని సేకరించాలని నిర్ణయించింది. దీని వలన రాష్ట్రానికి పెట్టుబడుల్ని సులభంగా తీసుకురావొచ్చని ఈ ఆలోచన చేసింది. జిల్లాలవారీగా పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టిపెట్టింది. కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన భూసేకరణ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ముందుగానే భూముల్ని సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఏకంగా లక్ష ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసే పనిలో ఉంది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేవారికి ఈ ల్యాండ్ బ్యాంక్ సానుకూలంగా మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా దశలవారీగా అన్ని జిల్లాల్లో భూముల్ని సేకరించాలని నిర్ణయించింది. ఈ ల్యాండ్ బ్యాంక్ కోసం జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ భూమితో పాటుగా ప్రైవేట్ భూముల్ని కూడా సేకరించనున్నారు. ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న కంపెనీలకు ఏకంగా లక్షా25వేల ఎకరాల భూమి అవసరమనే అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలవారీగా చూస్తే ఏపీఐఐసీ దగ్గర 46వేలకు ఎకరాలకుపైగా భూమి అందుబాటులో ఉందని చెబుతున్నారు. ఒప్పందాలు చేసుకున్న కంపెనీలకు అవసరమైన భూమిని కేటాయించిన తర్వాత కూడా భారీగా భూమి అవసరమవుతోంది. అందుకు తగిన విధంగానే ఏపీ ప్రభుత్వం ల్యాండ్ బ్యాంక్ ద్వారా లక్ష ఎకరాల భూమిని సేకరించాలని ప్లాన్ చేసింది. జిల్లా కలెక్టర్ల ద్వారా ల్యాండ్ బ్యాంక్‌కు అవసరమైన భూమిని గుర్తించనున్నారు.. వీటిలో ఎక్కువశాతం ప్రభుత్వ భూమి ఉంటుంది.. అవసరమైన చోట ప్రైవేట్ భూముల్ని సేకరిస్తారు. కూటమి ప్రభుత్వం జిల్లాలవారీగా పరిశ్రమల్ని తీసుకొస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు డేటా సెంటర్లు, స్టీ ప్లాంట్, ఫార్మా కంపెనీలు వచ్చాయి. రాయలసీమలో సోలార్ పార్క్‌లు, డ్రోన్ సిటీలు, రక్షణ రంగానికి సంబంధించిన కంపెనీలు వంటివి ఏర్పాటవుతున్నాయి. కోస్తాలో ఫార్మా, సోలార్, సహా ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలవారీగా ప్రాధాన్యత ఇస్తూ పరిశ్రమల్ని తీసుకొస్తోంది.. అందుకు తగిన విధంగా అవసరమైన భూమిని ముందుగానే సేకరించే పనిలో ఉన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమ దగ్గర ల్యాండ్ బ్యాంక్ ద్వారా భారీగా భూములు ఉన్నాయని చెప్పి రాష్ట్రానికి పరిశ్రమల్ని ఆకర్షించేలా ప్రణాళిక సిద్ధం చేసారు. ఇప్పటి వరకు పారిశ్రామిక అవసరాలకు 22వేల ఎకరాల భూమిని సేకరించారు. ప్రస్తుతం మరికొన్ని పరిశ్రమల కోసం భూసేకరణ జరుగుతోంది. బీపీసీఎల్ కోసం 6వేల ఎకరాలు, ఎన్టీపీసీ కోసం 4వేల ఎకరాలు, జేఎస్‌డబ్ల్యూ కోసం 3వేల200 ఎకరాలు, బిఎఆర్‌సి కోసం 3,000 ఎకరాలు, ఇండోసోల్ కోసం వెయ్యి ఎకరాల భూమిని సేకరించే పనిలో ఉన్నారు. ఏపీఐఐసీ ప్రస్తుతం మరో 60వేల ఎకరాల భూమిని విడతలవారీగా సేకరించడంపై దృష్టిపెట్టగా.. ఈ ఏడాది కనీసం 20వేల ఎకరాల వరకు సేకరించాలని టార్గెట్ పెట్టుకున్నారు.

## డంపింగ్ యార్డు రహిత రాష్ట్రమే లక్ష్యం: మంత్రి నారాయణ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు14, ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా మార్చేందుకు వినూత్న విధానాలను అనుసరిస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ లతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజుకు 7వేల టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేయకపోతే టన్నుల కొద్దీ పేరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ను వదిలేసి వెళ్లిందని ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త ఉండగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఏడాది కాలంలోనే ఆ చెత్తనంతా ప్రాసెస్ చేసినట్లు వెల్లడించారు. భూగర్భంలో మరో 156 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ఉన్నట్లు అంచనా వేయగా ఆ వేస్ట్ ను కూడా అక్టోబర్ 2 నాటికి ప్రాసెస్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రాసెస్ చేసిన ఆర్‌డీఎఫ్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలిస్తామని తెలిపారు. 201419 మధ్య కాలంలో ఘన వ్యర్థాల నిర్వహణకు అభివృద్ధి చెందిన దేశాలలో అధ్యయనం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 10 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్లాంట్ల ద్వారా వేస్ట్ ను బర్న్ చేయడంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుందని.. కానీ గత ప్రభుత్వం అవగాహన లేక 8 ప్లాంట్లను రద్దు చేసినట్లు మండిపడ్డారు. చైనాలో ఇటువంటి ప్లాంట్లు 1,100 ఉండగా జపాన్ లో వెయ్యి., సింగపూర్ లో 7 ఉన్నాయన్నారు. కానీ గత ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో వ్యవహరించిందన్నారు. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, పెద్దాపురం కలిపి ఆరు ˆవేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పెద్దాపురంలో ప్లాంట్ నిర్మాణం అడ్వాన్స్డ్ స్టేజీలో ఉండగా, మరో సంవత్సరం 3 నెలల కాలంలో పూర్తవుతుందన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే 7వేల టన్నుల ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసేందుకు 107 ప్రాసెసింగ్ ప్లాంట్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. గత నెలలో ముఖ్యమంత్రి చేతులమీదుగా 8 ప్లాంట్లను ప్రారంభించుకోగా సెప్టెంబర్ నెలాఖరుకల్లా మిగిలిన ప్లాంట్లను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఈపర్యటనలో కమిషనర్ రాహుల్ మీనా, అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, ఈఈ మాధవి, ఇతర నగరపాలక అధికారులు, సిబ్బంది ఉన్నారు.



## రెండేళ్ల బాలుడు అదృశ్యంతో రాత్రంతా ఉత్కంఠ



**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 14 ప్రభాతవార్త:** అదినడిరాత్రి.. సమయం 10:30 గంటలు. శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలంలోని రావాడ గ్రామంలో ఒక మూలన తల్లిదండ్రుల గుండెలు పగిలే రోదన! ఆడుకుంటూ వెళ్లిన రెండేళ్ల నాలుగు నెలల పసికందు 'మోహిత్' చీకట్లో మాయమయ్యాడు. చుట్టూ దట్టమైన తోటలు, ప్రమాదకరమైన పొదలు, భయంకరమైన నిర్మానుష్య ప్రాంతాలు! ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తల్లిదండ్రులు రోదిస్తున్న క్షణాల్లో... శ్రీకాకుళం జిల్లా పోలీస్ యంత్రాంగం దేవుడిలా కదిలింది! చిన్నారి అదృశ్యం వార్త వినగానే జిల్లా ఎస్పీ కె వి మహేశ్వర రెడ్డి తక్షణమే రంగంలోకి దిగారు. ప్రతి నిమిషం అమూల్యమైనదే.. బాలుడిని క్షేమంగా తీసుకొచ్చే వరకు నిద్రపోయేదే లేదంటూ అధికారులను పరుగులు పెట్టించారు. ఎస్పీ ఆదేశాలతో జెఆర్ పురం సీఐ ఎం.అవతారం పర్యవేక్షణలో జె ఆర్ పురం, లావేరు, ఎచ్చెర్ల, జి సిగడాం, పొందూరు ఎస్ఐలు వి.సత్యనారాయణ, వి సందీప్ కుమార్, జి,లక్ష్మణరావు, అప్పలసూరి, జి.రాజేష్, చిరంజీవిలతో పాటు ఏకంగా 15ప్రత్యేక బృందాలు యుద్ధ ప్రాతిపదికన రావాడ గ్రామానికి చేరుకున్నాయి. రాత్రి వేళ చీకటిని సైతం చీల్చుకుంటూ నైట్ విజన్ డ్రోన్లు తోటలపై గాల్లోకి లేచాయి. మరోవైపు డాగ్ స్క్వాడ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, క్లూస్ టీమ్స్ తోటలు, పొదలు, గుబురు ప్రాంతాలను అంగుళం అంగుళం జల్లెడ పట్టాయి. కష్టమొస్తే కంటికి రెప్పలా కాపాడే కర్మవీరులు మేము అని శ్రీకాకుళం జిల్లా పోలీసులు నిరూపించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వీఆర్వో





**పుల్లల చెరువు, ఆగస్టు 14 ప్రభాతవార్త :** పుల్లలచెరువు మండలంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం నిర్వహించిన దాడిలో గంగవరం గ్రామ వీఆర్వో ఎస్‌కె మహబూబ్ బాషా లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం కలకలం రేపింది. రైతు నుంచి రూ.20వేలు లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు వీఆర్వోను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ నెల్లూరు డీఎస్పీ రామకృష్ణుడు తెలిపిన వివరాల ప్రకారం గంగవరం గ్రామానికి చెందిన రైతు ద్రోణాదుల వీరాంజనేయులు తన పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకునేందుకు వీఆర్వో మహబాషాను సంప్రదించాడు. ఈ పనికి రూ.50 వేల లంచం ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేసినట్లు తెలిపారు. ముందుగా రూ.30 వేలు చెల్లించాలని, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయిన అనంతరం మిగిలిన రూ.20 వేలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. వీఆర్వో సూచనల మేరకు రైతు గత జూన్ 6న ఫోన్‌పే ద్వారా రూ.30 వేలు చెల్లించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అయితే నగదు తీసుకున్నప్పటికీ రైతు పొలానికి సంబంధించిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయకపోవడంతో బాధితుడు పలుమార్లు వీఆర్వోను సంప్రదించినట్లు చెప్పారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో సహనం కోల్పోయిన రైతు చివరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

## న్యాయవాదిపై దాడికి పాల్పడిన సీఐపై చర్యలు తీసుకోవాలి..

### పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయవాదుల ఆందోళన..

**అనంతపురం క్రైమ్ ఆగస్టు 14 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా కోర్టులో జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న గౌతమ్ రాజు పై అనంతపురం రూరల్ సీఐ శ్రీకాంత్ దురుసుగా ప్రవర్తించడంతోపాటు న్యాయవాదిపై చేయి చేసుకొని దాడికి పాల్పడ్డారని బాధితుడు వాపోయాడు. న్యాయవాది పై దాడికి నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులంతా ఆందోళనకు దిగారు. జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట పెద్ద సంఖ్యలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి రోడ్డుపై బైఠాయించారు. న్యాయం కోసం వాదించే న్యాయవాదులకే రక్షణ లేనప్పుడు ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని.. ప్రశ్నించారు... న్యాయవాదుల కథనం మేరకు గౌతంరాజు విధులు ముగించుకుని కళ్యాణదుర్గం రోడ్డులోని సెయింట్ ఆన్స్ పాఠశాల సమీపంలోని తన నివాసానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో నరిగమ్మ గుడి సమీపంలో సీఐ శ్రీకాంత్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపడుతున్నారు. తన బైక్ పై అటు వైపు వెళ్తున్న న్యాయవాది గౌతమ్ రాజు ను కానిస్టేబుల్ నరేష్ ఆపి బైక్ ను రోడ్డు పక్కన ఆపమన్నాడు. తాను ఒక న్యాయవాది అని, తన తండ్రికి మందులు తీసుకునేందుకు వెళ్తున్నానని చెప్పారు. అంతలోనే సీఐ శ్రీకాంత్ నువ్వు లాయర్ అయితే నాకేంటి..? అంటూ న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు ఆకరణంగా చేయి చేసుకున్నారని, తనపై పిడి గుద్దులతో దాడికి పాల్పడ్డారని బాధితుడితో పాటు పలువురు న్యాయవాదులు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న బార్ అసోసియేషన్ సభ్యులు సాటి న్యాయవాదికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ముట్టడించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను కొట్టే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని, నేరం చేస్తే శిక్షించడానికి న్యాయస్థానాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం లాఠీలు ఇచ్చింది శాంతి భద్రతలు కాపాడడానికి, అంతే కాని చట్టాన్ని తన చేతులో తీసుకొని బాధ్యత కలిగిన న్యాయవాదిపై దాడికి దిగడం హేయమైన చర్య అంటూ ఖండించారు. బాధిత న్యాయవాదికి దాడికి పాల్పడిన సీఐ బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. జరిగిన ఘటనపై సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేసారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ చంద్రశేఖర్ వెంటనే అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. తనకు జరిగిన అన్యాయాన్ని బాధితుడు గౌతమ్ రాజు డీఎస్పీ ఎదుట వాపోయారు. ఆయనకు మద్దతుగా న్యాయవాదులు ఐక్యంగా కలిసి పరిస్థితిని డీఎస్పీకి వివరించారు. జరిగిన సంఘటనపై సమగ్రంగా విచారించి బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తామని డిఎస్పి హామీ ఇచ్చారు. అలాగే అందుకు బాధ్యులైన సీఐపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



రోడ్డుపై బైఠాయించిన న్యాయవాదులు

## భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు

**తిరుపతి, ఆగస్టు 14ప్రభాతవార్తప్రతినిధి:** తీర్థయాత్రికుల కోసం ఐఆర్‌సిటిసి ఆధ్వర్యంలో"భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు" హైదరాబాద్ నుండి 3 ప్రత్యేక ప్యాకేజీలను నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సిటిసి జాయింట్ జనరల్ మేనేజర్ జి. సోమశేఖర్ నాయుడు తిరుపతిలో తెలిపారు. సప్తజ్యోతిర్లింగ దర్శన యాత్రలో సెప్టెంబర్ 23-అక్టోబర్ 3, నవంబర్ 10-20తేదీలలో ఉజ్జయిని, ద్వారక, సోమనాథ్, పూణే, నాసిక్, ఔరంగాబాద్ తదితర క్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. స్లీపర్ క్లాస్ ఛార్జీ 18వేలు, మూడవ ఏసి ఛార్జీ 27,400 రూపాయలు. 2ఏసి35,500గా నిర్ణయించారు. అరుణాచలంతో దివ్య దక్షి ణ యాత్రలో అక్టోబర్ 6-14. అరుణాచలం, చిదంబరం, శ్రీరంగం, తంజావూరు, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి దర్శనం ఉంటుంది. ఇందుకు స్లీపర్ క్లాస్ ఛార్జీ 15,800 రూపాయలు, 3ఎసి 23,200, 2ఎసి 29,600గా నిర్ణయించారు. అయోధ్య-కాశీ-బైద్యనాథ్ ధామ్ యాత్రలో అక్టోబర్ 24-నవంబర్ పూరి, కోణార్క్, వారణాసి, అయోధ్య, ప్రయాగ్రాజ్, బైద్యనాథ్ ధామ్ దర్శనంకోసం స్లీపర్ క్లాస్ ఛార్జి 17వేల రూపాయలు , 3ఎసి ఛార్జీ 26,400 రూపాయలు, 2ఎసి ఛార్జీ 34,400 రూపాయలుగా నిర్ణయించారు. ప్రతి రైలులో 705 మంది ప్రయాణికులు ఉంటారు. రైలు, బస్సు, హోటల్, మూడు పూటల భోజనం, తాగునీరు, భద్రత, ప్రయాణ బీమా తదితర సౌకర్యాలు ప్యాకేజీలో ఉంటాయి. అదేవిధంగా అండమాన్, ఒడిశా, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తర భారతదేశం, కాశ్మీర్, మేఘాలయ-అస్సాం, కేరళ ప్రాంతాలకు విమాన పర్యటన ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు స్వల్పకాలిక రైలు టూర్ ప్యాకేజీలు కూడా నిర్వహిస్తున్నారు. మరిన్ని వివరాల కోసం 9281495853, 8287932313, 9281030772, 9281030785, 9281030773 నంబర్లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఈ

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల కట్టడికి చర్యలు

### ధర్మకర్తల మండలిసమావేశంలో నిర్ణయం

**శ్రీకాళహస్తి,ఆగస్టు14 ప్రభాతవార్త** :శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన పతి భక్తుడు సుదర్శనం చేసుకునే రీతిలో ఏర్పాట్లు చేస్తున్నామని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మీడియాకు వివరించారు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సమావేశం చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిధిగా హాజరైన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పలు అంశాలకు సంబంధించి ర్చించారు. అజెండాలో50అంశాలను పొందుపరచారు. సుమారుమూడు గంటల పాటు జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంకుముందు తాను స్వామి అమ్మవార్ల దర్శనానికి వెళ్ళానని అక్కడ ఓ భక్తుడు'ఈ విఐపిలతో గంటల తరబడినిరీక్షించాల్సి వస్తుందని' వ్యాఖ్యానించాడని ఈ సమస్య భవిష్యత్తులో రాకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**విపిఐలకు ప్రత్యేక శ్లాట్‌లు:** కాళహస్తీ శ్వరాలయం లో తిరుమల తరహాలో విఐపిలకు ప్రత్యేక శ్లాట్స్‌ను ఏర్పాటుకు బోర్డు తీర్మానించిందన్నారు. ఈనేపథ్యంలో మధ్యాహ్నం 1 గంట లోపల రెండు, తరువాత రెండు శ్లాట్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విఐపిలు ఆ సమయంలోనే రావాల్సి ఉంటుందని దానికి విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించుటకు అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. ఇక తరచు వస్తున్న 'దళారుల దందా'కు అవకాశం లేకుండా చర్యలు తీసుకొనుటకు బోర్డుల చర్చించినట్లు తెలిపారు.

**దాతలకు పెద్దపీట:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో చేపడుతున్న కాటేజీల స్కీంకు సంబంధించి ముందుకు వచ్చే దాతలకు పెద్ద పీట వేస్తున్నట్లు వివరించారు. వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.5లక్షల నుంచి కోటి వరకు దాతలుగా గుర్తించరు సేవలకు ముందుకు వచ్చే దాతలను ప్రోత్సహించుటకు సమావేశంలో చర్చించినట్లు వివరించారు. సోమవారం నుంచి విఐపిలకు శ్లాట్స్, దాతలకు ఆహ్వానం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

**ట్రాఫిక్ సమస్యకు చెక్:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు సన్నిధివీధిలో ట్రాఫిక్ చిత్తడిలో సతమతమౌతున్నారని ఈ సమస్య పరిష్కారానికి చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్ చక్కటి ప్రతిపాదన చేసారన్నారు. గొడ్డెరును కాపాడుకుంటూ ట్రాపిక్‌ను తరలించుటకు ప్రతిపాదించారని అయితే దీనిని మాస్టర్ ప్లాన్‌లో అంతర్భాంగా అమలు చేయుటకు నిర్ణయించినట్లు తెలిపారు. మీడియా సమావేశంలో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డితో పాటు చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఓ బికె వెంకటేశులు, ఆలయ ప్రాధానర్చకులు సంబంధం గురుకుల్, ఇఇ శ్రీనివాసులు రాజు, డిఇఇ శ్రీనివాసులురెడ్డి బోర్డు సభ్యులు పాల్గొన్నారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

## 500 నకిలీ నోట్ల కలకలం

### - జెరాక్స్ నకిలీ నోట్లతో మోసం

### - లక్ష రూపాయలు విలువ చేసే నోట్లు లభ్యం

**అగళి, ఆగస్టు 14 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి జిల్లా అగళి మండలంలో శుక్రవారం 500 నకిలీ నోట్ల కలకలం సృష్టించింది. మండల పరిధిలోని నందరాజనపల్లిలో నారాయణ నడుపుతున్న కొట్టుకు వెళ్లి రూ.10 వ్యాపారం చేసి నిఖిలీ 500 నోటును దుకాణా దారుడికి ఇవ్వగా ఇది అసలు నోటు కాదు, నఖిలీ 500 నోటులాగ ఉందని దుకాణాదారుడు నారాయణ అనుమానించగా వెంటనే గుల్షా అక్కడి నుంచి పలాయనం చిత్తగించాడు. ఎట్టకేలకు గ్రామస్తులు గుల్షా, అబ్జల్ ఇద్దరిని పట్టుకుని చితకబాది పోలీసులకు సమాచారం అందించగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అగళి స్టేషన్‌లో కాక ఈ నఖిలీ నోట్ల చలామణి దారులను మడకశిర సిఐ రాజ్‌కుమార్ వద్దకు అగళి ఎస్ఐ రంగడు యాదవ్ తీసుకెళ్లి విచారిస్తున్నారు. ఇంకా ఏదైనా నఖిలీ నోట్లముఠా ఉందా, ఎక్కడెక్కడ ఛలామణి చేశారు. ఇంకా నఖిలీ నోట్ల చలామణి దారులు ఉన్నారా అన్న కోణంలో ఈ నఖిలీ నోట్ల చలామణి దారులు కర్ణాటక రాష్ట్రం గౌరి బిదనూరుకు చెందిన వారు అక్కడికి కూడా అగళిపోలీసులను పంపి విచారణ మొదలు పెట్టారు. ఎన్ని రోజుల నుంచి ఛలామణి చేస్తున్నారు. ఎంత చలామణి చేశారు, ఎంత మంది ఉన్నారు అనే కోణంలో విచారణ జరుగుతూ ఉంది, ఛలామణి దారుల వద్ద దాదాపు రూ.లక్ష విలువ చేసే 500 నోట్లు నఖిలీవి ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా నఖిలీ నోట్ల చలామణి దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.





నఖిలీ నోట్లు ఛలామణి దారులు మార్చాలని చూసిన తండ్రి నఖిలీ నోట్లను మార్చాలని చూసిన గుల్షా

## స్వాతంత్ర్య స్ఫూర్తితో స్వర్ణాంధ్ర సాధనకు అడుగులు వేద్దాం..

**విజయవాడ ఆగస్టు 14,ప్రభాతవార్తప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశానికి స్వేచ్ఛా వాయువులు అందించేందుకు తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహనీయుల త్యాగాలను ప్రతి భారతీయుడు స్మరించుకోవాల్సిన పవిత్ర సందర్భం స్వాతంత్ర్య దినోత్సవమని పేర్కొన్నారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాలు, బలిదానాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ. వారి త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారు కలలుగన్న సుసంపన్నమైన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరం భాగస్వాములు కావాలి అని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచంలో బలమైన ఆర్థిక, సాంకేతిక శక్తిగా ఎదుగుతోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమం, సంపద సృష్టి లక్ష్యాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తూ ˆస్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్యసాధన దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

15-08pg10exHMNWJQEAB:15-08pg10exHMNWJQEAB.qxd 8/15/2026 1:01 AM Page 1



# నేటి నుండి శ్రీలంకతో కీలకపోరు





**న్యూఢిల్లీ:** శ్రీలంక గడ్డపై ఈ నెల 15 నుండి టెస్టు సిరీస్ ఆడేందుకు భారత జట్టు సిద్ధమైంది. అయితే ఈసారి టీమిండియాకు ఇది కేవలం ఒక ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కాదు, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ (డబ్ల్యూటిసి) ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్‌కు శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్ అత్యంత కీలకం కానుంది. ఈ నెల 15 నుంచి గాలే వేదికగా ప్రారంభమయ్యే ఈసిరీస్‌లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు తప్పక మెరుగైన ఫలితం సాధించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 5వస్థానంలో ఉన్న టీమిండియాకు ఇక్కడ ప్రతి మ్యాచ్ గెలవడం అత్యంత కీలకంగా మారింది. దక్షిణాఫ్రికాతో జరిగిన గత సిరీస్‌లో 2-0 తేడాతో ఓడిపోవడంతో భారత్ పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం ఫైనల్ బెర్త్ రేసులో ముందుండాలంటే శ్రీలంకను వారి సొంత గడ్డపై 2-0తో క్లీన్ స్వీప్ చేయడం ఒక్కటే మార్గం. ఈ సిరీస్ ముగిసిన వెంటనే భారత్ సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో 2 టెస్టులు, ఆతర్వాత ఆస్ట్రేలియాతో 5టెస్టుల సుదీర్ఘ బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ ఆడాల్సి ఉంది. అందుకే లంకపై విజయం సాధించి ఆత్మవిశ్వాసాన్ని నిలుపుకోవడం టీమిండియాకు ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ఇక శ్రీలంక మ్యాచ్‌లో టీమిండియా వ్యూహాత్మకంగా ముందుకెళుతోంది. టీమిండియాలో కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా బరిలోకి దిగనుండగా, మూడో స్పిన్నర్ కోసం మానవ్ సుతార్, సరాన్ష్ జైన్ మధ్య పోటీ నెలకొంది. ఆఫ్ స్పిన్‌కు ప్రాధాన్యత ఇస్తే సారాన్ష్ జైన్ బరిలోకి దిగుతాడు. పేసర్లుగా మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ బరిలోకి దిగనున్నారు. అయితే ప్రసిధ్ కృష్ణకు గుర్నూర్ బ్రార్‌తో పోటీనెలకొంది. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు.

## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ రేస్‌కు డూ ఆర్ డై

గాయంతో దూరమైన సాయి సుదర్శన్ స్థానంలో దేవదత్ పడిక్కల్ ఆడనుండగా, ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ బరిలోకి దిగనున్నారు. అలాగే నాలుగు, ఐదు స్థానాల్లో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ ఆడనున్నారు. అయితే ఆరో స్థానంలో ఎవర్ని ఆడిస్తారు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ స్థానం కోసం సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. స్పిన్‌ను సమర్థవంతంగా ఆడే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం ఇవ్వాలని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. సర్ఫ రాజ్ ఖాన్‌వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా 2008లో 2-1తో సిరీస్ గెలిచిన శ్రీలంక, ఆతర్వాత గత 18 యేళ్లుగా భారత్‌పై ఒక్క టెస్టు సిరీస్ కూడా గెలవలేకపోయింది. ఈ సారి ఎలాగైనా ఆ సెంటిమెంట్‌ను బ్రేక్ చేయాలని చూస్తోంది. శ్రీలంక మ్యాచ్‌ను సమం చేసినా లేదా గెలిచినా టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ కల తీవ్రంగా దెబ్బతింటుంది.



## డ్యూరాండ్ కప్.. క్వార్టర్ ఫైనల్స్‌కు జంషెడ్‌పూర్

**న్యూఢిల్లీ:** డ్యూరాండ్ కప్ 2026 గ్రూప్ సి చివరి మ్యాచ్‌లో, జంషెడ్‌పూర్ ఎఫ్‌సి ద్వితీయార్థంలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఎఫ్‌టిపై 6-0 తేడాతో ఘన విజయం నమోదు చేసింది. నాలుగో నిమిషంలో రెడ్ మైనర్స్ తరఫున రేనియర్ ఫెర్నాండెజ్ తొలి గోల్ చేయగా, విరామం తర్వాత 17 యేళ్ల లామ్‌సాంగ్‌జువాలా రంగంలోకి దిగాడు. ఈ యువ ఆటగాడు రెండుసార్లు గోల్ చేయగా, అమన్ సి.కె. జంషెడ్‌పూర్ తరఫున నాలుగో గోల్ చేశాడు. ఆ తర్వాత 80వ నిమిషంలో లామ్‌సాంగ్‌జువాలా తన హ్యాట్రిక్‌ను పూర్తి చేయగా, రాయన్ సి.ఆరో గోల్‌తో ఈ ఘన విజయాన్ని ఖాయం చేశాడు. దీంతో జంషెడ్‌పూర్ క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించింది. అలాగే షిల్లాంగ్‌లో జరిగిన గ్రూప్‌ని చివరి మ్యాచ్‌లో, షిల్లాంగ్ లాజోంగ్, లాంగ్స్‌నింగ్ జట్లు 3-3తో ఆసక్తికరమైన డ్రాను నమోదు చేశాయి. ఈ ఫలితంతో, గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలవడానికి అవసరమైన పాయింట్‌ను లాజోంగ్ దక్కించుకుంది. తొలి అర్ధభాగంలో లాజోంగ్ ఆధిపత్యం చెలాయించి, బ్రెజిలియన్ ఫార్వర్డ్ జోవో మొరైస్ రెండు గోల్స్ చేయడంతో 2-0 ఆధిక్యంతో వెళ్ళింది. లాంగ్స్‌నింగ్ బలంగా స్పందించి, కిర్మెన్స్‌ఖెమ్ ముఖిమ్, వాడజీద్ కైన్సాయ్ గోల్స్ చేయడంతో 63వ నిమిషానికి స్కోరు 2-2తో సమమైంది. 82వ నిమిషంలో ఎవర్‌బ్రైట్‌సన్ సానా ద్వారా లాజోంగ్ మళ్లీ ఆధిక్యాన్ని సాధించింది. అయితే స్టాపేజ్ టైమ్‌లో సయ్యద్ అహ్మద్ గోల్ చేసి స్కోరును 3-3తో సమం చేయడంతో డ్రాను ఖాయం చేసుకుంది.

## మహిళల ఆసియా కప్, ఆసియా క్రీడల నుంచి..

## జెమిమా రోడ్రిగ్స్ నిష్క్రమణ

### ఆమె స్థానంలో ప్రతీకా రావల్





**న్యూఢిల్లీ:** భారత బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ రాబోయే మహిళల ఆసియా కప్, మహిళల ఆసియా క్రీడల టోర్నమెంట్లకు దూరమైందని బిసిసిఐ తెలిపింది. ఆగస్టు 3వ తేదీన ఇంగ్లాండ్‌లో జరిగిన ది హండ్రెడ్ టోర్నమెంట్‌లో ఆడుతుండగా జెమీమా రోడ్రిగ్స్ కుడికాలి తొడ కండరానికి గాయమైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బిసిసిఐ వైద్య బృందం ఆమెను క్లినికల్‌గా పరీక్షించగా, అది తీవ్రమైన కండర చీలిక అని నిర్ధారణ అయిందని తెలిపింది. ఫలితంగా, ఆమె యుఎఇలో జరగనున్న ఎసిసి మహిళల ఆసియా కప్ మరియు జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల నుంచి తప్పుకుందని స్పష్టం చేసింది. సదరన్ బ్రేవ్ ఫ్రాంచైజీ తరఫున ఇంగ్లాండ్‌లో ఆడుతున్నప్పుడు 25 ఏళ్ల క్రీడాకారిణి కండరాల గాయానికి గురయ్యిందని నివేదికలు పేర్కొన్నాయి. దీంతో ఆసియా కప్ కోసం జెమీమా స్థానంలో ప్రతీకా రావల్‌ను బిసిసిఐ మహిళల సెలక్షన్ కమిటీ జట్టులోకి తీసుకువచ్చింది. కాగా భారత్ తన ఆసియా కప్ 2026 ప్రచారాన్ని ఈనెల 30న థాయిలాండ్‌తో ప్రారంభించనుంది. ఇందుకుగాను ఆసియా కప్ టీమిండియాలో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, భారతీ ఫుల్‌మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), జి. కమలిని (వికెట్‌కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, ప్రత్ని గౌడ్ ఉన్నారు.



## షెల్టన్‌కు కెనడియన్ ఓపెన్ టైటిల్

**మాంట్రియల్:** ఫైనల్‌లో బ్రాండన్ నకాషిమాను ఓడించడం ద్వారా బెన్ షెల్టన్ కెనడియన్ ఓపెన్ టైటిల్‌ను సాధించాడు. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో నకాషిమాను 6-3, 7-6 (4) తేడాతో ఓటమి పాల్చేసి తన తోటి ఎడమచేతి వాటం ఆటగాడైన రఫెల్ నాదల్ తర్వాత వరుసగా రెండు కెనడియన్ ఓపెన్ టైటిళ్లను గెలుచుకున్న మొదటి వ్యక్తిగా బెన్ షెల్టన్ నిలిచాడు. మొదటి సెట్‌లో 3-3 స్కోరు వద్ద, షెల్టన్ ఒక మెరుపు రిటర్న్ విన్నర్‌తో నకాషిమాపై తన మొదటి సర్వ్ బ్రేక్‌ను సాధించిన తర్వాత, ఆ 23 ఏళ్ల ఆటగాడిని ఆపడం ఎవరికీ సాధ్యపడలేదు.
తన ఆధిపత్య సర్వింగ్ ప్రదర్శనతో షెల్టన్ ఆట గమనాన్ని శాసించాడు. మరియు తన ఫోర్‌హ్యాండ్ షాట్లతో నిలకడగా పైచేయి సాధించాడు. ఈ అమెరికన్ ఆటగాడు మ్యాచ్ పొడవునా ఒక్క బ్రేక్ పాయింట్‌ను కూడా ఎదుర్కోలేదు. అంతేకాకుండా తాను సంపాదించిన నాలుగు బ్రేక్ పాయింట్లలో రెండింటిని సద్వినియోగం చేసుకున్నాడు. అతను బిగ్ త్రీలోని మరో సభ్యుడైన నోవాక్ జొకోవిచ్‌తో సమానంగా నిలిచి, 10 సంవత్సరాల క్రితం ఆ సెర్బియన్ తర్వాత ఒక్క సెట్ కూడా కోల్పోకుండా టోర్నమెంట్ గెలిచిన మొదటి వ్యక్తిగా నిలిచాడు.
మాంట్రియల్‌లో తోటి అమెరికన్ నకాషిమాను ఓడించడం ద్వారా, వారిద్దరి మధ్య జరుగుతున్న ఏటీపీ హెడ్2హెడ్ సిరీస్‌లో షెల్టన్ తన ఆధిక్యాన్ని 6-0కి మెరుగుపరుచుకున్నాడు. ఈ విజయంతో, ఆండీ ముర్రే (2009-10), నోవాక్ జొకోవిచ్ (2011-12) మరియు నాదల్ (2018-19) తర్వాత కెనడా టైటిల్‌ను విజయవంతంగా కాపాడుకున్న నాల్గవ వ్యక్తిగా షెల్టన్ ఈ శతాబ్దంలో నిలిచాడు.

## 153 రన్స్ భారీ ఆధిక్యంలో బంగ్లాదేశ్

### 198 పరుగులకు ఆస్ట్రేలియా ఆలౌట్



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ పట్టు బిగించింది. తంజీద్ హాసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో (101) సెంచరీతో చెలరేగడంతో రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 110 ఓవర్లలో 6 వికెట్లకు 351 పరుగులు చేసి 153 పరుగుల ఆధిక్యంలో ఉంది. నజ్ముల్ హొస్సేన్ షాంటో(126 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 84) తృటిలో శతకం చేజార్చుకోగా, ముష్ఫికర్ రహీమ్(55 బంతుల్లో 5 ఫోర్లతో 36), మెహ్‌దీ హసన్ మీరాజ్(73 బంతుల్లో 3 ఫోర్లతో 32 బ్యాటింగ్) పర్వాలేదనిపించారు. హసన్ మహముద్(13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(2/66), జోష్ హేజిల్ వుడ్(2/66) రెండేసి వికెట్లు తీయగా, ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్ చెరో వికెట్ పడగొట్టారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ 153 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు ఆటలో మరో 50 పరుగుల ఆధిక్యం సాధించి..రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్‌ను తర్వగా ఆలౌట్ చేస్తే చారిత్రాత్మక విజయం సొంతమవుతుంది. అంతకుముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా, టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హొస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.

# బిఎస్ఎన్ఎల్ నష్టం రూ.1,280 కోట్లు




**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్‌కు తొలి త్రైమాసికంలో రూ.1,280 కోట్ల నికర నష్టం నమోదైంది. గత యేడాది ఇదే కాలంలో నమోదైన రూ.1,007 కోట్ల నష్టంతో పోలిస్తే నష్టం మరింత పెరిగింది. ఆదాయంతో పోలిస్తే ఖర్చులు అధికంగా పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.1,419 కోట్ల నష్టంతో పోలిస్తే తాజా త్రైమాసికంలో నష్టం తగ్గింది. భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్‌ను బీఎస్ఎన్ఎల్‌లో విలీనం చేసిన నేపథ్యంలో ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక గణాంకాలను సంస్థ పునఃప్రకటించింది. బిబిఎన్ఎల్‌ను మినహాయిస్తే మార్చి త్రైమాసికంలో బిఎస్ఎన్ఎల్ నికర నష్టం రూ.1,269 కోట్లుగా ఉంది. బిఎస్ఎన్ఎల్ మొత్తం వ్యయాలు యేడాది ప్రాతిపదికన 5.5 శాతం పెరిగి రూ.7,242.5 కోట్లకు చేరాయి. ఉద్యోగుల వ్యయం 1.8 శాతం పెరిగి రూ.1,974.5 కోట్లకు చేరుకోగా, నెట్‌వర్క్ వ్యయాలు ఏకంగా 28 శాతం పెరిగి రూ.1,761 కోట్లకు చేరాయి. తరుగుదల, అమోర్టైజేషన్ వ్యయాలు 9.6 శాతం పెరిగి రూ.2,394.5 కోట్లకు చేరాయి. మరోవైపు కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 4.2 శాతం, త్రైమాసిక ప్రాతిపదికన 2 శాతం పెరిగి రూ.5,306 కోట్లకు చేరింది. కన్స్యూమర్ మొబిలిటీ విభాగం ఆదాయం ఏడాది ప్రాతిపదికన 12 శాతం పెరిగి రూ.2,282 కోట్లకు చేరినా, గత త్రైమాసికంతో పోలిస్తే 7.5 శాతం తగ్గింది. ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్ ఆదాయం 12 శాతం పెరిగి రూ.1,736 కోట్లకు చేరింది. కన్స్యూమర్ ఫిక్స్‌డ్ యాక్సెస్ విభాగం ఆదాయం వార్షికంగా 14.5 శాతం తగ్గి రూ.1,290 కోట్లకు చేరింది.
అయితే మార్చి త్రైమాసికంతో పోలిస్తే ఈ విభాగం ఆదాయం 29.5 శాతం పెరిగింది. దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ నెట్‌వర్క్ విస్తరణను బిఎస్ఎన్ఎల్ వేగవంతం చేస్తున్న సమయంలో ఈ ఫలితాలు వెలువడ్డాయి. ఢిల్లీలో 5జీ సేవల ప్రారంభానికి కూడా సంస్థ చర్యలు చేపట్టింది. బీఎస్ఎన్ఎల్ మొత్తం మొబైల్ చందాదారుల సంఖ్య సుమారు 9.3 కోట్లుగా ఉంది.

# భారత స్టాక్ మార్కెట్లకు బ్రేక్

## రెండు వారాల లాభాల పరంపరకు తెర




**ముంబయి, ఆగస్టు 14:** భారత స్టాక్ మార్కెట్ బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 వరుసగా రెండు వారాల పాటు నమోదైన లాభాలకు బ్రేక్ వేశాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో ఇన్వెస్టర్లలో అప్రమత్తత పెరగడం, అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో ఈ వారం మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ 50లు ఈ వారం చెరో 0.6 శాతం క్షీణించాయి. శుక్రవారం నిఫ్టీ 50 29.85 పాయింట్లు తగ్గి 24,366 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 70.71 పాయింట్లు నష్టపోయి 78,009.25 వద్ద స్థిరపడింది. విస్తృత మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీలు చెరో అర శాతం మేర పడిపోయాయి.రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్స్, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ ఆటో, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్స్ సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మీడియా సూచీ మాత్రం లాభాల్లో ట్రేడైంది. అంతర్జాతీయ మార్కెట్లుఅంతర్జాతీయ మార్కెట్లు మాత్రం లాభాల్లో కొనసాగాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు గురువారం రాత్రి టెక్నాలజీ, కమ్యూనికేషన్ సర్వీసెస్ రంగాల ఆధారంగా పుంజుకున్నాయి. ఎస్అండ్‌పీ 500 రికార్డు స్థాయి ముగింపును నమోదు చేసింది. శుక్రవారం ఆసియా మార్కెట్లలో ఎక్కువ భాగం లాభాల్లో ఉన్నాయి. జపాన్, దక్షిణ కొరియా మార్కెట్లు ముందంజలో నిలిచాయి. నిక్కీ 225 1.4 శాతానికి పైగా పెరగగా, టాపిక్స్ 0.8 శాతం లాభపడింది. దక్షిణ కొరియా కోస్పీ 1.4 శాతం ఎగబాకింది. అయితే చిన్న కంపెనీల సూచీ కోస్‌డాక్ 1.5 శాతానికి పైగా పడిపోయింది. ఆస్ట్రేలియాకు చెందిన ఎస్అండ్‌పీ/ఏఎస్ఎక్స్ 200 సూచీ 0.6శాతం క్షీణించింది.క్యూ1 ఫలితాలు, ముడిచమురు ధరలపై దృష్టిదేశీయ మార్కెట్ల తదుపరి కదలికకు కొనసాగుతున్న ఆర్థిక ఫలితాల సీజన్, సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్లుఅమ్మకాలు, ముడిచమురు ధరల కదలికలు కీలకం కానున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల ధోరణి, వివిధ రంగాలకు సంబంధించిన పరిణామా లను కూడా ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించనున్నారు.తాజా సమాచారం ప్రకారం బ్రెంట్ క్రూడ్ ధర స్వల్పంగా పెరిగి బ్యారెల్‌కు 87.20 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా డాలరుతో రూపాయి మారకం విలువలు 95.43గా నిలిచాయి. బంగారం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ ఒక్కింటికి 4355 డాలర్లుగా కొనసాగింది.

## టాటా సన్స్ చైర్మన్ రేసులో ముగ్గురి పేర్లు



**ముంబయి, ఆగస్టు 14:** టాటాసన్స్‌లో కీలక నాయకత్వ మార్పునకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుత చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తన ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరితో ముగిసిన తర్వాత తిరిగి నియమించుకోవాలని తాను కోరుకోవడం లేదని స్పష్టం చేసిన నేపథ్యంలో, తదుపరి చైర్మన్ ఎంపిక ప్రక్రియ ప్రారంభ దశలోకి ప్రవేశించింది.అయితే, ఎంపిక కమిటీ తుది కూర్పు, తదుపరి చైర్మన్‌గా పరిగణనలోకి వచ్చే పేర్లపై ఇంకా అధికారిక నిర్ణయం వెలువడలేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం, వర్గాల ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ప్రక్రియ ప్రారంభ దశలోనే ఉంది.సర్ దోరాబ్జీ టాటా ట్రస్ట్ కూర్పును పరిగణనలోకి తీసుకుంటే ఎంపిక ప్యానెల్‌లో నోయెల్ టాటా, దారియస్ ఖంబాటా, భాస్కర్ భట్ ఉండే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.ఇక చంద్రశేఖరన్ తర్వాత టాటా సన్స్ చైర్మన్ పదవికి అంతర్గత అభ్యర్థులుగా పలువురు సీనియర్ టాటా గ్రూప్ అధికారులు చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రాథమికంగా జెఎల్ఆర్ సిఇఒ పిబి బాలాజీ, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ శైలేష్ చంద్ర, టాటా స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ టివి నరేంద్రన్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇవి ప్రస్తుతం వర్గాల స్థాయిలో వినిపిస్తున్న ప్రాథమిక పేర్లు మాత్రమేనని, తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థుల జాబితాలో మార్పులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

## భారత ఫారెక్స్ ఖజానా కళకళ




**ముంబయి, ఆగస్టు 14:** భారత విదేశీ మారక నిల్వలు ఆగస్టు 7తో ముగిసిన వారంలో 14.136 బిలియన్ డాలర్లు పెరిగి 707.002 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) శుక్రవారం వెల్లడించిన డేటా ప్రకారం అంతకుముందు జూలై 31తో ముగిసిన వారంలోనూ విదేశీ మారక నిల్వలు 10.512 బిలియన్ డాలర్లు పెరిగి 692.866 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.ఈ యేడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 728.494 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరాయి. అనంతరం మధ్యప్రాచ్య ఘర్షణలు ప్రారంభం కావడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. దీంతో ఆర్‌బీఐ విదేశీ మారక మార్కెట్‌లో డాలర్ల విక్రయాల ద్వారా జోక్యం చేసుకోవాల్సి రావడంతో వరుసగా కొన్ని వారాల పాటు నిల్వలు తగ్గాయి.
విదేశీ కరెన్సీ ఆస్తులు ఆగస్టు 7తో ముగిసిన వారంలో 9.946 బిలియన్ డాలర్లు పెరిగి 574.625 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. విదేశీ మారక నిల్వల్లో ఎఫ్‌సిఎ ప్రధాన భాగంగా ఉంటుంది.డాలర్లలో లెక్కించే ఎఫ్‌సీఏలో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాయేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ఉంటుంది. మరిన్ని విదేశీ మారక నిధులను దేశంలోకి ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐ జూలైలో ఎఫ్‌సీఎన్ఆర్ (బి) పథకం సహా పలు చర్యలను ప్రారంభించాయి. ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు దేశానికి సుమారు 40 బిలియన్ డాలర్ల విదేశీ నిధులు వచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇక దేశ బంగారం నిల్వల విలువ 3.995 బిలియన్ డాలర్లు పెరిగి 108.738 బిలియన్ డాలర్లకు చేరుకుంది.స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ ఎస్‌డీఆర్‌లు 79 మిలియన్ డాలర్లు పెరిగి 18.745 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

## 9.78 శాతంగా టోకు ద్రవ్యోల్బణం



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** దేశీయ టోకుధరలసూచీ ద్రవ్యోల్బణం జులైలో 9.78 శాతంగా నమోదైంది. అంతకుముందునెలలో నమోదైన 9.87 శాతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన ప్రాథమిక గణాంకాల ప్రకారం, అన్ని వస్తువులకు సంబంధించిన టోకు ధరల సూచీ జులైలో 110.0గా ఉండగా, జూన్‌లో ఇది 110.2గా ఉంది.ప్రధాన విభాగాల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. ప్రాథమిక వస్తువులు, తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం పెరగగా, ఇంధనం-విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం తగ్గింది.ప్రాథమిక వస్తువుల ద్రవ్యోల్బణం పెరుగుదప్రాథమిక వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం జూన్‌లోని 7 శాతం నుంచి జులైలో 8.52 శాతానికి పెరిగింది. ఆహారేతర వస్తువుల ద్రవ్యోల్బణం 11.07 శాతం నుంచి 17.66 శాతానికి, ఖనిజాల ద్రవ్యోల్బణం 9.45 శాతం నుంచి 13.28 శాతానికి పెరిగింది. ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గింది. జూన్‌లో 5.49 శాతంగా ఉండగా, జులైలో 5.44 శాతంగా నమోదైంది. ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం జూన్‌లోని 27.41 శాతం నుంచి జూలైలో 20.05 శాతానికి తగ్గింది.ఖనిజ నూనెల ద్రవ్యోల్బణం 46.48 శాతం నుంచి 32.4 శాతానికి, ముడి చమురు, సహజ వాయువు ద్రవ్యోల్బణం 34.75 శాతం నుంచి 26.99 శాతానికి తగ్గాయి.విద్యుత్ ద్రవ్యోల్బణం మాత్రం జూలైలో 1.09 శాతానికి సానుకూలంగా మారింది. జూన్‌లో ఇది 0.76 శాతంగా ఉంది.

## 57% తగ్గిన నాట్కో ఫార్మా నికర లాభం

**ముంబయి, ఆగస్టు 14:** హైదరా బాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థ నాట్కో ఫార్మా తొలి త్రైమాసికంలో నిరాశాజనక ఫలితాలను ప్రకటిం చింది. తొలి త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం యేడాది ప్రాతిపదికన 57 శాతం తగ్గి రూ.207 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.481 కోట్లుగా నమోదైంది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం కూడా 44.7 శాతం క్షీణించి రూ.735 కోట్లకు పడిపోయింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.1,329 కోట్లుగా ఉంది. కార్యాచరణ పనితీరు కూడా ఒత్తిడికి లోనైంది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు ఆదాయం 67.4 శాతం తగ్గి రూ.186 కోట్లకు చేరింది. దీంతో ఎబిడిటా మార్జిన్ కూడా గత యేడాది 43 శాతం నుంచి ప్రస్తుత త్రైమాసికంలో 25.3 శాతానికి భారీగా తగ్గింది. ఇదిలా ఉండగా, తొలిత్రైమాసికంలో ఒక్కో షేరుకు రూ.1.50 మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ క్యూఐపి లేదా అనుమతించబడిన ఇతర మార్గాల ద్వారా గరిష్ఠంగా రూ.2,000 కోట్ల వరకు నిధులు సమీకరించే ప్రతిపాదనకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకు అవసరమైన నియంత్రణ సంస్థల అనుమతులు పొందాల్సి ఉంటుంది.

पंजाब नैशनल बैंक ...भरोसे का प्रतीक! punjab national bank ...the name you can BANK upon!

ప్రజా ప్రకటన


ఈ ప్రకటన, శూన్య నిల్వ ఉన్న మరియు గత మూడు సంవత్సరాలకు పైగా కస్టమర్ ద్వారా ఎటువంటి లావాదేవీలు జరగని నిష్క్రియ ఖాతాదారుల కోసం జారీ చేయబడింది. తమ ఖాతాను తిరిగి సక్రియం చేసుకోవడానికి KYC పత్రాలను సమర్పించి PNB శాఖను సంప్రదించవలసిందిగా కోరడమైనది. ఈ ప్రకటన తేదీ నుండి ఒక నెలలోపు ఖాతాను సక్రియం చేయనట్లయితే, తదుపరి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అటువంటి నిష్క్రియ ఖాతాలను మూసివేయబడతాయి.
ఏవైనా ప్రశ్నలు/సహాయం కోసం దయచేసి మీ శాఖను సంప్రదించండి.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
తేదీ: 15.08.2026
అధీకృత సంతకందారు

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

15-8Pg9th cheli:15-8Pg9th cheli.qxd 8/14/2026 10:37 PM Page 1





# మన తరం కోసం..



ఫ్యాషన్ దుస్తులతోపాటూ జ్యువెలరీలోనూ కొత్త ట్రెండ్స్ ఫాలో అవ్వాలనుకుంటున్నారా.. అయితే మార్కెట్లో మెరిసిపోతున్న ఈ సరికొత్త నగల్ని ప్రయత్నించి చూడండి. అద్భుతమైన నగిషీలతో దేవుడి ఉంగరాలూ, అదిరిపోయే డిజైన్లతో పూసల పెండెంట్లూ ఆకట్టుకునే మెడల్లతో రుద్రాక్షల బ్రేస్‌లెట్లూ..ఎంతో అందాన్నిస్తాయి..

ఫ్యాషన్ ఫ్యాషన్

## దేవుళ్ల ఉంగరాలు..

**అమ్మమ్మల** నుంచి అమ్మాయిల వరకూ అందర్నీ మెప్పించే నగలేవైనా ఉన్నాయా అంటే.. అవి కచ్చితంగా టెంపుల్ జ్యువెలరీనే. హారాల దగ్గర్నుంచి గాజుల వరకూ ప్రతిదాంట్లోనూ కనిపించిన ఈ టెంపుల్ థీమ్. నగల ప్రియుల్ని బుట్టలో పడేస్తూ ఈ మధ్య చేతి ఉంగరాల్లోకీ చేరిపోయింది. అప్పట్లో చిన్న డిజైన్లలో కనిపించే దేవుళ్ల చిత్రాలు.. ఇప్పుడు చక్కటి నగిషీలూ, రత్నాల మెరుపులతో అచ్చంగా దేవుడి విగ్రహ రూపాల్లా వస్తున్నాయి. లక్ష్మీదేవి, వేంకటేశ్వరస్వామీ, శివపార్వతులూ.. ఇలా ఎందరో దేవుళ్ల రూపాలతో వజ్రాలూ, కెంపులూ, పచ్చలూ, నీలాల రాళ్ల చమక్కుల్ని జత చేసుకుని కనువిందు చేస్తున్నాయి. ఆడవాళ్లతోపాటు మగవాళ్లకూ వీటిల్లో రకరకాల డిజైన్లు దొరుకుతున్నాయి. అనుక్షణం తమ ఇష్టదైవాన్ని స్మరించుకునేవాళ్లు ఈ టెంపుల్ థీమ్ ఉంగరంతో ఆ దేవుడి రూపాన్ని కళ్లముందుకు తెచ్చుకోవచ్చు.



## రుద్రాక్షల బ్రేస్‌లెట్ !

**రుద్రాక్ష భగవంతుడికి** ప్రతిరూపమని చెబుతూ కొందరూ, వాటిని ధరించడం వల్ల ఆరోగ్యమంటూ మరికొందరూ.. ఇలా రకరకాల నమ్మకాలతో రుద్రాక్షల్ని ధరిస్తారు. అలాంటివారిని దృష్టిలో పెట్టుకుని ఎంతో పవిత్రంగా భావించే ఆ రుద్రాక్షల్ని- మామూలు దారానికి కట్టుకునే బదులు విలువైన బంగారు నగల్లో తీసుకొస్తే ఎలా ఉంటుంది. అనుకున్నారేమో తయారీదారులు చిన్న చిన్న బంగారు రుద్రాక్షల లాకెట్లతోపాటూ బ్రేస్‌లెట్లనీ తీసుకొచ్చేశారు. ఈ తరానికి నచ్చేలా ట్రెండీ డిజైన్లలో వీటిని తయారుచేస్తున్నారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా స్వస్తిక్, ఓం, త్రిశూలం లాంటి గుర్తుల్నీ బ్రేస్‌లెట్లకి జత చేస్తున్నారు. మిగతా వాళ్ల సంగతేమోకానీ దైవభక్తి ఉన్నవాళ్లకు బహుమతిగా ఈ రుద్రాక్షల బ్రేస్‌లెట్‌ని అందించారంటే కచ్చితంగా అది వారికి అపురూపమైన కానుకే అవుతుంది.





## పూసల పెండెంట్లు!

**బంగారమేంటీ..**రత్నాలేంటీ. పూసలేంటీ.. అన్నీ నగల్లో భాగం కావాల్సిందే, అమ్మాయిల మెడని చుట్టి అందాల ఆభరణంగా మారాల్సిందేనంటూ డిజైనర్లు సరికొత్త జ్యువెలరీని తీసుకొస్తుంటారు. అందులో భాగంగా కొత్తగా డిజైన్ చేసినవే ఇక్కడున్న ఈ పూసల పెండెంట్లు. అందమైన బంగారు డిజైన్ల వెనక రంగు రంగుల పూసల వరసల్ని జోడిస్తూ.. లాకెట్టునే చక్కని కళా చిత్రంలా తీర్చిదిద్దుతున్నారు. □



# పిల్లలు నిద్రపోవడం లేదా !



**రాత్రి 11 గంటలైనా** ఎనిమిదేళ్ల కొంది మంది పిల్లలు పట్టడం లేదు అంటారు. అలాగే 15 ఏళ్ల పిల్లలు కూడా కొంత నిద్రపోవడానికి ఆసక్తి చూపారు. పగలంతా స్కూల్, హోంవర్క్ అంటూ అలసిపోతారు. అయినా నిద్రలేమికి గురవుతున్నారంటే దానికి కారణం స్క్రీన్, డిజిటల్ టెక్నాలజీ ప్రభావమే అంటూన్నారు నిపుణులు. ఈ సమస్యను పరిష్కరించక పోతే, పిల్లలు శారీరక, మానసిక అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మెదడు పని తీరు మెరుగ్గా ఉండాలంటే చిన్నప్పటి నుంచి వాళ్లకు నాణ్యమైన నిద్ర అవసరమెంతో ఉంది. కంటినిండా నిద్ర వాళ్ల మెదడుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. శారీరక ఎదుగుదలకు దోహదపడుతుంది. కానీ నిద్రకు ముందు ఫోన్ వినియోగిస్తే అది పిల్లల మెదడు, మనసును ఉత్తేజ పరుస్తుంది. అలాగే ఫోన్, టాబ్లెట్, టివి నుంచి వెలువడే నీలి కాంతి మెదడులో సహజంగా విడుదలయ్యే మెలటోనిన్ స్థాయులను నిరోధి స్తుంది. ఇది నిద్రను ప్రభావితం చేస్తుంది. స్నేహితులతో చాట్ చేయడం, గేమ్స్, రీల్స్ చూడటం వంటివన్నీ నిద్రపోవాలనే ఆసక్తిని తగ్గిస్తాయి. అంతేకాదు, రోజులో ఎప్పుడైనా ఫోన్ లేదా టివిలో చూసిన హింసాత్మక కంటెంట్ ప్రభావమూ పిల్లల మెదడుపై పడి నిద్రను దూరం చేస్తుంది.

**నివారించడమెలా...**

సాయంత్రంవేళల్లో స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి పిల్లలను ప్రోత్సహించాలి. ఉదయం లేదా సాయంత్రం తల్లిదండ్రులు పిల్లలతో సరదాగా కాసేపు నడిస్తే, నక్రమేపీ వారికి వ్యాయామం అలవడుతుంది. శారీరక శ్రమతో కండరాలు అలిసి హాయిగా నిద్రపోతారు. ఫోన్ వాడకానికి పరిమిత సమయాన్ని కేటాయించి, నిద్రవేళకు గంట ముందే డిజిటల్ వినియోగాన్ని నిలిపేసేలా అలవాటు చేయాలి. నిద్రపోయే ముందు తల్లిదండ్రులు వారికి కథలు చెప్పడం, ఆ రోజు విశేషాలను అడిగి తెలుసుకోవడం వంటివి చేయాలి. ముఖ్యంగా నిద్రపోయే ముందు ఇంటిల్లిపాది ఒకచోట ఫోన్లన్నీ భద్రపరచాలనే నియమాన్ని పెట్టుకోవాలి. అంతేకాదు, పడకగదిలో పెద్దవాళ్లూ కంప్యూటర్, స్మార్ట్‌వాచ్‌లను వినియోగించే అలవాటుంటే మానేయడం మంచిది. లేదంటే వాటి నుంచి వచ్చే నీలికిరణాలు పిల్లల నిద్రపై చెడు ప్రభావం చూపుతాయి. బెడ్‌రూంలో టివి వంటివి లేకుండా ఆ ప్రాంతాన్నంతా సాంకేతికత రహితంగా మార్చితేనే పిల్లలు కంటినిండా నిద్రపోతారు. సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారు. □

# పెరుగు పోషకాల గని !



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

పెరుగు వాడకం ఎంత ఆరోగ్యకరమని అనుకున్నా దాని వినియోగ విషయంలో తెలుసుకోవాల్సిన అంశాలెన్నో ఉన్నాయి. పూర్తిగా తయారుకాని పెరుగుని, ఎక్కువ రోజులు నిల్వ ఉన్న పెరుగు బాగా పులిసిన పెరుగుని తినరాదు. దీని వల్ల ఫుడ్ పాయిజనింగ్ పొత్తి కడుపులో తిమ్మిర్లు, వాంతులు, ఆకలి తగ్గడం, అలసట, చర్మం నొప్పి, మలంలో రక్తం పడడం జరుగుతుంది. వసంత, శరదృతువు, చలికాలంలో తింటే కఫం ఎక్కువైన వారు మానవేయడం మంచిది. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నప్పుడు తినరాదు. పెరుగుని వేడి చేసి తినరాదు. దీని వల్ల ఊపిరాడక, శరీరంలో వాపులు వస్తాయి. రాత్రిళ్ళు పెరుగు తినరాదు. జీర్ణవ్యవస్థ వీక్‌గా ఉంటే రాత్రి పూట పెరుగు మానివేయాలి. అజీర్తి ఎసిడిటీ ఉన్నవారు మీగడ పెరుగు తినరాదు. ఎందుకంటే పెరుగులో తీపి, పులుపు రెండు ఉండడం వల్ల కఫం (శ్లేష్మం) ఏర్పడుతుంది. పెరుగుని చేపలు, పాలు, పాల ఉత్పత్తులు, మామిడి, అరటి, మాంసం, ఎగ్స్, పుల్లని పదార్థాలతో, వేడి పదార్థాలతో కలిపి తీసుకోరాదు. ఎందు కంటే రెండు అధిక ప్రోటీన్స్ గల పదార్థాల్ని ఒకే సారి తినడం వల్ల షుగర్ పెరగడం, దగ్గు, ఆయాసం, చర్మ సమస్యలు అల్సర్‌వస్తాయి రాత్రిళ్ళు పెరుగు మీద నీళ్ళు త్రాగరాదు.



**ఆరోగ్య చిట్కాలు :** పిల్లలు, వృద్ధులు, బలహీనంగా ఉన్నవారు, పోషకాహారలోపం ఉన్నవారు వీర్యకణాల వృద్ధికి పెరుగు+దానిమ్మ, పెరుగు+ ఎండు నరదాక్ష, పెరుగు+ఎండు ఖర్జురాలు, బాదంపొడి కలిపి తీసుకోవచ్చు. జలుబు, దగ్గు, గొంతుసమస్య, జీర్ణశకిన పెరగ డానికి పెరుగు+ మిరియాలపొడి పెరుగు+బెల్లం పొడి, పెరుగు+ జీలకర్ర, వాముపొడి కలిపి తీసుకోవచ్చు. మూత్రాశయ సమస్యలు, అధిక కఫం ఉన్నప్పుడు, తక్షణ శక్తికి అలసటగా ఉన్నప్పుడు పెరుగు+చక్కెర, పెరుగు+తేనె నెయ్యి పచ్చిశనగలు, ఉసిరి కలిపి తీసుకోవాలి. కడుపులో అల్సర్స్, ఇన్ఫెక్షన్స్ ఉన్నప్పుడు, వేడి చేసినప్పుడు పెరుగులో తేనె కలిపి తీసుకోవాలి. శరీరంలో ఫోలిక్ ఆసిడ్ చేరాలంటే, ఆంటిసెప్టిక్‌గాపెరుగు+ పసుపు+ అల్లం తీసుకోవాలి. పంటి సమస్యలు, నోటిపూత ఉన్నప్పుడు పెరుగు+ వాము తీస ుకోవాలి. కండరాల శక్తికి పెరుగు+ఓట్స్ తీసు కోవాలి. దీన్ని శరీరంలో నీరు ఎక్కువగా ఉన్నవారు, బిపి ఎక్కువగా ఉన్నవారు రోజు తీసుకోవచ్చు. జిగట విరేచనాలకి పెరుగు మెంతులు తీసుకోవాలి. అలాగే వేడి అన్నంలో పెరుగు వేసుకోని తినాలి. వేడి తగ్గించి చలువ చేయడానికి పెరుగులో బెల్లం వేసుకొని తినాలి. అజీర్తి ఎసిడిటీ ఉన్నవారు పెరుగులో ఉప్పు వేసుకోని తినాలి. రోగనిరోధక శక్తి పెరగడానికి పెరుగులో దానిమ్మ, ద్రాక్ష, అరటి వంటి పండ్లు వేసుకొని తినవచ్చు. కీళ్ళ నొప్పులు న్నప్పుడు పెరుగు+ఆరెంజ్ జ్యూస్‌తో తినాలి. బరువు తగ్గడానికి పెరుగులో జీలకర్ర వేసుకొని తినాలి. దంతాలనొప్పి, నోటిలో అల్సర్లు ఉన్నప్పుడు పెరుగులో సోంపు గింజలు వేసుకొని తినాల్సి ఉంటుంది.

**జాగ్రత్తలు-చికిత్స:** రోజుకి 3 కప్పుల పెరుగు మాత్రమే తీసు కోవాలి. పెరుగును పరగడుపు, భోజనానికి ముందు, రాత్రిపూట తీసుకోరాదు. మధ్యాహ్నం మాత్రమే తీసుకోవాలి. మజ్జిగ తీసుకోవచ్చు. తాజా పెరుగునే వాడాల్సి ఉంటుంది. ఫ్రిజ్‌లో నిల్వ చేసిన పెరుగుని వెంటనే తినరాదు. బైట పెట్టి 1-2 గంటలకి తీసుకోవచ్చు. ఫ్రిజ్‌లో ఎక్కువ రోజులుంచినపుడు పెరుగులోని పోషకవిలువలు తగ్గిపోతాయి. రాత్రిపూట పెరుగు తీసుకోవాలంటే నెయ్యి, చక్కెర, తేనె ఉసిరిపొడి శనగపిండి కలిపి తీసుకోవచ్చు. కీళ్ళవ్యాధులున్నవారు, కఫం ఎక్కువగా వచ్చేవారు, పెరుగు పడని వారు పెరుగులో మిరియాలపొడి లేదా మెంతి పొడి లేదా చిటికెడు ఎండుమిర్చి వేసి వాడుకోవచ్చు. పెరుగు ఎక్కువగా వాడేటప్పుడు విరుగుడు వెడి నీళ్ళు, జీలకర్ర, శొంఠిపొడి, బెల్లం, ఉప్పు సైంధవలవణం తీసుకోవాలి. □

## హనుమ ఆరాధన

ఓం హరి మర్కట మర్కటాయనమః ఆంజనేయస్వామిని మీరు ఇలా తలుచుకోవచ్చు. 11 సార్లు చదువుకుంటే మీ కోరికను ఆ స్వామి ఆలకిస్తారు . ఆపదలో వున్న తన భక్తులను ఆదుకోవడానికి హనుమంతుడు ఎంత మాత్రం ఆలస్యం చేయడు. అలాంటి హనుమంతుడిని



అనునిత్యం పూజించే వారు వుంటారు.. ఆ స్వామికి ప్రదక్షిణలు చేసిన తరువాతనే తమ దైనందిన కార్యక్రమాలను మొదలు పెట్టేవారు వుంటారు. ఇక స్వామివారికి ప్రత్యేకించి పూజాభిషేకాలు చేయించే వారు మాత్రం, హనుమకు ఇష్టమైన మంగళవారం రోజున అవి చేయిస్తుంటారు. తమలపాకులతో పూజలు చేయించి .. ఆ స్వామికి ఇష్టమైన తీపి అప్పాలను నైవేద్యంగా సమర్పి స్తారు. ఈ విధంగా చేయడం వలన అనారోగ్యాలు .. ఆపదలు .. ఆర్థికపరమైన ఇబ్బందులు తొలగిపోతాయి.ఇక చాలామంది శనివారం రోజున కూడా హనుమంతుడిని పూజిస్తుంటారు .. భక్తి శ్రద్ధలతో సేవిస్తుంటారు. శనివారం రోజున హనుమను పూజించడం వలన, శనిగ్రహ సంబంధమైన దోషాలు తొలగిపోతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. శనివారం రోజున హనుమను పూజించేవారి జోలికి రానని ఒకానొక సందర్భంలో శనిదేవుడు హనుమకు మాట ఇచ్చాడట. అందువల్లనే

## ఫ్రూట్ సలాడ్ ట్రీస్ !




జామచెట్టుకు జామ, సపోటా చెట్టుకు సపోటాలే కాస్తాయి. ఈ చిట్టి చెట్టుకు అయితే పండు ఇంకొకటి రాదు కానీ.. ఒక చెట్టుకు ఆరు రకాల పండ్లు వస్తే ఇదేం ఫాంటసీ సినిమానా అనుకుంటున్నారా? అలాంటివి నిజం చేసి చూపిస్తున్నారు శాస్త్రవేత్తలు. ఆస్ట్రేలియాలో ఎక్కువ అంట్లు కట్టడం (మల్టీ గ్రాఫ్టెడ్) అనే పద్ధతిలో ఒక చెట్టుకు ఆరు రకాల పండ్లు వచ్చేలా అభివృద్ధి చేశారు. వీటిని ఫ్రూట్ సలాడ్ ట్రీస్' అంటారు. గమ్మత్తేమిటంటే ఒకే చెట్టుకు కాసినప్పటికీ ఆయా పండ్లు.. రంగు,రూపం, రుచి, వాసన.. ఎందులోనూ సహజత్వాన్ని కోల్పోవు. వీటని నేల మీదే కాదు కుండీల్లోనూ పెంచవచ్చు. □



## ఆత్మహత్యలను ప్రోత్సహించకూడదనే..

ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్టార్‌గా మారిపోయారు హీరో యష్. అప్పటికే కర్ణాటకలో భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆయన, కేజీఎఫ్ సినిమాలతో దేశవ్యాప్తంగా పాపులారిటీ దక్కించుకున్నారు. గతంలో ఆయన వీరాభిమానుల్లో ఒకరు ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. తాను యష్ కి పెద్ద ఫ్యాన్ అని, తన అంత్యక్రియలకు రావాలని సూసైడ్ లెటర్ లో రాసుకొచ్చారు. అయితే యష్ తన అభిమాని చివరి కోరిక తీర్చలేదు. అతడి అంత్యక్రియలకు వెళ్లలేదు. దీంతో అప్పట్లో యష్ పై విమర్శలు వచ్చాయి. దీనిపై ఇన్నాళ్లకు యష్ స్పందించారు. 2021 ఫిబ్రవరిలో యష్ అభిమాని ఆత్మహత్య వ్యవహారం సంచలనం సృష్టించింది. కర్ణాటకలోని మాండ్యా జిల్లా కోడిదొడ్డి గ్రామానికి చెందిన రామకృష్ణ (25) అనే యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చనిపోయే ముందు అతడు రాసిన సూసైడ్ నోట్ అప్పట్లో వైరల్ అయింది. హీరో యష్‌కి, కాంగ్రెస్ నేత సిద్ధారామయ్యకి తాను పెద్ద అభిమానినని, వీరిద్దరూ తన అంత్యక్రియలకు రావాలని అందులో రాశాడు. ఆ సమయంలో రామకృష్ణ అంత్యక్రియలకు సిద్ధరామయ్య హాజరయ్యారు కానీ, యష్ మాత్రం వెళ్లలేదు. తాజాగా ఓ హిందీ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఇలా చేస్తే యష్ వస్తాడు అనే తప్పుడు ఆలోచన రాకూడదనే అభిమాని అంతిమయాత్రకు వెళ్లలేదని చెప్పారు.



## ఆర్మీ ఆఫీసర్

బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ ప్రెస్టీజియస్ మల్టీస్టారర్ చిత్రం వెంకీ అనిల్ 5. తెలుగు చిత్రసీమలో హీరోగా అడుగుపెట్టి విజయవంతంగా 40 ఏళ్లు పూర్తి చేసుకున్న వెంకటేష్‌కి ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.

ఈ సినిమాలో వెంకటేష్ ఇండియన్ ఆర్మీకి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. కౌంటర్ టెర్రరిజం విభాగంలో ప్రత్యేక అధికారిగా ఆయన పాత్ర కథలో అత్యంత కీలకంగా ఉండబోతోంది. గుబురు గడ్డం, మీసాలు, మిలిటరీ కమోఫ్లేజ్ యూనిఫామ్, బ్లాక్ కంబాట్ షూస్, సన్ గ్లాసెస్‌తో వెంకీ మామ మాస్ అండ్ ఇంటెన్స్ అవతార్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అనిల్ రావిపూడి వెంకటేష్ కలయికలో వస్తున్న ఐదో ప్రాజెక్ట్ కావడం విశేషం. తారాగణం: వెంకటేష్, కళ్యాణ్ రామ్‌ల సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు.సంగీతం: నేషనల్ అవార్డ్ విన్నర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. నిర్మాణం: షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సురేష్ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ రావిపూడి మార్క్ కామెడీ కలబోతగా తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# తెర

## అదరగొట్టిన కాంతార, కాంత!

◆మెల్‌బోర్న్ అవార్డుల్లో దక్షిణాది హవా ◆ఉత్తమ నటుడిగా దుల్కర్ సల్మాన్, దర్శకుడిగా రిషబ్ శెట్టి ◆రేఖ, రాణీ ముఖర్జీలకు ప్రత్యేక గౌరవం ◆ఆస్ట్రేలియాలో ఘనంగా అవార్డుల వేడుక..



ఆస్ట్రేలియా వేదికగా జరిగిన 17వ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా ముగిసింది. 2025 సంవత్సరంలో విడుదలైన అత్యుత్తమ చిత్రాలు, వెబ్ సిరీస్‌లు, సినీ ప్రతిభావంతులకు ఈ వేడుకలో పురస్కారాలు అందజేశారు. కాంత చిత్రంలో చూపించిన అద్భుత నటనకు గానూ దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా ఎంపికవ్వగా, ఆయన నిర్మించిన లోక చాప్టర్ 1: చంద్ర ఉత్తమ చిత్రంగా నిలిచింది. కాంతార: ఏ లెజెండ్ చాప్టర్ 1 చిత్రానికి గానూ రిషబ్ శెట్టి ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందుకోవడంతో పాటు భారతీయ చిత్రసీమకు చేసిన సేవలకు లీడర్‌షిప్ ఇన్ సినిమా అవార్డును కూడా కైవసం చేసుకున్నారు. ఇక ఫుల్ ప్లేట్ సినిమాకు గానూ కీర్తి కుల్హరి ఉత్తమ నటిగా పురస్కారం స్వీకరించారు. సినీ పరిశ్రమలో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీని నిర్వాహకులు ప్రత్యేకంగా సన్మానించగా, సీనియర్ నటి రేఖను ఎక్స్‌లెన్స్ ఇన్ సినిమా పురస్కారంతో గౌరవించారు. నటుడు పంకజ్ త్రిపాఠి ఆర్టిస్ట్ ఆఫ్ డిస్టింక్షన్ అవార్డు అందుకున్నారు. వెబ్ సిరీస్ విభాగంలో మట్కా కింగ్ నటనకు విజయ్ వర్మ, ఢిల్లీ క్రైమ్3కి రసికా దుగల్ ఉత్తమ నటీనటులుగా నిలవగా, ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ (సీజన్ 2) ఉత్తమ సిరీస్‌గా ఎంపికైంది. అలాగే ఆమీర్ ఖాన్ నటించిన సితారే జమీన్ పర్ చిత్రానికి ఈక్వాలిటీ ఇన్ సినిమా అవార్డు, సైయారా చిత్రానికి పీపుల్స్ ఛాయిస్ అవార్డు దక్కాయి.



## గ్రాండ్‌గా జార్జ్ క్రిష్ షురూ!

శర్వానంద్ శ్రీను వైట్ల కాంబోలో ‘జార్జ్ క్రిష్’.. పూజా కార్యక్రమాలతో ప్రారంభం!యంగ్ హీరో శర్వానంద్, వినోదాత్మక చిత్రాల దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న కొత్త చిత్రం వైభవంగా ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం 9:45 గంటలకు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, మొదటి షాట్‌కు క్లాప్ కొట్టి సినిమాను అధికారికంగా ప్రారంభించారు.ప్రముఖ నిర్మాణ సంస్థ ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత అనిల్ సుంకర ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జార్జ్ క్రిష్ అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు నిర్మాతలు ప్రకటించారు.వరుస సినిమాలతో జోరు మీదున్న శర్వానంద్ ఈ ప్రాజెక్ట్‌తో మరో కొత్త జోనర్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుండగా, దర్శకుడు శ్రీను వైట్ల తన మార్క్ కామెడీ, పంచ్ డైలాగులు మరియు కమర్షియల్ అంశాలతో గట్టి కమ్‌బ్యాక్ ఇవ్వాలని భావిస్తున్నారు. శర్వానంద్‌లోని క్లాస్ అండ్ మాస్ టైమింగ్‌కు, శ్రీను వైట్ల స్టైల్ వినోదం తోడైతే థియేటర్లలో నవ్వుల పండగ ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ చిత్రాన్ని రాబోయే సంక్రాంతి సీజన్‌లో విడుదల చేసేలా మేకర్స్ ప్రణాళికలు వేస్తున్నారు. ఇక ఈ సినిమాలో నటించబోయే కథానాయిక, ఇతర నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.






## పోతురాజు అవతారంలో రియల్ రౌద్రం!

తెలుగు సినీ పరిశ్రమలో విలక్షణ నటనతో, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దిగ్గజ నటుడు, రియల్ స్టార్ డా. శ్రీహరి. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా ఓ సరికొత్త భారీ చిత్రం రూపుదిద్దుకుంటోంది. భైరవకాళి ఫ్లిక్స్ బ్యానర్‌పై లెల్లా రోహిత్ దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని లెల్లా రాహుల్ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 15న దివంగత లెజెండరీ నటుడు శ్రీహరి జయంతిని పురస్కరించుకుని చిత్ర బృందం ఈ సినిమా నుంచి పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో విశిష్టమైన పోతురాజు ఆహార్యంలో మేఘాంశ్ శ్రీహరి కనిపించిన తీరు సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్‌లో మేఘాంశ్ వెనుక రియల్‌స్టార్ శ్రీహరి కూడా అదే పోతురాజు అవతారంలో కనిపిస్తూ తనయుడికి అండగా నిలబడినట్లు డిజైన్ చేసిన విధానం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో విశేషంగా వైరల్ అవుతోంది.
ఇప్పటికే 50 శాతానికి పైగా చిత్రీకరణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఇండియాస్ బిగ్గెస్ట్ టైటిల్ గ్లింప్స్ రివీలింగ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## ఆ రూమర్ నా జీవితాన్ని మార్చేసింది



తన క్యూట్ నటనతో ఎన్నో సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది తెలుగమ్మాయి తేజస్వి మదివాడ. క్యారెక్టర్ ఆర్టిస్టుగా అడుగుపెట్టి హీరోయిన్‌గా కొన్ని సినిమాల్లో మెరిసింది. అంతేకాకుండా బిగ్‌బాస్ షోకి వెళ్లి అక్కడ కూడా ఎంతో మందిని అభిమానులుగా మార్చుకుంది. అయితే కొంతకాలంగా తేజస్వికి సరైన అవకాశాలు రావడం లేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలో ఎదురైన ఊహించని సవాళ్లు, చేదు అనుభవాల గురించి వెల్లడించిన సంచలన విషయాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2013లో వచ్చిన ‘సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు’ చిత్రంలో మహేష్ బాబు పాత్రతో సాగే చిన్న సంభాషణతో తేజస్వి నటిగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత మనం, హార్ట్ ఎటాక్, లవర్స్, మళ్లీ మళ్లీ ఇది రాని రోజు, శ్రీమంతుడు, పండగ చేస్కో, కేరింత వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. ముఖ్యంగా ‘కేరింత’లోని ఆమె పాత్రకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు దక్కాయి. ఒకానొక దశలో తనకు వరుసగా దాదాపు 40 సినిమాల వరకు అవకాశాలు వచ్చాయని, కెరీర్ ఎంతో ఆశాజనకంగా సాగుతుందనే నమ్మకం కలిగిందని ఆమె గుర్తు చేసుకున్నారు. అయితే, రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో నవదీప్ సరసన చేసిన ఐస్ క్రీమ్ చిత్రం తన సినీ ప్రయాణాన్ని ఊహించని మలుపు తిప్పిందని తేజస్వి పేర్కొన్నారు. ఈ సినిమా విడుదల సమయంలో ప్రచారంలోకి వచ్చిన ఒక వివాదం తనపై తీవ్ర ప్రభావం చూపింది. సినిమాలో తాను న్యూడ్‌గా నటించినట్లు జరిగిన ప్రచారం తప్పు అని, అందులో నిజం లేదని ఆ తర్వాత స్వయంగా వివరణ ఇచ్చినప్పటికీ, ఆ బోల్డ్ ఇమేజ్ ముద్ర తనకు ఇబ్బందిగా మారిందని తేజస్వి తెలిపారు. ఈ వచ్చిన నెగెటివ్ ఇమేజ్ కారణంగా కుటుంబ కథా చిత్రాలలో అవకాశాలు తగ్గడమే కాకుండా, మంచి అవకాశాలు కోల్పోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

15-8Pg8:15-8Pg8.qxd 8/15/2026 12:26 AM Page 1



## గోల్డెన్ ట్రయంగిల్ నగరాల సరసన

# ఘోస్ట్ సిటీ, వియోంటిన్

- పోలీసుల దాడుల్లో పదుల సంఖ్యలో కాల్ సెంటర్లు

### వందల సంఖ్యలో నేరగాళ్లు, రూ.కోట్ల నగదు పట్టివేత

హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త: సైబర్ నేరాలకు కేరాఫ్‌గా ఇంతకాలం గోల్డెన్ ట్రయాంగిల్‌గా పేరొందిన మయన్మార్, కాంబోడియా, వి యత్నాంలోని నాలుగైదు ప్రాంతాలే వుండేవి. ఇప్పుడు వీటి సరసన మలేషియాలోని ఘోస్ట్ సిటీతో పాటు లావోస్ రాజధాని వియోంటిన్ నగ రాలు కూడా చేరాయి. ఇందులో మలేషియాలో సముద్ర తీరంలో చైనా నిర్మించిన విలాసవంతమైన విల్లాలున్న ఫారెస్ట్ సిటీ (దీనిని ఘోస్ట్ సి టీగా కూడా పిలుస్తారు), ఇప్పుడు సైబర్ నేరాలకు అడ్డాలుగా మారాయి. దీనిపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘోస్ట్ సిటీలోని సైబర్ అడ్డాలపై దాడులు చేయగా పదుల సంఖ్యలో కాల్ సెంటర్ల గోల్‌మాల్ రట్టవడంతో పాటు వందల సంఖ్యలో నేరగాళ్లు పట్టుబడ్డారు. ఇ దే సమయంలో వియోంటిన్ నగరంలోనూ ఈ తరహా గోల్‌మాల్ కార్యకలాపాలు వెలుగు చూశాయి. దీంతో ఈ రెండు నగరాలు సైబర్ నేరాల కు అడ్డాలుగా మారాయని తేటతెల్లమయ్యింది. మొదటగా మలేషియాలోని ఘోస్ట్ సిటీ గురించి పరిశీలిస్తే ఈ నగరాన్ని 2016లో చైనాకు చెందిన కంపెనీలు భారీ అంచనాలతో వంద బిలి యన్ డాలర్ల వ్యయంతో నిర్మించాయి. ఫారెస్ట్ పేరిట వీటిని నిర్మించారు. సముద్ర తీరంలో అహ్లాదకర వాతావరణంలో వుండేలా విలాసవంత మైన సౌకర్యాలు వుండేలా వీటిని తీర్చిదిద్దారు. ఈ టవర్లకు భారీగా డిమాండ్ వుంటుందని భావించినా కరోనా రావడం, చైనాలో స్థిరాస్తి రంగ ం ఒడిదుడుకులకు లోనవడం, పర్యావరణ అనుమతులు ఆలస్యం కావడంతో డిమాండ్ తగ్గింది. దీంతో ఈ టవర్ల నిర్మానం ఆలస్యం కావడం తో మూడు లక్షల మంది నివాసం వుండేందుకు నిర్మించిన ఈ టవర్లు కేవలం పది వేల మంది మాత్రమే వుండే స్థాయికి పడిపోయింది. దీంతో చాలా అపార్ట్‌మెంట్లు ఖాళీగా వున్నాయి. దీంతో పాటు ఈ టవర్లు ఇదివరకు వున్న నగరానికి దూరంగా వుండడం కూడా జనాలు రాకపోవడానికి మరో కారణమయ్యింది. దీంతో ఫారెస్ట్ సిటీలో క్రమంగా అసాంఘిక శక్తులు రాజ్యమేలసాగాయి. సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారిపోయింది. ఇక క్కడ వున్న అనేక అపార్ట్‌మెంట్లలో సైబర్ నేరాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో మలేషియా పోలీసులు ఇటీవల 32 చోట్ల ఆకస్మికం గా దాడులు నిర్వహించారు. ఇందులో 27 అపార్ట్‌మెంట్లలో గోల్‌మాల్ కాల్ సెంటర్లు కొనసాగుతుండగా వాటిపై దాడిచేసి అక్కడి వస్తువులను పోలీసులు జప్తు చేశారు. క్రిప్టో కరెన్సీ, పెట్టుబడి పథకాలతో పాటు ప్రేమ పేరు, మ్యాట్రిమోనియల్ వంటి అనేక రకాల మోసకారి వ్యవహారా లు ఇక్కడి నుంచి నడుస్తున్నట్లు తేలింది. ఈ దాడుల్లో 335 మంది నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేయగా 15 కోట్ల రూపాయలకు పైగా వివి ద దేశాల కరెన్సీ, 300పైగా కంప్యూటర్లు. 1500 పైగా సెల్‌ఫోన్లు, పెద్ద సంఖ్యలో ఎలక్ట్రానిక్ వస్తువులను జప్తు చేశారు. అరెస్టయిన వారిలో 90 శాతం మంది చైనీయులే కావడం గమనార్హం. విదేశాల్లో వుండే అమాయకులను టార్గెట్ చేస్తూ ఇక్కడి సైబర్ నేరగాళ్లు దోపిడి చేస్తున్నట్లు తేలింది. ఇక్కడ అరెస్టయిన వారిలో అనేక మంది ఇంతకు ముందు గోల్డెన్ ట్రయాంగిల్‌లోని సైబర్ అడ్డాలలో పట్టుబడ్డ వారుగా తేలింది. వీర ంతా అంతర్జాతీయ స్కాంలలో నిందితులుగా వున్నవారు కావడం గమనార్హం. దీంతో పాటు వియోంటిన్ నగరంలోనూ ఈ తరహా గోల్‌మాల్ కార్యకలాపాలు వెలుగు చూడడం గమనార్హం.

## లక్షడాలర్ల వీసా ఫీజులపై కాంగ్రెస్‌ప్రతినిధి ధ్వజం

**వాషింగ్టన్, ఆగస్టు 14:** అమెరికాలో హెచ్1బీ వీసాలపై కొత్తగా 1,00,000 డాలర్లు అంటే సుమారు రూ.95 లక్షలు భారీ ఫీజు విధించాలనే ప్రతిపాదనపై భారత సంతతికి చెందిన కాంగ్రెస్ ప్రతినిధి రాజా కృష్ణమూర్తి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే అమెరికా కంపెనీలు తమ పనులను విదేశాలకు తరలిస్తాయని (ఆఫ్‌షోరింగ్), తద్వారా దేశం నైపుణ్యం కలిగిన నిపుణులను ఆకర్షించే సామర్థ్యాన్ని కోల్పోతుందని హెచ్చరించారు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ వేదికపై దాని పోటీతత్వానికి తీవ్ర నష్టం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. స్పిల్ ది టీ అనే ఇంటర్వ్యూ సిరీస్‌లో మాట్లాడిన రాజా కృష్ణమూర్తి మీరు ప్రతిభావంతులను దేశంలోకి తీసుకురావచ్చు లేదా పనిని విదేశాలకు తరలించవచ్చని స్పష్టం చేశారు. ఈ భారీ ఫీజుల కారణంగా అమెరికా కంపెనీలు చేతులు ముడుచుకుని కూర్చోవని, పనులను పూర్తి చేయడానికి విదేశీ మార్గాలను అన్వేషిస్తాయని ఇల్లినాయిస్ డెమోక్రాట్ అయిన కృష్ణమూర్తి పేర్కొన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో జారీ అయిన మొత్తం హెచ్1బీ వీసాలలో 71 శాతం భారతీయులే పొందారని, ఈ నేపథ్యంలో కొత్త ఫీజు విధానం భారతీయులపై, అమెరికా పోటీతత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. ఈ ఫీజును ఆయన నైపుణ్యం కలిగిన ఉద్యోగులపై వేస్తున్న పన్నుగా అభివర్ణించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన సాంకేతిక పాత్రలను పోషించే వారిపై ఇంత పెద్ద మొత్తంలో పన్ను విధించడం సరికాదు. వీరిలో చాలామంది భవిష్యత్తులో కొత్త కంపెనీలు స్థాపించి లక్షలాది ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. ఈ విధానం అలాంటి వారిని దూరం చేస్తుందని ఆయన అన్నారు. అమెరికాలో ఆసియన్లు, భారతీయులపై పెరుగుతున్న విద్వేషపూరిత దాడులకు డొనాల్డ్ ట్రంప్‌ను పరోక్షంగా బాధ్యుడిని చేశారు. ఈ విద్వేషానికి కారణం ఎవరని అడగ్గా దాని పేరు డొనాల్డ్ ట్రంప్‌ను పోలి ఉంటుందని ఆయన చమత్కరించారు. ప్రజల్లోని భయాలను రెచ్చగొట్టి, ఆర్థిక సమస్యలకు మైనారిటీలే కారణమనే భావనను ట్రంప్ కల్పించారని, గడిచిన పదేళ్లలో ఈ విద్వేషం సమాజంలో సాధారణమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇటలీతో భారత్ సంబంధాలు బలోపేతం..

### రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందన




**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో ప్రధాని నరేంద్ర మోడీ దౌత్య సంబంధాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. ఇటలీతో భారత్ సంబంధాలు ఇటీవలి సంవత్సరాల్లో అన్ని రంగాల్లో గణనీయంగా విస్తరించి, మరింత బలోపేతమయ్యాయని స్పష్టం చేసింది.రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సమాధానమిస్తూ ఇటలీతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు అనేక రంగాల్లో విస్తరించడంతో పాటు మరింత పటిష్ఠమయ్యాయని పేర్కొన్నారు.దౌత్య సంబంధాలను పరస్పర గౌరవం, అవగాహనతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. రెండు దేశాల సున్నిత అంశాలు, అభిప్రాయాలను గౌరవిస్తూ పరస్పర అవగాహనతో సంబంధాలను మరింత బలోపేతం చేయడం దౌత్య విధానంలో ముఖ్యమని జైస్వాల్ అన్నారు.రాహుల్ వ్యాఖ్యలపై వివాదంప్రధాని మోడీ విదేశీ నేతలతో వ్యవహరించే తీరును విమర్శిస్తూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలతో వివాదం చెలరేగింది. గురువారం జరిగిన రచనాత్మక కాంగ్రెస్ జాతీయ సదస్సులో రాహుల్ గాంధీ మాజీ కాంగ్రెస్ ఎంపీ సందీప్ దీక్షిత్‌ను వేదికపైకి పిలిచి ఆలింగనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోడీ దౌత్య విధానాన్ని ఉద్దేశిస్తూ ప్రధానమంత్రికి విదేశాంగ విధానం అంటే ప్రపంచ దేశాల నేతలను ఆలింగనం చేసుకోవడమే అన్నట్టుగా రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ప్రసంగం కొనసాగుతుండగా సందీప్ దీక్షిత్ సరదాగా స్పందిస్తూ ఒక విషయం అడగనా నన్ను మెలోనీ అనుకుని పట్టుకోలేదు కదా అని వ్యాఖ్యానించారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో ప్రధాని మోడీసమావేశాలు, పరస్పర ఆలింగనాలపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చలను ఉద్దేశించే ఈ వ్యాఖ్య చేసినట్లు భావిస్తున్నారు.

## విదేశాల్లో భారతీయులపై ఏడు రెట్లు పెరిగిన దాడులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:**
విదేశాల్లో ఉంటున్న భారతీయులపై దాడులు గత ఐదేళ్లలో 7 రెట్లు పెరిగాయని విదేశాంగ శాఖ రాజ్యసభలో వెల్లడించింది. 2021లో విదేశాల్లో భారతీయుపై దాడులకు సంబంధించి 15 ఘటనలు వెలుగులోకి రాగా 2025 నాటికి ఈ సంఖ్య 104కు చేరింది. భారతీయులపై హింసాత్మక దాడి ఘటనలు అత్యధికంగా యుఎస్, యుఎఇ, యుకె, కెనడాల్లో వెలుగు చూశాయి. యుఎఇలో 32 కేసులు, యుకెలో 31, కెనడాలో 30 కేసులు వెలుగుచూశాయి. ఇక ఐర్లాండ్‌లో గత ఐదేళ్లలో భారతీయులపై 24 హింసాత్మక దాడులు జరగ్గా, రష్యాలో 23, జర్మనీలో 19 ఉదంతాలు బయటపడ్డాయి. 2021-25 మధ్య కాలంలో మొత్తం 302 దాడి కేసులు వెలుగు చూడగా 2025లో అత్యధికంగా 104 హింసాత్మక ఘటనలు జరిగాయి. భారతీయులపై హింసాత్మక దాడుల పెరుగుదలలో యేటా హెచ్చుతగ్గులు ఉన్నాయని గణాంకాల్లో తేలింది. యుఎస్‌ఎలో 2021లో ఒక్క ఘటన బయటపడగా, 2022లో ఆరు, 2023లోఒకటి, 2024లో 11, 2025లో 14 దాడి ఘటనలు జరిగాయి. ఇక యుకెలో 2021లో ఒక దాడి ఘటన వెలుగుచూసింది. 2022లో నాలుగు ఉదంతాలు, 2023లో 11, 2024లో పది, 2025లో ఐదు వెలుగుచూశాయి. ఇక కెనడాలో 2021లో భారతీయులపై దాడులకు సంబంధించి మూడు కేసులు వెలుగు చూడగా 2022, 2023 సంవత్సరాల్లో ఆరు కేసుల చొప్పున నమోదయ్యాయి. 2024లో ఏడు, 2025లో 8 దాడి ఘటనలు వెలుగుచూశాయి. మాలీలో 2021-24 మధ్య కాలంలో ఒక్క కేసు కూడా లేకపోగా 2025లో ఏకంగా 11 కేసులు వెలుగుచూశాయి.

# సహనంగా వ్యవహరిస్తే బలహీనులం కానేకాదు..!

### పాక్‌కు మరోసారి అజిత్‌దోవల్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత్ సహనంగా ఉండే దేశమైనప్పటికీ, ఇది బలహీన దేశం కాదని అజిత్ దోవల్ స్పష్టం చేశారు. మా సహనాన్ని బలహీనతగా పొరబడకండి. భారత్ రిస్కులు తీసుకోగలదు. అవసరమైతే గట్టి దెబ్బకొట్టగలదని ఆయన అన్నారు. ఆపేషన్ సిందూర్ వ్యూహాలకకు సంబంధించిన వివరాలపై ఆయన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూ డిస్కవరీకి ఇచ్చిననేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు కీలకంగా ప్రచారంలోకి వచ్చాయి. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన ఉగ్రవాద సంస్థల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని దోవల్ వెల్లడించారు. భారత సైనిక, జాతీయ భద్రతా నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను కూడా ఈ డాక్యుమెంటరీ చూపించనుంది. 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ లో జరిగిన దారుణమై ఉగ్రదాడికి ప్రతిస్పందనగా మే 7న ఆపరేషణ్ సిందూర్ చేపట్టారు. పాకిస్తాన్, పీఓకేలోని లష్కరే తోయిబా, జైషే మహ్మద్‌కు చెందిన ట్రైనింగ్ క్యాంపులు, కార్యాలయాలను ధ్వంసం చేశారు. పాక్ సైన్యం భారత్‌పై దాడి చేసేందుకు ప్రయత్నిస్తే, భారత్ తన క్షిపణులు, యుద్ధ విమానాలతో పాక్ ఎయిర్ ఫోర్స్ బేసుల్ని ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో పాకిస్తాన్ లోని 10కి పైగా వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఇందులో పాక్ ఎయిర్ ఫోర్స్, న్యూక్లియర్ కమాండ్ సెంటర్‌గా ఉన్న రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్ కూడా ఉంది. చివరకు పాక్ శరణు కోరడంతో కాల్పుల విరమణ జరిగింది.

## అమెరికా-ఇరాన్ ఘర్షణలో 45 రీపర్ డ్రోన్లను కోల్పోయిన అమెరికా

**వాషింగ్టన్, ఆగస్టు 14:** అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలో అమెరికా సైన్యం కనీసం 45 ఎంక్యూ9 రీపర్ డ్రోన్లను కోల్పోయినట్లు అమెరికా పత్రిక ఒకటి నివేదించింది. ఇది అమెరికా వద్ద ఉన్న ఆపరేషనల్ రీపర్ డ్రోన్లలో దాదాపు 25 శాతానికి సమానం. ఈ నష్టంతో అమెరికాకు 1.3 బిలియన్ డాలర్లకు పైగా విలువైన సైనిక సామగ్రి నష్టం జరిగినట్లు తెలిపింది. ఈడ్రోన్ల నష్టం కారణంగా మధ్యప్రాచ్య ప్రాంతంలో నిరంతర నిఘా, ఖచ్చితమైన వైమానిక దాడులు నిర్వహించే అమెరికా సామర్థం తగ్గిందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి పరిసరాల్లో దీని ప్రభావం కనిపిస్తున్నట్లు తెలిపింది. ఘర్షణ ప్రారంభానికి ముందు అమెరికా వద్ద సుమారు 185 ఎంక్యూ9 రీపర్ డ్రోన్లు ఉండేవి. వీటిలో 165ను అమెరికా వైమానిక దళం, మరో 20ను మెరైన్ కార్ప్స్ నిర్వహించేవి. అమెరికా నిఘా సంస్థలు నిర్వహించే డ్రోన్లు ఈ లెక్కలో లేవు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రధానంగా పనిచేసే మెరైన్ కార్ప్స్ యూనిట్లకు ఎలాంటి నష్టం జరగలేదని మెరైన్ కార్ప్స్ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ జోషువా బెన్సన్ తెలిపారు. దీంతో నమోదైన నష్టాలను ప్రధానంగా వైమానిక దళమే భరించాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. ఒక్కో ఎంక్యూ 9 రీపర్ ధర దాని సెన్సర్లు, ఆయుధాల అమరికను బట్టి 30 మిలియన్ నుంచి 50 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. నిఘా, కదిలే లక్ష్యాల ట్రాకింగ్, ఖచ్చితమైన దాడుల కోసం వీటిని ఉపయోగిస్తారు. అయితే రీపర్ డ్రోన్లకు ఉన్న తక్కువ వేగం, తక్కువ ఎత్తులో ప్రయాణించే సామర్థం కారణంగా అవి శత్రు కాల్పులు, ఎలక్ట్రానిక్ జోక్యం, కమ్యూనికేషన్ లింక్ వైఫల్యాలకు గురయ్యే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. కోల్పోయిన 45 డ్రోన్లలో అన్నీ శత్రు చర్యల వల్లే కూలిపోయినవి కావని తెలిపింది. ఆపరేటర్లు, డ్రోన్ల మధ్య కమ్యూనికేషన్ లింక్ తెగిపోవడంతో కొన్ని డ్రోన్లు కూలిపోయినట్లు పెంటగాన్ సమాచారాన్ని వెల్లడించిన ఓ అమెరికా అధికారి తెలిపారు.ఈ నష్టాలపై పెంటగాన్‌లో ఇప్పటికే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. మేలో అమెరికా వైమానిక దళానికి చెందిన లెఫ్టినెంట్ జనరల్ డేవిడ్ టాబోర్ సెనేటర్లకు ఇచ్చిన సమాచారం ప్రకారం, క్రియాశీల రీపర్ డ్రోన్ల సంఖ్య సుమారు 135కి తగ్గిపోయింది.

## ఇంకా చీకట్లోనే బంగ్లాదేశ్.. కొత్త ప్రభుత్వానికి చుక్కలు



**ఢాకా, ఆగస్టు 14:** బంగ్లాదేశ్‌లో రెండు రోజుల క్రితం తలెత్తిన విద్యుత్ సంక్షోభం తీవ్రమవుతోంది. గ్యాస్ టెర్మినల్‌లో సమస్య కారణంగా ఎల్ఎన్జీ నిలిచిపోవడం, దేశంలో గ్రిడ్ కుప్పకూలే పరిస్థితికి చేరుకోవడంతో మొదలైన ఈ సమస్య ఇంకా కొనసాగుతోంది. ఇప్పటికే ప్రభుత్వం మాల్స్, షాపులు, వ్యాపార సంస్థల్ని రాత్రి 8 గంటలకే మూసేయాలని ఆదేశాలు ఇచ్చింది. అయినా పరిస్థితి ఇంకా అదుపులోకి రాలేదు. మరోవైపు భారత్ నుంచి డీజిల్ కోరుతూ ఇప్పటికే బంగ్లా ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరోసారి బంగ్లాలో ప్రజా తిరుగుబాటు తప్పేలా లేదు. బంగ్లాదేశ్‌లో విద్యుత్ సంక్షోభం ఊహించని రీతిలో తీవ్రరూపం దాల్చింది. దేశవ్యాప్తంగా కరెంట్ కోతలు విపరీతంగా పెరిగిపోవడంతో తాత్కాలిక ఉపశమనం కోసం తారిఖ్ రెహ్మాన్ ప్రభుత్వం దేశంలోని అన్ని నివాస, వాణిజ్య ప్రాంతాల్లో ఉన్న షాపింగ్ మాల్స్, మార్కెట్లు, ఇతర దుకాణాలను రాత్రి 8 గంటలకే మూసివేయాలని ఆదేశాలు ఇచ్చింది. మరోవైపు ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. దీనికి తోడు గంటల తరబడి సాగుతున్న విద్యుత్ కోతలు ప్రజల జీవితాన్ని నరకప్రాయంగా మార్చాయి. ఈ నేపథ్యంలో స్థానిక విద్యుత్ స్టేషన్లపై ప్రజలు పలు చోట్ల దాడులకు దిగుతున్నారు. దీంతో ఆరు నెలల క్రితమే ఏర్పడిన ప్రభుత్వానికి చుక్కలు కనిపిస్తున్నాయి. కరెంట్ కష్టాల నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతిపక్ష పార్టీలు కూడా రంగంలోకి దిగాయి. సంక్షోభాన్ని పరిష్కరించడంలో విఫలమవుతున్నారంటూ ప్రధిని తారిఖ్ రెహ్మాన్‌పై విమర్శల దాడి తీవ్రతరం చేశాయి. దేశంలో అప్రకటిత కరెంట్ కోతలు రాత్రి వేళల్లోనూ కొనసాగుతుండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఉక్కపోతతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. తగినంత ఇంధన లభ్యత లేకపోవడం వల్లనే విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని చెబుతున్నారు.

## వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**హైదరాబాద్,ఆగస్టు14:** ఈనెల 15న దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా దేశ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.
స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, ధైర్యసాహసాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్రం, సార్వభౌమత్వం, సమగ్రతను పరిరక్షి ంచేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. భారత్‌ను మరింత బలమైన, స్వావలంబనతో కూడిన ఆత్మనిర్భర్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని శివప్రతాప్ శుక్లా కోరారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందేలా శాంతి, సౌభ్రాతృత్వం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.ఐక్యతతోనే అభివృద్ధి.. ఐక్యత, సమగ్రత, అభివృద్ధి స్ఫూర్తితో ఉజ్వల భారతావని నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ ఆకాంక్షి ంచారు. దేశ ప్రగతిలో యువత, మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.త్రివర్ణ పతాకం ఎల్లప్పుడూ గర్వంగా రెపరెపలాడాలని, దాని మూడు రంగులు దేశ ప్రజల్లో ధైర్యం, శాంతి, విశ్వాసానికి ప్రతీకలుగా నిలవాలని గవర్నర్ ఆకాంక్షి ంచారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని

# 17 నుంచి భోగాపురం విమానాలు రాకపోకలు

### ప్రయాణికులు, వాణిజ్య విమాన సర్వీసులకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన గేట్‌వే ఆఫ్ ది ఈస్ట్



విశాఖపట్నం, ఆగస్టు 14 ప్రభాతవార్త : భోగాపురంలోని అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 17, 2026 నుంచి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ నేపథ్యంలో షెడ్యూల్ చేయబడిన అన్ని దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల విమాన సర్వీసులు కొత్త విమానాశ్రయానికి మారనున్నాయి. గేట్‌వే ఆఫ్ ది ఈస్ట్‌గా రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మౌలిక వసతులతో విమానయాన సంస్థలు, ప్రయాణికులకు స్వాగతం పలికేందుకు సిద్ధమైంది. సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం, సమర్థవంతమైన విమానాశ్రయ కార్యకలాపాలు, భవిష్యత్‌లో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విస్తరించగల సామర్థంతో దీనిని అభివృద్ధి చేశారు. కొత్త విమానాశ్రయానికి కార్యకలాపాల మార్పు ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలకు మెరుగైన కనెక్టివిటీతో పాటు పర్యాటకం, కార్గో, వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభించనుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవిఐఏఎల్) అభివృద్ధి చేసి, నిర్వహిస్తున్న ఈ విమానాశ్రయాన్ని కార్యకలాపాల సామర్థం, ప్రయాణికుల సౌకర్యం, దీర్ఘకాలిక విస్తరణకు అనుగుణంగా రూపొందించారు. ఆగస్టు 17 నుంచి విశాఖపట్నం నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు భోగాపురంలోని కొత్త సమీకృత అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వినియోగించనున్నారు. ఈ విమానాశ్రయం ఐఏటీఏ కోడ్ విటిజెడ్ కార్యకలాపాలు నిర్వహించనుంది.
77,342 చదరపుమీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత ప్రయాణికుల టెర్మినల్లో చెక్‌ఇన్, భద్రతా తనిఖీలు, ఇమ్మిగ్రేషన్, బ్యాగేజీ నిర్వహణ, బోర్డింగ్ వంటి ప్రయాణ ప్రక్రియకు అవసరమైన ఆధునిక సదుపాయాలన్నీ ఒకేచోట అందుబాటులో ఉన్నాయి. అధునాతన బ్యాగేజీ, హ్యాండ్లింగ్ వ్యవస్థలు ప్రయాణికుల సామాన్లను టెర్మినల్‌లో సమర్థవంతంగా తరలించేందుకు దోహదపడతాయి. ప్రస్తుత వాణిజ్య విమాన సర్వీసుల అవసరాలతో పాటు భవిష్యత్‌లో పెరగనున్న విమాన రాకపోకలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశారు. ప్రారంభ దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థం కలిగిన ఈ విమానాశ్రయాన్ని భవిష్యత్‌లో 4 కోట్లకు పైగా ప్రయాణికుల సామర్థ్యానికి విస్తరించవచ్చు. ఎయిర్‌సైడ్ మౌలిక వసతుల్లో 3,800 మీటర్ల కోడ్ 4ఈ రన్‌వే, సమాంతర ట్యాక్సీ వే, ర్యాపిడ్ ఎగ్జిట్ ట్యాక్సీవేలు, 18 విమానాల పార్కింగ్ స్టాండ్లు ఉన్నాయి. ఇవి షెడ్యూల్డ్ విమాన సర్వీసుల నిర్వహణతో పాటు భవిష్యత్ విస్తరణకు అవసరమైన మౌలిక వసతులను అందిస్తాయి. విమానాశ్రయ రోజువారీ కార్యకలాపాల్లో సాంకేతికత కీలక పాత్ర పోషించనుంది. స్మార్ట్ ఎయిర్‌పోర్ట్ వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రయాణికుల సేవలు, ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా రియల్‌టైమ్ కార్యకలాపాలపై సమగ్ర అవగాహన, ముందస్తు విశ్లేషణలు అందుబాటులోకి వస్తాయి. ఇవి సమన్వయంతో నిర్ణయాలు తీసుకోవడంతో పాటు విమానాశ్రయ కార్యకలాపాల సమర్థవంతమైన నిర్వహణకు తోడ్పడతాయి. కొత్త విమానాశ్రయానికి కార్యకలాపాల మార్పు ఈ ప్రాంత విమానయాన రంగంలో కూడా ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ఆధునిక మౌలిక వసతులు, మెరుగైన ప్రయాణికుల ప్రాసెసింగ్ సామర్థ్యాలు, భవిష్యత్ విస్తరణకు అవకాశం కలిగిన ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రాంతంలో విమాన కనెక్టివిటీ, ప్రయాణికుల రాకపోకలు, పర్యాటకం, వ్యాపార ప్రయాణాలు, కార్గో, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి మరింత ఊతం అందించనుంది. ఆగస్టు 17న తొలి వాణిజ్య విమాన సర్వీసులకు స్వాగతం పలికేందుకు అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతోంది.

## హిందువుల పైకి హైడ్రా... పాతబస్తీకి ఉచిత కరెంటా?

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రంచందర్‌రావు ఆగ్రహం

**హైదరాబాద్,ఆగస్టు14:ప్రభాతవార్త:** పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన... కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామనే రీతిలో సీఎం మాట్లాడటాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు. నిబంధనలు పాటించడం లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగిందనే సాకుతో హైడ్రా ద్వారా పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు చూపించని సానుభూతిని, విద్యుత్ బిల్లులు చెల్లించని మైనారిటీల విషయంలో ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నించారు. ఒకవైపు సామాన్య పేద హిందూ కుటుంబాలపై హైడ్రాను ప్రయోగిస్తూ వేధింపులకు గురిచేస్తూ... మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు కట్టకపోవడాన్ని సమర్థిస్తూ ప్రోత్సహించేలా మాట్లాడటం కాంగ్రెస్ నైజానికి నిదర్శనమని మండిపడ్డారు. హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, ఖిలాఫత్ ఉద్యమం నాటి నుంచి నేటి వరకు వారి విధానంలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు.

# దుర్గమ్మ సన్నిథిలో వరుణ యాగం ప్రారంభం





**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 14, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో వరుణ యాగ పూజాదికాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను నివారించి, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, నదులు, చెరువులు, జలాశయాలు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దేవాదాయ శాఖ కమీషనర్ ఇచ్చిన ఉత్తర్వులు మేరకు ఉదయం దేవస్థానంలో దీక్షాపూర్వకంగా వరుణ యాగం సంబందించిన పూజలు నిర్వహిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 6:15 నుండి శ్రీ దుర్గాస్నానఘాట్లో విఘ్నేశ్వర పూజతో వరుణ యాగ పూజా కార్యక్రమములు ప్రారంభం కాగా ప్రత్యేక పూజల్లో ఈవో వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పండితులు వరుణ అనువాక సహిత కారక పారాయణలు నిర్వహించారు. ఈ పారాయణలు కొరకు పండితుల బృందం పవిత్ర కృష్ణానదిలో నడుంలోతు నీళ్లలో ఉండి సకాలంలో వర్షాలు పడాలని పారాయణం చేసారు.
- దుర్గమ్మవారి ఆలయాభివృద్ధి పనుల పరిశీలన: విజయవాడ దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఈఓ సీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు సభ్యులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు.ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన అన్నదానం భవనం మరియు ప్రసాదం పొట్టు (తయారీ) భవన నిర్మాణ పనులను వారు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, అందుబాటులోకి రానున్న వసతులపై ఎంపీ కేశినేని చిన్ని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అన్నదాన భవనం, ప్రసాదం తయారీ కేంద్రాల నిర్మాణాలు పూర్తి కావడం సంతోషకరమన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవపు వేడుకలు మహామండపం 7వ అంతస్తులో ఘనంగా జెండా వందన కార్యక్రమం ఉదయం 7 గంటలకు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

## హత్య కేసులో ఇరువురు ట్రాన్స్‌జెండర్లు అరెస్ట్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు14, ప్రభాతవార్త.** భిక్షాటన డబ్బులు వాటాలు పంపకాలలో వచ్చిన విభేదాలతో జరిగిన హత్య కేసును ఛేదించిన కాకినాడ జిల్లా పోలీసులు నిందితులుగా ఇరువురు ట్రాన్స్ జెండర్లు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు కేసు వివరాలు ప్రకారం కాకినాడ 3 టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల జ్యోతుల కాలనీ, తోటమ్మవారివీధిలో ఈ నెల 3 వ తేదీన ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు మరియు వాళ్ళతో పాటు తిరిగే ఒక వ్యక్తికి డబ్బుల విషయంలో జరిగిన గొడవ విషయమై పోలీసులు కేసు నమోదు చేసారు. ఇద్దరు ట్రాన్స్ జెండర్లు జెస్సీ, పప్పీ కలసి రాజు శివ అనే వ్యక్తిని త్రీవంగా కొట్టారు. ఈమేరకు రాజు రాజేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. సాగర్ బాబు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.చికిత్స పొందుతున్న రాజు శివ పరిస్థితి విషమించి 6న మరణించడంతో సదరు కేసును హత్య కేసుగా ఆల్టర్ చేసారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రత్యేక దృష్టి సారించ గా ప్రత్యేక క్రైమ్ బృందాలతో విచారణ చేపట్టారు.
నిందితులు పోర్ట్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో తిరుగుతుండగా సాయిపోగు కిరణ్మయి(జెస్సీ), రెడ్డిపోగు అజయ్ కుమార్ (పప్పీ) అనే ట్రాన్స్ జెండర్లను అరెస్ట్ చేశారు.వారి ద్వారా నేరానికి ఉపయోగించిన సిమ్మెంటు రాయి మరియు కర్ర ను సేకరించి సీజ్ చేసారు. ముద్దాయిలు కర్నూలు జిల్లా కల్లూరు గ్రామస్తులైన సాయిపోగు కిరణ్మయి, రెడ్డిపోగు అజయ్ కుమార్ లుగా గుర్తించారు. వీరు కొంత కాలం క్రితం ట్రాన్స్ జెండర్లుగా మారి వారి వృతి లో భాగంగా కాకినాడ పట్టణ పరిసర ప్రాంతాలలో షాపుల వద్ద డబ్బులు తీసుకుంటూ, భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నారు. మృతుడు అయిన కాకినాడ, రాగంపేట, రెల్లివీధి కి చెందిన రాజు శివ అనే 41 సం॥ల వ్యక్తి పట్టణం లోని ఒక ప్రైవేటు ఆసుపత్రి లో బాత్రూమ్ లు శుభ్రం చేసుకుంటూ జీవించేవాడు. రాజు శివకు ఇంకా వివాహం కాలేదు. మృతుడు అప్పుడప్పుడూ ముద్దాయిలతో కలసి భిక్షాటనకి కూడా వెళ్ళేవాడు. ఇదే క్రమంలో ఈ నెల 3 వ తేదీన డబ్బుల విషయమై మృతునికి, ముద్దాయిలకు జరిగిన గొడవలలో ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు కలసి రాజు శివను కాళ్లతో వృషణాలపై తన్నడం, చేతులతోనూ, కర్రతోను, సిమ్మెంటు రాయితోను దవడపై కొట్టడం వలన తీవ్ర రక్తస్రావం జరిగి మరణించినట్లు విచారణలో తేలింది. త్వరితగతిన హత్య కేసును ఛేధించి ముద్దాయిలను పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, ఎస్ఐ సాగర్ బాబు, హెడ్ కానిస్టేబుల్స్ పి.పౌలు, ఏ.సతీష్, కానిస్టేబుల్స్ టి.మురళీరాజు, కే.శ్రీనివాస్ క్రైమ్ స్టాఫ్‌ను కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అభినందించారు.